మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

బుధవారం WEDNESDAY 17.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+4+ 8పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+4+ 8 Pages NIPUNA Special Supplement | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 103 ‖ వెల (Price) రూ.6.50

ఏకాదశి

బుధవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-16. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: ఏకాదశి రాత్రి 11-40 వరకు. నక్షత్రం: పునర్వసు ఉదయం 6-26 వరకు, తదుపరి పుష్యమి. వర్జ్యం: పగలు 2-26 నుంచి సాయంత్రం 4-03 వరకు. రాహుకాలం: పగలు 12-10 నుంచి పగలు 1-41 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 11-46 నుంచి పగలు12-34 వరకు. అమృతకాలం: రాత్రి 12-06 నుంచి రాత్రి 1-43 వరకు.



ఆయుధాలు వదిలేస్తం

మావోయిస్టుల సంచలన నిర్ణయం!

- సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తం
- ఈ అంశంపై పార్టీ సహచరులతో చర్చించుకుంటం
- 30 రోజులపాటు కాల్పుల విరమణ ప్రకటించండి
- కేంద్ర హోంమంత్రి లేదా ప్రతినిధులతో చర్చలకు సిద్ధం
- వీడియో కాల్ ద్వారానైనా సంప్రదింపులు జరపాలి
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ

కొత్తగూడెం ప్రగతిమైదాన్, సెప్టెంబర్ 16: మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం తీసుకున్నది. ఆయుధాలు విడిచిపెట్టేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మారిన ప్రపంచ, దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి, సీనియర్ పోలీస్ అధికారులు నిరంతరం చేసిన అభ్యర్థనల దృష్ట్యా తమ పార్టీ ఆయుధాలను వదులుకోవాలని నిర్ణయించుకుంటున్నదని ఆ పార్టీ నేత అభయ్ పేరుతో ఒక లేఖ విడుదలైంది. సాయుధ › 8వ పేజీలో

విద్యుత్తు ఏడీఈ అక్రమార్జన
200 కోట్లు!

- అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు
- రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ సహా 11 చోట్ల తనిఖీలు
- బినామీకి చెందిన ఇంట్లో రూ.2.18 కోట్ల నగదు లభ్యం
- భారీగా ఆభరణాలు స్వాధీనం.. అక్రమాస్తుల గుర్తింపు

› 10

అవినీతి నిరోధక శాఖ మరో అవినీతి అధికారిని పట్టుకున్నది. విద్యుత్తు శాఖలో విధులు నిర్వర్తిస్తూ అక్రమ సంపాదనలో రూ.వందల కోట్లకు పడగలెత్తిన ఇబ్రహీంబాగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీఈ) ఇరుగు అంబేద్కర్‌ను అరెస్టు చేసింది. మంగళవారం ఉదయం అతని ఇండ్లు, కుటుంబసభ్యులు, స్నేహితులు, బినామీలకు చెందిన 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టి.. భారీగా నగదు, నగలు, స్థిర, చరాస్తుల పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రూ.2.18 కోట్ల లిక్విడ్ క్యాష్ పట్టుబడటం గమనార్హం!

ఈ పాపం ఎవరిది?

- అవినీతి ఏడీఈ వెనుక గట్టి మంత్రి.. బదిలీ వేటు పడినా కాపాడిన అమాత్యుడు
- గతంలో 'బిగ్‌బ్రదర్'కు షాక్ ఇచ్చిన ఏడీఈ.. ఫ్లాట్ కరెంట్ కనెక్షన్‌కు లంచం
- దీంతో బదిలీ వేటు వేయించిన 'బిగ్‌బ్రదర్'.. మంత్రి సిఫారసుతో మళ్లీ రంగంలోకి
- మొత్తం వ్యవహారంపై చిర్రెత్తిన ముఖ్యనేత.. ఆ నేపథ్యంలోనే ఏసీబీ దాడి!





నాడు ఎగదోసి.. నేడు ఎగవేసి!

ఫార్మాపై కాంగ్రెస్ దగా

- ఫార్మాసిటీ భూములపై నాడు రైతులను రెచ్చగొట్టిన నేతలు
- అధికారంలోకి వస్తే వారి భూములు తిరిగి ఇస్తామని హామీ
- ఇప్పుడవే భూముల్లో పోలీసులను పహారా పెట్టి ఫెన్సింగ్
- కోర్టు అథారిటీ నోటీసులతో కాంగ్రెస్‌పై రైతన్నల ఆగ్రహం
- కాంగ్రెస్ నేతలూ తమతో కోర్టుకు రావాలంటూ డిమాండ్
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి తేల్చిచెప్పిన బాధితులు
- న్యాయం జరిగేవరకు పోరాటం ఆపబోమంటూ స్పష్టీకరణ



బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఫార్మాసిటీ కోసం రైతుల నుంచి భూముల్ని అన్యాయంగా గుంజుకుంటున్నారని రేవంత్ రెడ్డి, భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి పలుమార్లు మా గ్రామాల్లోకి వచ్చి రైతుల్ని రెచ్చగొట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మా భూములపై తిరిగి పూర్తి హక్కుల్ని కల్పించి ఆన్‌లైన్ సేవల్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు కోర్టు అథారిటీ నుంచి మాకు నోటీసులు పంపారు. అథారిటీ ఆదేశాల మేరకు అక్టోబరు ఒకటో తేదీన కోర్టుకు హాజరవుతున్నాం. మీరు కూడా మా రైతులకు అండగా ఉండి మాతో పాటు రావాలని కోరుతున్నాం.

-ఫార్మాసిటీ బాధిత రైతుల డిమాండ్


హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/యాచారం, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఫార్మాసిటీపై నిత్యం విషం చిమ్మిన కాంగ్రెస్ నేతలు రైతులతో కలిసి ధర్నాలు, పాదయాత్రలు చేశారు. తమకు ఓటేసి గెలిపిస్తే అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దుచేసి మీ భూములను మీకు తిరిగి ఇస్తామంటూ హామీలు గుప్పించారు. చివరకు కోర్టుకు సైతం రైతులతో కలిసి వెళ్లి మీకు అండగా ఉంటామని › 3వ పేజీలో

ఆర్ఆర్ఆర్‌పై కోమటిరెడ్డి ధోకా

'రీజినల్ రింగ్ రోడ్డు పేరిట పంట భూములు ఎట్లా తీసుకుంటరు? మేం అధికారంలోకి రాగానే ట్రిపుల్‌ఆర్‌ను ఆపుతం' అంటూ నాడు రైతుల్ని రెచ్చగొట్టిన కోమటిరెడ్డి ఇప్పుడదే ఆర్ఆర్ఆర్‌కు కొత్త గీతలు గీయిస్తున్నరు. అడిగే రైతులపై పోలీసులను ప్రయోగిస్తున్నరు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని నాడు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే తెప్ప తగిలేసింది. రైతుల భూముల్ని గుంజుకుంటూ ఉల్టా కేసులు పెట్టిస్తున్నది. ఇదీ కాంగ్రెస్ ద్వంద్వనీతి! దగా వైఖరి!

- నాడు అలైన్‌మెంట్ మార్పుపై హామీలు, ఆందోళనలు
- నేడు స్వయంగా ఆ శాఖ మంత్రిగా ఉన్నా ఉలుకే లేదు
- కనీసం నిర్వాసిత రైతులను కలిసే తీరిక కూడా లేదా?
- రైతులను అరెస్టు చేయించి.. స్టేషన్లో పెట్టించిన మంత్రి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : 'ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా ఉన్నది రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తరీఖా! ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై ఎన్నో ముచ్చట్లు చెప్పిన ఆయన.. అధికారంలోకి వచ్చాక బాధిత రైతులవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పైగా రోడ్లు, రహదారుల మంత్రిత్వ శాఖ కూడా ఆయన పరిధిలోనే ఉన్నా ఇసుమంతైన పట్టించుకోవడంలేదు. రైతులు తమ గోడును వెళ్లబోసుకొనేందుకు పదుల సార్లు హైదరాబాద్ వచ్చినా కనీసం › 3వ పేజీలో



ఆర్ఆర్ఆర్ అయ్యేదా.. పొయ్యేదా?

- అప్పటివరకు నువ్వుంటవో.. నేనుంటనో తెల్వదు
- ఎన్ని తరాలు.. ఎన్ని ప్రభుత్వాలు మారాల్నో!
- నల్లగొండల నేను బైపాస్ రోడ్డు వేయిస్తున్న!
- అక్కడి రైతులకు కోటీ, కోటిన్నర ఇస్తున్న!
- అప్పటిదాక నేనుంటే మీకూ అట్లనే వస్తయ్ పోండ్రి
- పుట్టపాక భూబాధితులతో కోమటిరెడ్డి వ్యాఖ్యలు
- మంత్రి మాటలపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న రైతులు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్‌పై తాజాగా రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఓ వైపు నిత్యం ఢిల్లీకి వెళ్లి ట్రిపుల్ ఆర్ వేగవంతం చేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసే కోమటిరెడ్డి.. బాధిత రైతుల వద్దకు వచ్చే సరికి మాత్రం 'అది అయ్యేదా.. › 3వ పేజీలో

› 6

మెట్రో ఎండీగా సర్ఫరాజ్



- ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి
- పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- సాగుకలిసి రాక తీవ్ర మనస్తాపం
- వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో విషాదం

› 3

ఈ నగరానికి ఏమైంది?

గోనె సంచిలో మహిళ మృతదేహం

చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద పడేసి వెళ్లిన దుండగులు

కిస్మత్‌పుర బ్రిడ్జి వద్ద యువతి డెడ్‌బాడీ

- ఒంటిపై బట్టలులేని స్థితిలో గుర్తింపు..
- లైంగికదాడి చేసి చంపినట్టు అనుమానాలు

యాచకురాలిపై లైంగికదాడి › 2

సాగర్‌రోడ్డు ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ఘటన



కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ఆగం

సర్కారు అసమర్థ విధానాలతో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ

- రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు
- జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ విజయయాత్ర ప్రారంభం
- కొట్టుకుపోయి 3 రోజులైనా మృతదేహాలను గుర్తించరా?
- ఇంతకన్నా అసమర్థత, చేతకానితనం ఇంకోటి ఉంటదా?
- బాధిత కుటుంబాల ఆవేదన కాంగ్రెస్‌కు కనిపిస్తలేదా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని రంగాలపై కాంగ్రెస్ అసమర్థ విధానాల ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలతో చర్చించారు. ఈ ఉప ఎన్నికలో పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, › 2వ పేజీలో

నా యావదాస్తిని అమ్మి అయినా బీఆర్ఎస్‌ను గెలిపిస్తా

భద్రాచలం నేత నర్సింహమూర్తి ఉద్వేగ ప్రకటన › 2



జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం

- నానా తంటాలు పడి అజారుద్దీన్‌ను తప్పించిన సీఎం వర్గం
- ఇప్పుడు అంజన్‌కుమార్ యాదవ్ రూపంలో మళ్లీ విభేదాలు
- ఏకంగా పోస్టర్లతో హల్‌చల్ మొదలుపెట్టిన అంజన్‌వర్గం
- టికెట్ ప్రయత్నాలు ఆపని దానం.. ఖర్గేను కలిసి వినతి
- మరోవైపు సామాజిక కోణంలో నరుక్కొస్తున్న బొంతు వర్గం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దరిమిలా కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం మొదలైంది. 'నేనే పోటీదారు' అంటూ నిన్నటి దాకా మాజీ క్రికెటర్ అజారుద్దీన్, ఆయన వర్గం సీఎం వర్గానికి కొరకరాని కొయ్యలా ఉండేది. ఎలాగోలా › 6వ పేజీలో

రీయింబర్స్‌మెంట్ 50% ఎగ్గొట్టుడే!


కాలేజీలో ఒక కోర్సులో ఎన్ని సీట్లున్నా 240 సీట్లకే ఫీజు రీయింబర్స్

- ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ఎత్తుగడ
- మిగతా వారు ఫీజులు చెల్లించాల్సిందే
- త్వరలోనే కమిటీని వేయనున్న సర్కార్
- వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్ సర్కార్ తూట్లు పొడిచేందుకు సిద్ధమైంది. ఈ పథకంలో కోత పెట్టేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. ఒక కోర్సులో ఎన్ని సీట్లున్నా 240 సీట్లకే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. మిగతా సీట్లలో చేరిన వారు సొంతంగా ఫీజులను చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఒక కాలేజీలో ఏ క్యాటగిరీ, బీ క్యాటగిరీ సీట్లుండగా, తాజాగా మరో కొత్త క్యాటగిరీ పుట్టుకు రానున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఈ విధానం అమల్లోకి తేవాలని భావించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో రేషనలైజేషన్ అమలు చేస్తామని సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆ రేషనలైజేషన్ అంతరార్థం ఇదేనని కాలేజీల యాజమాన్యాలూ పేర్కొంటున్నాయి. ఈ విధానంతో సర్కారుపై పడే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం 50% తగ్గుతుందని అంచనా. ఇప్పటివరకు ఏటా రూ.2,400 కోట్ల › 10వ పేజీలో

ఆగిన ఆరోగ్యశ్రీ

- మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలు బంద్
- ప్రతి నెలా రూ.100 కోట్లు ఉత్తమాటే
- నెలనెలా డబ్బులు ఇస్తే రూ.1400 కోట్ల బకాయిలు ఎందుకు ఉంటాయ్? › 6
- 2.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో 2వేల కోట్లు లేవా?
- నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ నేత రాకేశ్


Kadiyam Srihari
MLA
H.No.2-7-1041/3, Road No.2 Kanakadurga Colony, Waddepally, Hanamkonda Mandal Hanamkonda Warangal Telangana 506370

కడియం.. రాజీనామా చెయ్


బీఆర్ఎస్ అభ్యర్థి కాబట్టే ఓటేసి గెలిపించిన!

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరికి పోస్టుకార్డు పంపిన మహిళా ఓటరు › 2

ఉప ఎన్నికలు తథ్యం..

కాంగ్రెస్ ఓటమి ఖాయం

- 'హస్తం' హనీమూన్ ముగిసింది
- కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీలోనే చేరారు.. ఉప ఎన్నికలకు పోదామని చెప్పాలి
- దసరా తర్వాత భద్రాచలంలో మీటింగ్
- రాముడి సాక్షిగా కాంగ్రెస్‌ను బొందపెడుదాం: కేటీఆర్ ధ్వజం
- భద్రాచలం ముఖ్యనేతలతో సమావేశం
- ఉప ఎన్నిక వస్తే యావదాస్తిని అమ్మి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటం
- పార్టీ సీనియర్ నేత నరసింహమూర్తి





బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేలు పార్టీ మారిన పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని, అక్కడ కాంగ్రెస్ ఓటమి ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ నైజం మోసం అని, అబద్ధాల పునాదుల మీదనే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ప్రజలకు తీరని ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలను మోసం చేయడమే తమ నైజమని రేవంత్‌రెడ్డి గతంలోనే చాలాసార్లు స్పష్టంగా చెప్పారని, అయినా ప్రజలు ఆయన అబద్ధపు హామీలను నమ్మి ఓటు వేసి మోసపోయారని చెప్పారు. కాంగ్రెస్ చెప్పినట్టుగానే మళ్లీ పాతకాలపు ఎమర్జెన్సీ రోజులను తెచ్చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేని పిరికివాళ్లుగా మారిపోయారని విమర్శించారు. ఎమ్మెల్యేలు మాత్రమే పార్టీ మారారని, నాయకులు, కార్యకర్తలు ఇంకా గులాబీ జెండాతోనే ఉన్నారని గుర్తుచేశారు. కుండ పగిలినా కుక్కబుద్ధి తెలిసినట్టు పార్టీలోని నకిలీల బుద్ధి బయటపడిందని, ఇప్పుడు పార్టీలో ఉన్నది అసలైన బీఆర్ఎస్ నాయకులని స్పష్టంచేశారు. దసరా తర్వాత భద్రాచలంలో భారీ సభ పెడదామని, రాముడి సాక్షిగా కాంగ్రెస్‌ను బొందపెడదామని పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో మంగళవారం నిర్వహించిన భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

> ఏ పార్టీ అయిన రెండు పాత్రలు పోషిస్తది. అధికార పక్షం, ప్రతిపక్షం. కానీ, బీఆర్ఎస్ మూడు పాత్రలు పోషిస్తున్నది. 14 ఏండ్ల ఉద్యమ పార్టీగా, పదేండ్లు అధికార పార్టీగా పనిచేసినం. ఇప్పుడు 20 నెలలుగా విపక్ష పార్టీగా కొనసాగుతున్నం.
> -కేటీఆర్

> అచ్చంపేట ఎమ్మెల్యే వెళ్లిపోతే పోనియండి.. కేసీఆర్ వెంట మేమున్నం అని నాయకులు, కార్యకర్తలు చెప్తున్నరు. అదే స్ఫూర్తి ఇప్పుడు భద్రాచలంలో కనిపిస్తున్నది. ఐదు గంటల ప్రయాణం చేసి 200 మంది ఇంత దూరం వచ్చిండ్రంటే ఎంత ప్రేమ ఉండాలి. దసరా తర్వాత భద్రాచలంలో భారీ మీటింగ్ పెడుదాం. రాముడి సాక్షిగా కాంగ్రెస్‌ను బొంద పెడుదాం. 8-9 నెలల్లో భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తది. మనం గెలుస్తం. మీలో ఒకరు ఎమ్మెల్యే అవుతరు. మళ్లీ మంచిరోజులు వస్తయి. - కేటీఆర్

చేసిన మంచిని చెప్పుకోలేకపోయినం

కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించడంలో విఫలమయ్యామని కేటీఆర్ చెప్పారు. 'మనం చేసిన మంచిని, అభివృద్ధిని చెప్పుకోలేకపోయినం. ఆ రోజే కాంగ్రెస్ దొంగ పార్టీ, మోసపు పార్టీ అని ప్రజలకు వివరిస్తే బాగుండేది. అనేక త్యాగాలు, ఉద్యమాలతో వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేయాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్రంపైనే దృష్టి పెట్టినం తప్ప రాజకీయాలపై పెట్టలేదు. కాంగ్రెస్ ఇప్పుడు చేస్తున్న తీరుగా అప్పుడు ప్రతిపక్షాలను అణచివేసి ఉంటే, ఒక కాంగ్రెస్ నాయకుడు కూడా ఎన్నికల్లో పోటీ చేయకపోవు. నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డిని కూడా ఏమీ చేయలేదు. చట్టప్రకారమే నడుచుకున్నం' అని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడిపించే సత్తా కాంగ్రెస్‌కు, రేవంత్‌కు లేదని, అందుకే ప్రతిసారీ పాత ప్రభుత్వంపై నెపం నెట్టేస్తున్నారని విమర్శించారు. తమ చేతగానితనాన్ని గతం చాటున దాచిపెడుతున్నారని దెప్పిపొడిచారు. కరోనా కాలంలో ఎలాంటి ఆదాయం లేకున్నా నాడు కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఒక్కటి కూడా ఆపలేదని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ పార్టీకి హనీమూన్ పీరియడ్ అయిపోయింది. అందరికీ వారిపై నమ్మకం పోయింది' అని తేల్చి చెప్పారు.

దమ్ముంటే కాంగ్రెస్‌లో చేరినట్టు చెప్పాలి

'ఎమ్మెల్యేలను చేర్చుకున్న కాంగ్రెస్‌కు దమ్ముంటే, అవును, వారు మా కాంగ్రెస్‌లో చేరారు.. ఉప ఎన్నికలకు పోదామని చెప్పాలి' అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు. 'పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మొదలుకొని ప్రతి ఎన్నికను ఎదుర్కోడానికి కాంగ్రెస్ వణికిపోతున్నది. ఎన్ని తమాషాలు చేసినా ఉప ఎన్నికలు తప్పవు. కచ్చితంగా వారికి ఓటమి ఖాయం' అని పునరుద్ఘాటించారు. ఫిరాయింపుల కారణంగా పార్టీలో కల్తీ పోయిందని, ఎవరేంటో తెలిసిందని, ఇప్పుడు పార్టీ మరింత బలంగా మారిందని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలు తమపార్టీలోనే ఉన్నారని ముఖ్యమంత్రి, రాహుల్‌గాంధీకి కూడా చెప్పుకొనే దమ్ము లేదని ఎద్దేవాచేశారు. రాహుల్ గాంధీ పార్టీ ఫిరాయింపులు వద్దు అంటే, రేవంత్‌రెడ్డి మాత్రం పార్టీ ఫిరాయింపులు చేసి బయటకు చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు.

ఏడాదైనా బాంబులేటి నోరు విప్పడం లేదు

గత దీపావళికి బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి అన్నారని, మళ్లీ దీపావళి వస్తున్నా పేలడం లేదని కేటీఆర్ ఎద్దేవాచేశారు. 'సరిగ్గా ఏడాది క్రితం ఆయన ఇంట్లో జరిగిన ఈడీ దాడులపై ఈ బాంబులేటి ఎందుకు నోరు విప్పడం లేదు' అని ప్రశ్నించారు. 'తంతే గారెల బుట్టలో పడ్డట్టు, లక్కీ లాటరీలో మంత్రి అయిన పొంగులేటి కూడా పెద్దగా మాట్లాడుతున్నరు. ప్రజాస్వామ్యంలో అహంకారంతో ఎగిరితే ప్రజలు తిప్పికొడుతరు. ఆయన మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దాం. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల గురించి కేంద్రంగాని, ఆయనగాని ఎందుకు మాట్లాడటం లేదు. ఆ దాడుల్లో దొరికిన డబ్బులు ఎన్నో ఎవరూ చెప్పలేదు. మరి పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యాడా? లేదా బీజేపీతో కుమ్మక్కైన రేవంత్‌రెడ్డితో కలిసిపోయాడా?' అని ప్రశ్నించారు. సీబీఐ సహా వంద కేంద్ర సంస్థలతో, బీజేపీతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కైందని ఆరోపించారు. బతికినంత కాలం ధైర్యంగా బతకాలి తప్ప ఇంత నీచమైన కుమ్మక్కు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు.

తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్ఎస్

కేంద్ర ప్రభుత్వ సంస్థలను, కాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్రలను ఎదుర్కొంటున్నది బీఆర్ఎస్‌యేనని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్, బీజేపీల ఏకైక లక్ష్యం తెలంగాణ గొంతుకైన బీఆర్ఎస్‌ను లేకుండా చేయడమేనని, కానీ తెలంగాణ ఉన్నంత కాలం గులాబీ జెండా ఎగుతూనే ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో పార్టీ ఎల్లకాలం బలంగా ఇలాగే కొనసాగుతుందని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజల తరపున కొట్లాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు. ఎన్టీఆర్ తర్వాత ఒక ప్రాంతీయ పార్టీని పెట్టి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న ఏకైక తెలుగు నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దగా పడ్డ తెలంగాణ కోసం తన జీవితాన్ని, ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు.

> ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ వంటి చాలా మంది ముఖ్యమంత్రులను చూసిన. కానీ, రేవంత్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఇంతవరకు చూడలే. గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా అంటడు. పేగులు తీసి మెడలో వేసుకుంటా అంటడు. సచివాలయంలో లంకెబిందెలు ఉన్నాయనుకున్న అంటడు.. నా దగ్గర పైసల్లేవు కోసుకుతింటరా అంటడు. ఆయనేమైనా సేపా.. జమకాయనా?
> -కేటీఆర్

ఆస్తిని అమ్మి అయినా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తా




భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే తన యావదాస్తిని అమ్మి అయినా సరే అక్కడ ఎవరికి టికెట్ ఇచ్చినా అన్ని పనులూ వదులుకొని గెలిపించుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత నరసింహమూర్తి ప్రకటించారు. 'యంగ్ లీడర్ కేటీఆర్‌ను కలవడం సంతోషంగా ఉన్నది. తెల్లం వెంకట్రావ్‌ను కష్టపడి గెలిపిస్తే ఆయన మూడు నెలలే పార్టీ మారిండు. నాపై అనేక అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నడు. కాంగ్రెస్ కార్యకర్తల కంటే దారుణంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారులు, కలెక్టర్ల కోసం మనం పింక్ బుక్ పెట్టాలి. కేసీఆర్ నాకు తండ్రితో సమానం. నా సంపాదన అంతా పార్టీకి ధారాదత్తం చేస్తా. భద్రాచలంలో పార్టీ అభ్యర్థిని గెలిపిస్తా' అని స్పష్టంచేశారు. నరసింహమూర్తి భావోద్వేగంతో మాట్లాడిన మాటలపై కేటీఆర్ స్పందించారు. 'మీ స్ఫూర్తికి, మీ మాటలకు హృదయపూర్వకంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అని తెలిపారు.

'రాముడి చరిత్రే మనకు ఆదర్శం. వనవాసం అనంతరం పుణ్యపురుషుడు రాముడు పట్టాభిషిక్తుడయ్యాడు. మళ్లీ మనందరం కూడా కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రభుత్వంలోకి వస్తాం' అని ధీమా వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి లాంటి నాయకులను చూసినప్పుడే కేసీఆర్ ఎంత గొప్పవారో అర్థమవుతుందని, చీకటి ఉంటేనే వెలుగు విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, సీనియర్ నేతలు నర్సింహమూర్తి, రాంప్రసాద్, రామకృష్ణ, సత్యం, రాంబాబు, తాతారావు, రాముడు, లక్ష్మి, సునీల్ పాల్గొన్నారు.

> రెండేండ్లు కరోనా కాలంలో రాష్ట్రానికి దమ్మిడి ఆదాయం లేకున్నా ఒక్క సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా ఆపలేదు. వేతనాలు, పింఛన్లు, రైతుబంధు, కేసీఆర్ కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి అన్ని పథకాలు అమలు చేసినం. మనిషికి ఉండాల్సింది కండ కాదు.. మానవత్వంతో స్పందించే గుండె.. అది కేసీఆర్‌కు ఉన్నది కాబట్టే కరోనా కష్టకాలంలోనూ సంక్షేమం ఆగలేదు.
> -కేటీఆర్

లోకం పోకడ



ఈ మధ్య అంబులెన్సులు ఇలాగే సైరన్ ఇస్తున్నాయి!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.8°c	22.2°c
నిజామాబాద్	33.5°c	24.2°c
రంగారెడ్డి	33.3°c	20.2°c
మెదక్	33.1°c	23.0°c
ఖమ్మం	31.0°c	24.0°c
వరంగల్	31.0°c	22.0°c
కరీంనగర్	31.0°c	24.0°c
హైదరాబాద్	29.8°c	21.8°c
మహబూబ్‌నగర్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	23.8°c

300 ఇవ్వలేక ఆటో డ్రైవర్ హత్య

ఇద్దరు నిందితుల అరెస్ట్

జగిత్యాల సమీపంలో ఘటన

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 16 : మూడొందల ఆటో కిరాయి విషయంలో ఓ ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌ను దారుణంగా హతమార్చారు. ఈ ఘటన జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామ శివారులో చోటుచేసుకున్నది. డీఎస్పీ రఘుచందర్ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుతారిపేటకు చెందిన ఆటో డ్రైవర్ నయిమొద్దీన్(50) తన ఆటోలో ప్రయాణికులను ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ధర్మపురికి తీసుకుని వెళ్తున్న సమయంలో బిహార్ రాష్ట్రం సంస్తిపూర్ జిల్లాకు చెందిన దర్శన్ సాహ్ని, సునీల్ సాహ్ని ఆటో ఎక్కారు. గుల్లపేటలో దిగేందుకు రూ.300 కిరాయి మాట్లాడుకున్నారు. గుల్లపేటలో దిగిన తర్వాత కిరాయి చెల్లింపు విషయంలో ఆ ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌తో గొడవకు దిగారు. నయిమొద్దీన్ మెడను గుడ్డతో నులిమి, బండరాయితో దాడి చేసి క్రూరంగా హత్య చేశారు. తర్వాత మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జగిత్యాల రూరల్ పోలీసులు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధారాలను సేకరించి తక్షణమే నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి హత్య సమయంలో ఉన్న రక్తపు మరకల దుస్తులు, దొంగిలించిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

కడియం.. రాజీనామా చెయ్

ఎమ్మెల్యేకు పోస్టుకార్డు పంపిన ఓటరు

జనగామ, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఓ మహిళా ఓటరు డిమాండ్ చేసింది. 'నా అమూల్యమైన ఓటుతో గెలిచావు.. కాంగ్రెస్ పార్టీలో చేరినావు.. ఇప్పుడేమో రైతులను అరిగోస పెడుతున్నవు.. వెంటనే ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకోవాలి' అని సూచిస్తూ జనగామ జిల్లా లింగాలఘనపురం మండల కేంద్రానికి చెందిన ఉడుగుల భాగ్యలక్ష్మి పోస్టుకార్డు రాసింది. ఈ ఉత్తరాన్ని ఆమె హనుమకొండలోని కడియం ఇంటి అడ్రస్‌కు పంపించడం మంగళవారం చర్చనీయాంశంగా మారింది. తాను స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థినని, తనను గెలిపించాలని ఎన్నికల సమయంలో కోరితే తాను కారు గుర్తుకు ఓటువేసి గెలిపించానని ఆమె ఆ లేఖలో పేర్కొంది. 'గెలిచిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరావు. రైతులను గోసపెడుతున్నావు. అందువల్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి' అని కోరింది. కడియం రాజీనామా చేయాలని ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులు ముప్పేట దాడి చేస్తూ ఒత్తిడి పెంచుతుంటే తాజాగా ఓ మహిళ తాను ఓటేసిన పార్టీలో ఉండకుండా ఫిరాయించినందుకు రాజీనామా చేయాలని కోరుతూ పోస్టుకార్డు రాయడం సంచలనంగా మారింది.

తెలంగాణ భవన్‌లో నేడు జాతీయ సమైక్యతా దివస్

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగరవేస్తారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులతో పాటు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు కేటీఆర్ 5 లక్షల సాయం

తాడ్వాయి, సెప్టెంబర్16 : లివర్ మార్పిడి చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న ములుగు జిల్లా తాడ్వాయి మాజీ జడ్పీటీసీ భర్త పులుసం పురుషోత్తంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.5 లక్షలు సాయం అందించారు. రెండు సంవత్సరాలు హైదరాబాద్‌లో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులతో తాడ్వాయి మండలం పంబాపురంలో ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్న పురుషోత్తంకు చేయూతనిచ్చారు. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణబాబు ద్వారా విషయం తెలుసుకున్న కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు మంగళవారం రూ.5 లక్షలను చెక్కు రూపంలో పంపించారు.



మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎల్ రమణ, సలీమ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఫారూక్ హుస్సేన్, ముఠా గోపాల్, దాస్యం వినయ్‌భాస్కర్

కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ఆగం

మొదటిపేజీ తరువాయి...

జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. 22 నెలలుగా కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ అసమర్థ విధానాలతో నష్టపోయాయని, వారంతా కాంగ్రెస్ పాలనపై తీవ్ర కోపంగా ఉన్నారని తెలిపారు. వారంతా బీఆర్ఎస్‌నే ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారని చెప్పారు.

> హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ సర్కారు విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నయి. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నరు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నరు.
> -కేటీఆర్

3 రోజులైనా మృతదేహాలను గుర్తించరా?


'హైదరాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను మూడు రోజులైనా గుర్తించలేదు. ఇంతకన్నా అసమర్థత, చేతకానితనం, పరిపాలనా వైఫల్యం ఇంకోటి ఉంటదా? కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత, మానవత్వం లేని కాంగ్రెస్‌కు కనిపించడం లేదా?' అని ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఆరుగురిని సజీవ సమాధి చేసి ఇప్పటికే మహాపాపం మూటగట్టుకున్నారని, నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు.

బీజేపీది నకిలీ జాతీయవాదం

వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్ఎస్ స్వాగతించడాన్ని విమర్శిస్తున్న బీజేపీ నేతలకు భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు మీద ఏమాత్రం గౌరవం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీది నకిలీ జాతీయవాదమని, తమది ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయవాదమని స్పష్టంచేశారు. కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి భారతీయుడినీ సమానంగా ఆదరించడమే తమ దృష్టిలో నిజమైన జాతీయవాదమని చెప్పారు. జాతీయవాదానికి, దురహంకార దేశభక్తికి (జింగోయిజం) మధ్య ఉన్న తేడాను తెలుసుకోవడమే అసలైన దేశభక్తి అని స్పష్టంచేశారు. పహల్గాం దారుణ మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడించిన బీజేపీకి బీఆర్ఎస్ దేశభక్తి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో చిందిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యమని మండిపడ్డారు. పహల్గాం బాధిత కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోకుండా కోట్లాది భారతీయులను మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని నిప్పులు చెరిగారు.

మహేశ్ కుటుంబానికి కేటీఆర్ అండ

- వేతనాలందక ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కార్మికుడు
- బాధిత కుటుంబానికి 5.5 లక్షల ఎఫ్‌డీ
- బాండ్లను అందజేసిన బీఆర్ఎస్ నేతలు



మహేశ్ భార్య, పిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందిస్తున్న బడే నాగజ్యోతి, లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

ములుగు, సెప్టెంబర్16 (నమస్తేతెలంగాణ) : ములుగు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మైదం మహేశ్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం మహేశ్ కుటుంబానికి రూ.5.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మంగళవారం మాధవరావుపల్లిలోని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. మహేశ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 3న మహేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఈనెల 7న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి పరామర్శించారు. పార్టీ తరపున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు మంగళవారం మహేశ్ కుటుంబ సభ్యులకు రూ.5.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నెలల కొద్ది జీతాలు ఇవ్వకపోవడంతో మనోవేదనతో కార్మికులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖలో కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. స్థానిక మంత్రి సీతక్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే మహేశ్ ఆత్మహత్య ఘటన చోటు చేసుకున్నదని విమర్శించారు.

నిద్రలో ఉన్న భర్తపై వేడినూనె పోసిన భార్య

దవాఖానలో చికిత్స పొందుతూ మృతి

జోగుళాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల, సెప్టెంబర్ 16: నిద్రపోతున్న భర్తపై వేడి నూనె పోయడంతో తీవ్రంగా గాయపడ్డ అతడు చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. గద్వాల సీఐ శ్రీను కథనం ప్రకారం.. మల్దకల్ మండలం మల్లెందొడ్డికి చెందిన వెంకటేశ్ (29), పద్మ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగేండ్లుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 10న మరోసారి దంపతులు కొట్లాడుకున్నారు. ఈ క్రమంలో భార్యపై భర్త చేయి చేసుకున్నాడు. దీంతో విసుగు చెందిన పద్మమ్మ 11వ తేదీ తెల్లవారుజామున నిద్రపోతున్న భర్తపై వేడినూనె పోసింది. కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గద్వాల దవాఖానకు.. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఏపీలోని కర్నూల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి వెంకటేశ్ మృతి చెందాడు. మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేసి పద్మను రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం

రాజధానిలో కలకలం..

మహిళల భద్రతపై ఆందోళన

లైంగికదాడి, హత్యగా అనుమానం

చర్లపల్లి/బండ్లగూడ, సెప్టెంబర్ 16: మహానగరంలో మంగళవారం ఒకేరోజు వేర్వేరు చోట్ల ఇద్దరు గుర్తుతెలియని మహిళల మృతదేహాలు కనిపించడంతో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్నది. రాజేంద్రనగర్, చర్లపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆ మహిళల మృతదేహాలు పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్ వద్ద గోనె సంచిని గుర్తుతెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు. దుర్వాసన వస్తుండటంతో స్థానికు లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసు లు తెరిచి చూడగా కుళ్లిపోయిన స్థితిలో 40 ఏండ్ల మహిళ మృతదేహం బయటపడింది. హత్యచేసి ఇక్కడ పడేశా రా? అన్న అనుమానంతో దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పుర బ్రిడ్జి కింద ఓ మహిళ మృతదేహం పడి ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. మహిళ ఒంటిపై బట్టలు లేకపోవడంతో ఎవరైనా లైంగికదాడి చేసి హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మూడురోజుల క్రితమే హత్య జరిగి ఉండొచ్చని తెలిపారు. కేసు నమోదు చేసుకొని వివిధ కోణాల్లో కేసును దర్యాప్తు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు.

యాచకురాలిపై లైంగికదాడి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఘటన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 16 : యాచకురాలిపై గుర్తుతెలియని వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సాగర్ రోడ్డులో గల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చోటుచేసుకున్నది. ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. వేరే రాష్ట్రానికి చెందిన యాచకురాలు (60) మూడురోజుల క్రితం ఇబ్రహీంపట్నం ప్రాంతానికి వచ్చింది. పగటి పూట రోడ్లపై యాచిస్తూ సాయంత్రానికి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో తలదాచుకుంటుంది. సోమవారం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్టు సీఐ తెలిపారు. బాధితురాలికి వైద్య చికిత్సలు నిర్వహించి వృద్ధాశ్రమంలో చేర్చినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాల ద్వారా నిందితుడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై కోమటిరెడ్డి ధోకా

> మొదటిపేజీ తరువాయి...

సమయం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారు. ఇటీవల ముట్టడికి పిలుపునిచ్చిన రైతులను అరెస్టు చేయించి. పోలీస్ స్టేషన్‌లో పెట్టించారంటే అన్నదాతలపై ఆయనకు ఏమేరకు ప్రేమ ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ట్రిపుల్ ఆర్ స్వరూపం ఇలా..

ట్రిపుల్ ప్రాజెక్ట్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్ ఉత్తర భాగంలో తొలి విడత రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. 159 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. యాదాద్రిలోని చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే పలు నోటిఫికేషన్లు జారీ చేశారు. ఇక దక్షిణ భాగం పరిధిలో నారాయణపురం, నల్లగొండ జిల్లాలోని గట్టుప్పల్, మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ వెళ్తున్నది. ఆయా ప్రాంతాల్లో ఇటీవల సర్వే నంబర్లు ప్రకటించడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.

సారూ.. హామీ ఏమాయె?

అసెంబ్లీ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మొసలి కన్నీరు కార్చింది. బీఆర్‌ఎస్‌ను దోషిగా నిలబెట్టేందుకు నానాయాగీ చేసింది. అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని హామీల మీద హామీలు గుప్పించింది. నాడు భువనగిరికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంపీగా ఉండటంతో సందర్భం వచ్చినప్పుడల్లా హంగామా చేశారు. రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట జరిగిన ఆందోళనలో స్వయంగా పాల్గొన్నారు. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని పలు సందర్భాల్లో డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ వాగ్దానం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు ముచ్చట్నే ఎత్తడంలేదు.

రైతులు కలిసేందుకూ టైమివ్వరా?

హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కోమటిరెడ్డిని కలిసేందుకు రైతులు పలు దఫాలుగా వెళ్లినా కనీసం సమయం ఇవ్వలేదు. చాంబర్‌లోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు నిరుడు అక్టోబర్‌లో గేట్ ఎదుట బైఠాయించి ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. అంతా సీఎం రేవంత్‌రెడ్డే చూస్తున్నారంటూ దాటవేసి అక్కడ్నుంచి వెళ్లిపోయారు. ఇటీవల నల్లగొండలో సైతం క్యాంప్ ఆఫీసుకు వచ్చిన రైతులను అరెస్టు చేయించి పోలీసు స్టేషన్‌లో పెట్టించారు.

మార్చాల్సిన చోట మార్చలే..
అవసరం లేని చోట మార్పు

ట్రిపుల్ ఆర్ భాగంగా రాయగిరి రైతులు భూములు కోల్పోనున్నారు. గతంలోనూ ఈ ప్రాంత రైతులు పలు సందర్భాల్లో తమ భూములు కోల్పోవాల్సి వచ్చింది. యాదగిరిగుట్ట విస్తరణ, హైటెన్షన్ వైర్లు, జాతీయ రహదారి నిర్మాణం సమయంలో అధిక ధరలు పలికే భూములను అప్పనంగా అప్పగించాల్సి వచ్చింది. ఈ సారి ఎలాగైనా భూములను ఇచ్చేది లేదని రాయగిరి రైతులు నాలుగేండ్లుగా ఉద్యమం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే మారుస్తామన్న కాంగ్రెస్ పట్టించుకోలేదు. ఇక కాంగ్రెస్ వచ్చాక చౌటుప్పల్ వద్ద అలైన్‌మెంట్‌లో మార్పులు చేసింది. ఇక్కడ ఓ కంపెనీ కోసమే సర్కారు మార్పులు చేసిందనే విమర్శలున్నాయి. దీంతో రెండున్నర రెట్లు అధికంగా భూములను సేకరించాల్సి వస్తున్నది. సంస్థాన్ నారాయణపురం మండలంలోనూ మార్పులు చేశారు.

పనుల స్పీడప్‌కే కోమటిరెడ్డి మొగ్గు..

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తమను నమ్మించి మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది రైతులు ఉద్యమ బాట పడుతుంటే కోమటిరెడ్డి నేతృత్వం వహిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖ, ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదు. భూనిర్వాసితుల గోడును పెడచెవిని పెడుతున్నాయి. ట్రిపుల్ ఆర్‌లో భాగంగా ఇప్పటికే త్రీడీ, త్రీజీ నోటిఫికేషన్లు విడుదల కాగా రాయగిరి రైతులు కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. విశ్వప్రయత్నాలు చేసి వెకేట్ చేసేలా సర్కారు చర్యలు తీసుకున్నది. ఇందు కోసం అధికారులను మంత్రి హైదరాబాద్‌కు పిలిపించుకున్నారని, సమీక్షలో ఆదేశాలిచ్చారనే ప్రచారం ఉంది. అంతేకాకుండా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని కూడా కోరారు.

> పేదోళ్ల ఆస్తులు కాపాడాలి. వారి ఆస్తులు పెరగాలి. ఎకరం రూ. 3-4 కోట్లు ఉన్నది. అంత పరిహారం కట్టిస్తరా? అయినా రైతులు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. రీజినల్ రింగ్ రోడ్డు సర్వే పనులను అడ్డుకోవాలి. తక్షణమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి. బాధితులకు అండగా ఉంటాం. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తా. అవసరమైతే అందర్నీ ఢిల్లీకి తీసుకెళ్లి గడ్కరీని కలిపిస్తా..
>
> **- 2022, సెప్టెంబర్ 26న ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ధర్నాకు సంఘీభావం తెలిపిన సందర్భంలో అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

> ట్రిపుల్ ఆర్ కోసం దౌర్జన్యంగా సర్వేలు చేయం కరెక్ట్ కాదు. ప్రైవేట్ భూముల్లోంచి కాకుండా ప్రభుత్వ భూముల్లోంచి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చాలి. దళితులను ధనవంతులను చేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు వారి భూములను లాక్కొని వేలం వేయడం ఏంటి?
>
> **-2022, అక్టోబర్ 13న కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు**

> ట్రిపుల్ ఆర్ తెలంగాణకు మణిహారం. దీని ద్వారా పరిశ్రమలు వస్తయి. రీజినల్ రింగ్ రోడ్డు రాయగిరి అలైన్‌మెంట్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నం. త్వరలోనే మళ్లీ సర్వే చేయిస్తం. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ నిబంధనల ప్రకారం చేపడుతం. సూటబుల్ పరిహారం అందిస్తం. దీనిపై వారం తర్వాత నిర్ణయం తీసుకుంటం..
>
> **-2024, జనవరి 21న యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం మీడియాతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

> ట్రిపుల్ ఆర్ రాయగిరి అలైన్‌మెంట్ మారుతుందా? మారదా? ఏడికి పోతుందనేది చెప్పం. తప్పకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తం. రైతులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తం.. అవసరమైన చోట్ల మార్పులు చేర్పులపై చర్చిస్తం. ట్రిపుల్ ఆర్‌తో తెలంగాణ అభివృద్ధి చెందుతుంది.
>
> **-2024 మార్చి 6న భువనగిరిలో జరిగిన ప్రెస్‌మీట్‌లో మంత్రి కోమటిరెడ్డి**

ఇంటికి పోతే కనీసం పట్టించుకోలే..

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోమటిరెడ్డిని కలిసేందుకు ఎన్నిసార్లు వెళ్లినా మమ్మల్ని కలవలే. చేసేదేం లేక పొద్దున్నే ఒకసారి నేరుగా చాంబర్ దగ్గరికి వెళ్లినా లాభం లేకపోయింది. మంత్రి సమయం ఇవ్వకుండా కారులో వెళ్తుంటే బాధితులమంతా కలిసి ఆందోళన చేసినం. అయినా పట్టించుకోలే. కనీసం మా బాధలు కూడా వినకుంటే ఎట్లా? ఎన్నికల ముందు అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కిమ్మనకుండా ఉంటే సరైన పద్ధతేనా? కోట్ల విలువైన భూములు తీసుకొని లక్షలు ఇస్తమంటే ఏం చేయాలి? అలైన్‌మెంట్ మార్చాలి.. లేదంటే బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలి.

- చింతల దామోదర్ రెడ్డి, భూ నిర్వాసితుల ఐక్య వేదిక, చౌటుప్పల్



ట్రిపుల్ ఆర్ బాధితుల ధర్నా

సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్16: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ భూములు కోల్పోతున్న రైతులు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామం వద్ద నారాయణపురం నుండి చౌటుప్పల్ వెళ్లే రహదారి పై బైటయించి రాస్తారోకు చేశారు.ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయ భూముల్లో నుండి వెళ్తున్న ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు..ప్రభుత్వం స్పందించి పాత అలైన్‌మెంట్ ప్రకరమే ట్రిపుల్ ఆర్ నిర్మించాలని కోరారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని రైతులకు సర్ది చెప్పి అక్కడి నుండి పంపించి వేశారు.ఈ కార్యక్రమంలో భూ బాధితులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా భూములను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క, సీతక్క మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

ఫార్మాపై కాంగ్రెస్ దగా

> మొదటిపేజీ తరువాయి...

కలిబొల్లి కబుర్లు చెప్పారు. తీరా అధికారంలోకి రాగానే రైతులకు ముఖం చాటేస్తున్నారు. ఫార్మాసిటీ రద్దు అని ఒకసారి, కాదని మరోసారి.. ఇలా సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు పూటకో మాట చెప్తూ రైతులను దగా చేస్తున్నారు. అధికారంలోకి రాగానే భూములను తిరిగి రైతులకు అప్పగిస్తామన్న నేతలు ఇప్పుడు గద్దెనెక్కగానే ఆ భూముల్లోకి రైతులు రాకుండా పోలీసులను మోహరించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రైతులను తరిమికొట్టారు. తమ భూముల కోసం ఇల్లు, వాకిలి వది ఏడాదిన్నరగా పోరాడుతున్న రైతులకు ఇటీవల పిడుగుపాటులా కోర్టు అథారిటీ నోటీసులు అందాయి. పరిహారం ఎందుకు తీసుకోవడం వచ్చే నెల ఒకటో తేదీలోగా చెప్పాలని కోర్టు ఆదేశించడంతో అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. కాబట్టే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కూడా తమతో కలిసి రావాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు అందుబాటులో ఉన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి తమతో పాటు కోర్టుకురావాలని లిఖితపూర్వకంగా డిమాండ్ చేశారు.

షరతుతోనే కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని యాచారం, కందుకూరు మండలాల్లో 19,333 ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రీన్ ఫార్మాసిటీని మాత్రమే ఏర్పాటు చేస్తామని, లేదంటే భూములు తిరిగి ఇస్తామనే షరతుతో కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ చేపట్టింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ రైతుల్ని రెచ్చగొట్టింది. 'ఫార్మాసిటీ ఎలా ఏర్పాటు చేస్తారు? రైతుల నుంచి బలవంతంగా భూములను ఎలా తీసుకుంటారు? ఎవరూ భూములు ఇవ్వొద్దు, మేం అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేస్తాం' అని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి రైతులను మభ్యపెట్టారు. దీంతో యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 800 మంది రైతులు 2,250 ఎకరాల పట్టా భూములను ఫార్మాసిటీకి ఇవ్వలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని అథారిటీ కోర్టులో జమచేసింది. ఆ సమయంలో కోదండరెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు రైతులతో కలిసి కోర్టుకు వెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములు తిరిగి ఇస్తామన్నందున పరిహారం తీసుకోవద్దని రైతులకు మాయ మాటలు చెప్పారు. వారి మాటలు నమ్మిన రైతులు పరిహారం తీసుకోకపోవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకోలేదు. రైతులే సాగు చేసుకుంటున్నారు.

అధికారంలోకి రాగానే స్వాధీనం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దవుతుందని ఎంతో ఆశతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. ఫార్మాసిటీ కొనసాగిస్తామని హైకోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం ఆ భూముల్ని ఫ్యూచర్ సిటీ కోసం వినియోగిస్తూ రెండేండ్లుగా ఫార్మా బాధిత రైతులను అయోమయానికి గురిచేస్తున్నది. పైగా, పరిహారం తీసుకోవద్దని గతంలో చెప్పిన రైతులకు చెందిన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద భూముల్లో కొన్నిరోజుల క్రితం పోలీసు పహారా మధ్య రైతులు రాకుండా అడ్డుకుని ఫెన్సింగ్ వేసింది. రైతులు ఏడాదిన్నరగా సీఎంతో పాటు గతంలో పాదయాత్ర చేసిన భట్టి, కోమటిరెడ్డి, సీతక్క, ఇతరులను కలిసేందుకు ప్రయత్నించినా సాధ్యపడకపోవడంతో నెలలుగా రైతులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఈ నెల 12 నుంచి విడతలవారీగా అథారిటీ కోర్టు నుంచి రైతులకు నోటీసులు జారీ అవుతున్నాయి. ఇప్పటివరకు 250 మందికి నోటీసులు అందినట్టు తెలిసింది. పరిహారం ఎందుకు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలని కోర్టు ఆదేశించడంతో కాంగ్రెస్ నేతలను కలిసేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ వారెవరూ అందుబాటులోకి రావడంలేదని వాపోతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి గతంలో తమను భూములు ఇవ్వద్దని చెప్పారు కాబట్టి, ఇప్పుడు తమతో కలిసి రావాలని డిమాండు చేశారు. కానీ కోదండరెడ్డి మాత్రం పరిహారం ఎక్కువ ఇప్పించేందుకు కృషి చేస్తానంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారని, నాడు ప్రతిపక్షంలో ఉన్నపుడు ఏం చెప్పారు? ఇప్పుడు అధకారంలోకి రాగానే ఎలా మాట మార్చుతున్నారో చూడండి అంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

• మాతో కోర్టుకు రావాల్సిందే

ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రస్తుత సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే అందరూ ఫార్మాసిటీని రద్దుచేసి, మా భూములు మాకు ఇస్తామన్నారు. ఇప్పుడేమో కోర్టు నుంచి నోటీసులు పంపుతున్నారు. ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా మా భూముల్ని వదులుకోం. గతంలో కోర్టు ద్వారా పలు కేసులు గెలిచాం. మరోసారి రైతులందరం హైకోర్టుకు పోతాం. బీఆర్‌ఎస్ హయాంలో అథారిటీ కోర్టు వద్ద మాతో కలిసి ఆందోళన చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కూడా రైతులతో కలిసి అథారిటీ కోర్టుకు వచ్చి మాకు అండగా ఉండాలి. ఎవరెన్ని ఇబ్బందులకు గురిచేసినా సెంటు భూమి కూడా ప్రభుత్వానికి ఇచ్చేదిలేదు. అథారిటీలో ఉన్న డబ్బులు మాకు వద్దు. మా భూములను మాకు ఇప్పించాలి. రైతులకు న్యాయం జరిగే వరకు ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాడుతాం. **- కానమోని గణేశ్, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు**

ఆర్‌ఆర్‌ఆర్ అయ్యేదా.. పొయ్యేదా?

> మొదటిపేజీ తరువాయి...



పొయ్యేదా?' అంటూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మరి ఇప్పట్లో కానిదానికి ఎందుకు అలైన్‌మెంట్ హడావుడి అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసేందుకు మినిస్టర్స్ క్వార్టర్స్‌కు వెళ్లారు. చాలా సేపటి తర్వాత బయటకు వచ్చిన మంత్రిని కలిసి తమ గోడు వెళ్లబోసుకొనేందుకు ప్రయత్నించారు. 'సార్ మేము పుట్టపాక నుంచి వచ్చినం.. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో మా భూములు పోతున్నయి' అని వినతిపత్రం ఇవ్వగా దాన్ని తీసుకొని చూడకుండానే పీఏకు ఇచ్చి మంత్రి ముందుకు కదిలారు. సార్ ఒక్క నిమిషం అంటూ రైతులు వెంటపడి విషయం చెప్తుండగా 'అసలు మీరెందుకొచ్చారు? ట్రిపుల్ ఆర్ అయ్యేదా? పొయ్యేదా? వచ్చినా అది ఇప్పట్లో కాదు. ఇప్పటికీ భువనగిరి దగ్గర రాయగిరి నుంచి పోయే ఉత్తరభాగానికే అతీగతీ లేదు. ఇక మీ వైపు ఇప్పట్లో అయ్యేది కాదు.. పొయ్యేది కాదు. అది అయ్యే సరికి నేనుంటనో.. నువ్వుంటవో తెల్వదు. తరాలు మారాల్నో.. ఎన్ని ప్రభుత్వాలు మారాల్నో కూడా తెల్వదు. మీ భూములు మీరు దున్నుకొని బతుకు పోండ్రి. ఒక వేళ భూములే పోతే నల్లగొండలో నేను బైపాస్ రోడ్డు వేస్తున్న. అక్కడ కోటీ, కోటిన్నర ఇస్తున్న. అప్పటి వరకు నేనుంటే ఇక్కడ కూడా అట్లనే వస్తుయి పోండ్రి' అంటూ కోమటిరెడ్డి ఈసడించుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా కోమటిరెడ్డి వ్యాఖ్యలు ట్రిపుల్ ఆర్ బాధితుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. 'మంత్రి చెప్పేదే నిజమైతే అసలు ఇప్పట్లో కాని ట్రిపుల్ ఆర్ కోసం అలైన్‌మెంట్ ప్రకటన ఎందుకు?, ఎందుకింత రాద్ధాంతం?' అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సారవంతమైన భూముల్లో ఏండ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న తమ జీవితాల్లో కల్లోలం రేపడం ఎందుకని నిలదీస్తున్నారు.

తిండి లేదు.. నిద్ర లేదు

అలైన్‌మెంట్ ప్రకటన వచ్చినప్పటి నుంచి కంటినిండా నిద్రలేదని, కడుపు నిండా తిండి కరువైందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇదే సమయంలో నిత్యం సీఎం రేవంత్‌రెడ్డి పక్కన కూర్చొని ట్రిపుల్ ఆర్ త్వరలో పూర్తి.. పనులు వేగవంతం అంటూ ప్రకటనలు చేసే కోమటిరెడ్డి ఇలా యూటర్న్ ప్రకటనలు చేయడమేంటని వాపోతున్నారు. గత నెల 30న హెచ్‌ఎండీఏ విడుదల చేసిన ప్రాథమిక అలైన్‌మెంట్‌పై రైతులు మార్నాటి నుంచే ఆందోళనకు దిగారు. దక్షిణ భాగం రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ నెల 13న నల్లగొండకు తేరటుపల్లి గ్రామ రైతులొస్తే వారిని మంత్రి దరిదాపుల్లోకి రానివ్వకుండా అరెస్టు చేశారు. ముందు తెలిస్తే అరెస్టు చేస్తారని గుట్టు చప్పుడు కాకుండా మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌కు పుట్టపాక రైతులు చేరుకున్నారు. మంత్రి బయటకొచ్చేటప్పుడు విషయం చెప్పబోతే ఆయన దాటవేత వ్యాఖ్యలు వారిలో ఆగ్రహం తెప్పించింది.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

సాగు కలిసి రాక తీవ్ర మనస్తాపం.. వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో విషాదం

ముస్తాబాద్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 16: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన భూక్య శంకర్ నాయక్ (55)కు భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుర్ల పెండ్లిళ్లు గతంలోనే చేశాడు. ఆయనకు నాలుగెకరాల పొలం ఉన్నది. అందులో వరి సాగు వేయగా సరైన దిగుబడి రాలేదు. రెండేండ్ల క్రితం ఇల్లు కట్టుకున్నాడు. అప్పుడు రూ.5 లక్షల దాకా అప్పు చేశాడు. అప్పటి నుంచి అప్పులు ఎలా కట్టాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి పొలానికి వెళ్లి బావి వద్ద చెట్టుకు ఉరేసుకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు వెళ్లగా, అప్పటికే మృతి చెందాడు. శంకర్ నాయక్ కొడుకు గంగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భూక్య శంకర్ నాయక్ (ఫైల్)

యూరియా లభించక..
పంట నష్టం తట్టుకోలేక

యూరియా కోసం వారం రోజులు తిరిగినా దొరక్కపోవడంతో విసిగి వేసారిన యువరైతు ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన ఉడుత అఖిల్ (22) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. ఐదేండ్ల క్రితం తండ్రి గట్టయ్య మృతి చెందడంతో అఖిల్ వ్యవసాయం చేస్తుండగా సోదరుడు రాకేశ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తనకున్న మూడున్నర ఎకరాల్లో మక్కజొన్న, పత్తి, వరి సాగు చేస్తున్నాడు. పంటలకు పెట్టుబడిగా రూ.5 లక్షల మేరకు అప్పులు చేశాడు. వారం రోజుల నుంచి యూరియా బస్తాల కోసం మండల కేంద్రంతోపాటు సమీపంలోని దమ్మన్నపేటలోని విక్రయ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. వ్యవసాయ బావి వద్దకు వెళ్లకపోవడంతో కోతులు మక్కజొన్న, పత్తిని పాడు చేశాయి. ఆర్థికఇబ్బందుల్లో ఉన్న అఖిల్ అప్పులు ఎలా తీర్చాలో తెలియక రెండు రోజులుగా తల్లితో చెప్పుకుంటూ మానసికంగా ఇబ్బందికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన అఖిల్ గడ్డి మందు తాగి పంట చేనులోనే పడిపోయాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావి వద్ద వెతకడంతో అఖిల్ స్పృహ కోల్పోయి ఉన్నాడు. వెంటనే వర్ధన్నపేట ఏరియా దవాఖానకు తరలించడంతో అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

వ్యవసాయ ఫీడర్లకు మీటర్లు!

- అందుకే కొత్త డిస్కం ఏర్పాటుకు ఆదేశాలు
- 'ఎత్తిపోతల'కూ కొత్త డిస్కంపై డ్రాఫ్ట్ సిద్ధం
- పొంచి ఉన్న విద్యుత్తు ప్రైవేటీకరణ ముప్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)ను నెలకొల్పాన్న ప్రభుత్వ నిర్ణయం వెనుక.. వ్యవసాయ విద్యుత్తుకు మీటర్లు పెట్టే కుట్ర దాగి ఉన్నదని విద్యుత్తురంగ నిపుణులు అనుమానిస్తున్నారు. వ్యవసాయ ఫీడర్లకు మీటర్లను బిగించడంలో భాగంగానే కొత్త డిస్కంను సర్కారు తెరపైకి తెచ్చిందని అంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు డిస్కంలు ఉండగా, కొత్తగా మరో డిస్కంను ఏర్పాటుచేయాలని సర్కారు ఆదేశించింది. కొత్త డిస్కం పరిధిలోకి అగ్రికల్చర్ ఫీడర్లు (సబ్‌స్టేషన్లు), ఎత్తిపోతల పథకాలు, జలమండలి వినియోగిస్తున్న ఫీడర్లు, గృహజ్యోతి, విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లను తెస్తారు. ఆ తర్వాత ఫీడర్లకు మీటర్లను బిగిస్తారని, బిల్లులు జారీచేస్తారని, ఇదే జరగబోతున్నదని విద్యుత్తురంగ నిపుణులు అంటున్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్‌లోకి..

విద్యుత్తురంగ సంస్కరణల్లో భాగంగా 'ది రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం' (ఆర్‌డీఎస్‌ఎస్)లో చేరాలని కేంద్రం తరుచూ కోరుతున్నది. ఇందుకు తెలంగాణ డిస్కంలు రెడీ అయ్యాయి. ఇందులోభాగంగా ఉన్నతస్థాయి కమిటీని కూడా వేశారు. ఈ తరుణంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త డిస్కంను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ఓ డ్రాఫ్ట్‌ను సిద్ధంచేశారు. ఈ ఆదేశాల వెనుక వ్యవసాయ ఫీడర్లకు మీటర్లు పెట్టాలన్న ఆలోచన ఉన్నదని విద్యుత్తురంగ నిపుణుల అనుమానిస్తున్నారు. వ్యవసాయ ఫీడర్లు, గృహజ్యోతి, విద్యాసంస్థల కనెక్షన్లను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకొచ్చి.. ఎప్పటికప్పుడు మీటర్ రీడింగ్ తీయాలన్న ఆలోచనలో ప్రభుత్వవర్గాలు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇదంత సులభంకాదన్న వాదనలున్నాయి. ఫీడర్లకు మీటర్లు పెట్టేందుకు వేల కోట్లు వ్యయం అవుతుందని నిపుణులంటున్నారు. కొత్త డిస్కంకు లైసెన్స్ రావడం సులభంకాదన్న వాదనలున్నాయి. కొత్త డిస్కం వెనుక విద్యుత్తురంగాన్ని ప్రైవేటీకరించే ప్రమాదం పొంచి ఉన్నదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. వ్యూహాత్మకంగా కొన్ని ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేట్లకు సింహద్వారాలు తెరుస్తున్నారని అంటున్నారు.

క్యాబినెట్ ముందుకు కొత్త డిస్కం

- అధికారులను ఆదేశించిన సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు డిస్కంలను మూడు డిస్కంలుగా పునర్విభజన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాబినెట్ ఆమోదం అనంతరం కొత్త డిస్కం ఏర్పాటుపై ముందుకెళ్లాలని సూచించారు. మంగళవారం ఇంధన శాఖపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు కొత్త డిస్కం ఏర్పాటు ప్రణాళికను సీఎం ముందుంచారు. మూడో డిస్కంకు సంబంధించిన పీపీఏల అలకేషన్, సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్‌గ్రౌండ్ కేబులింగ్ విధానంపై బెంగళూరు సహా ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లోగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తిస్థాయి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, సీఎండీలు హరీశ్, బలరాం, ముషారఫ్, వరుణ్‌రెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి బిల్లు ఇచ్చినట్టు రికార్డు కంగుతిన్న లబ్ధిదారుడు

- ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోగా వెలుగులోకి..
- మళ్లా ఇవ్వమన్న అధికారులు

ధరూర్, సెప్టెంబర్ 16: ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అధికారులు, బ్రోకర్లు కుమ్మక్కై సదరు లబ్ధిదారుడి బిల్లు కాజేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు కోసం సదరు రైతు దరఖాస్తు చేసుకోగా ఈ విషయం జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధరూర్ మండలం అల్వాల్‌పాడుకు చెందిన కేపీ తిప్పన్న ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, అతడి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్టు రికార్డులో ఉన్నదని, కొత్తగా ఇల్లు ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చిచెప్పారు. గతంలో తన పేరుపై ఎవరో ఇంటి బిల్లు కాజేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఇండ్ల మంజూరులో అన్యాయం చేసిన్రు

- వాటర్‌ట్యాంక్ ఎక్కి బాధితుల నిరసన

ముత్తారం, సెప్టెంబర్ 16: ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడ్డారని, అర్హులైన తమకు అన్యాయం చేశారంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామస్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలపడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. రామగుండం ఏసీపీ మడత రమేశ్ బలగాలతో వచ్చి వారికి నచ్చచెప్పి కిందికి దింపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు వచ్చేలా చూస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

మరిన్ని వార్తలు ntnews.comలో చూడగలరు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మర్లవడ్డ పోరుగడ్డ

తెర్లయిపోతున్న తెలంగాణ తిరగబడుతున్నది. పట్టాలు తప్పిన పరిపాలనపై మర్లవడుతున్నది. పల్లె-పట్నం తేడా లేకుండా ఎక్కడికక్కడ పొలికేకలు పెడుతున్నది. పోరుబాట పడుతున్నది. సర్కారుపై విరగబోట్లు పొడుస్తున్నది. సమ్మె సైరన్లు మోగుతున్నాయి. ధర్నాలతో రాష్ట్రం దద్దరిల్లుతున్నది. ఒక్కో వర్గానిది ఒక్కో గోస. పాలన పట్టని, కాదు కాదు.. చేతగాని సర్కారు కుప్పిగంతులతో విసిగిపోయిన జనం రోడ్డెక్కుతున్నారు. గల్లంతయిన డొల్ల హామీలపై సర్కారు గల్లా పడుతున్నారు, నిలదీస్తున్నారు. నిప్పులు కక్కుతున్నారు. కల్లబొల్లి కబుర్లతో కాలక్షేపం ఇంకానా, ఇకపై సాగదని కదం తొక్కుతున్నారు. పూటకోమాటతో పబ్బం గడుపుకొనే దగుల్బాజీ నాటకాలను దుల పరిస్తున్నారు.

పంటకాలం పూర్తికావస్తున్నా తగినంత యూరియా అందకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. పొట్టకొచ్చిన బలం చాలక పంటలు ఈడిగిల పడుతుంటే చూడలేక ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. ఊరూరా యూరియా యుద్ధాలు జరుగుతున్నాయి. సొసైటీల దగ్గర చెప్పుల బారులు సర్వసాధారణం అవుతున్నాయి. సమస్యలు పరిష్కరించలేని సర్కారు పోలీసు లాఠీలకు పనిజెప్పడంతో రైతన్న రక్తంతో తెల్లటి యూరియా ఎరుపెక్కుతున్నది. అటు గురుకులాల సిబ్బంది జీతాల కోసం ధర్నాలు చేస్తున్నారు. గ్రూప్ వన్ రద్దు చేయాల్సిందే.. హైకోర్టు తీర్పు అమలు చేయాల్సిందే.. జాబ్ క్యాలెండర్ ఇవ్వాల్సిందేనంటూ ధర్నాలతో నిరుద్యోగులు వేడిపుట్టిస్తున్నారు. ట్రిపుల్ఆర్‌కు భూములు ఇచ్చేదే లేదంటూ రైతులు రాస్తారోకోలతో రాకపోకలను స్తంభింపజేస్తున్నారు. అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంలు గొంతెత్తుతున్నారు. పోడుభూములపై మోహరించిన సర్కారు బలగాలను అడవి బిడ్డలు తరిమికొడుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సర్కార్‌ను అవుట్ చేసేందుకు గళమెత్తుతున్నారు.

మరి సమస్యల్ని పరిష్కరించాల్సిన సర్కారు ఏం చేస్తున్నది? ఆడబిడ్డలని కూడా చూడకుండా దమనకాండను ప్రయోగిస్తున్నది. అరెస్టులు సాగిస్తున్నది. వృద్ధులు, వికలాంగులపై కూడా లాఠీలు విరగడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ప్రజల తెగువ చూసి సంఘాలు రంగంలోకి దిగుతున్నాయి. పోడుభూముల జోలికి రావద్దని బీకేఎంఎస్ పోరుగర్జన చేసింది. కొత్తపింఛన్లు కావాలని వీఎచ్‌పీఎస్ పోరుబాట పడుతున్నది. అధికారుల కార్యాలయాలను ఆశా వర్కర్లు ముట్టడిస్తున్నారు. మహాధర్నాలతో రాష్ట్రం రాష్ట్రమే దద్దరిల్లుతున్నది. దుష్ట కాంగ్రెస్ భ్రష్ట పాలనలో అన్ని వర్గాలూ అరిగోస పడుతుండటమే ఇందుకు కారణమని విప్పిచెప్పాల్సిన పనిలేదు. సంపద పెంచుడు, పంచుడు చేతకాని సర్కారు తెలంగాణ ప్రజలను ముంచుడు, దంచుడు పాల్జేస్తున్నది. దీంతో రెండేండ్లలోనే తెలంగాణ మరోసారి దగాపడ్డది. కారణాలు వెతకాల్సిన అగత్యం లేదు. విశ్లేషణల అవసరమే లేదు. నాడు రాష్ట్ర సాధనకు సకలజనం సమ్మెబాట పడితే నేడు స్వరాష్ట్రంలోనే సకలజనం తిరుగుబాటు జెండాలు ఎగరేస్తున్నది. సకాలంలో మోసకారి సర్కారుకు వాతపెట్టేందుకు సరైన అదను కోసం ఎదురుచూస్తున్నది.

జాతి అస్తిత్వానికి సొంత భాష్యాలేంటి?




లక్ష్మణ్ మురారి శెట్టి

ఒక జాతి నిర్మాణం దాని చరిత్ర ఆధారంగానే జరుగుతుంది. అభివృద్ధి ఎన్ని పుంతలు తొక్కినా... ఏ గగనానికి చేరినా... నేలపైనే కాళ్లుంటాయి. ఘన చరిత్ర వారసత్వమే, సాంస్కృతిక జీవన కొనసాగింపే ఆ నేలతో మనకున్న అనుబంధం. అందుకే ప్రతీ ప్రాంతం తనదైన అస్తిత్వంతో అలరారుతుంది. ఆ ప్రాంత వాసి గర్వంగా 'నేను ఇది, ఇక్కడివాడినే' అని ప్రకటిస్తాడు. ఇది వెనుకబడ్డదనే ఆఫ్రికా ఖండానికైనా... ప్రపంచాధిపత్యం తమదే అనుకుంటున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలకైనా... ఈ సాంస్కృతిక, చారిత్రక జీవన వాస్తవం విషయంలో మాత్రం ఎవరు ఎక్కువా కాదు, ఎవరు తక్కువా కాదనే స్పృహ ఉంటూనే ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన అంశంలో మన దగ్గర ఏమిటీ భిన్న వాదనలు?

ఒకరేమో విమోచనం అంటారు... మరొకరు కాదు కాదు విలీనం అంటారు... ఇంకొందరు విద్రోహమని అంటారు. ఇక తాజాగా స్వరాష్ట్రంగా అవతరించిన తర్వాత సైతం ఇందులో ఏదో తేల్చాల్సిన సొంత ప్రభుత్వాలు కూడా జాతీయ సమైక్యత అని ఒకరంటే... లేదు లేదు ప్రజా పాలన దినమని మరొకరంటున్నారు. శాతవాహన, కాకతీయుల ఘన వారసత్వానికి, అరవై ఏండ్ల పాటు అలుపెరగకుండా పోరాడి సాధించిన ఉద్యమ తెగువకు ఎందుకీ దుస్థితి? ఎవరు దీనికి కారకులు? రాజకీయాల సొంత ఎజెండాల అమలు కోసం ఏకంగా ఒక ప్రాంతంలో జరిగిన మహోద్యమ ఘటనలకు, చేసిన సాహసోపేత పోరాటాలకు, ఒరిగిన వేనవేల కంఠాలకు ఇన్ని వక్రభాష్యాలు బహుశా ప్రపంచ చరిత్రలో మరే ప్రాంతానికీ లేవేమో!

తెలంగాణ అంటేనే తెగువ, తెలంగాణ అంటేనే పోయిరం, తెలంగాణ అంటేనే సాంస్కృతిక తేజో జీవనం. ప్రపంచంలో అతికొద్ది తెగలకు, ప్రజలకు మాత్రమే దక్కిన ఎన్నో ఘనమైన వారసత్వ అంశాలు మనకే ఉన్నాయి. ప్రత్యేకమైన నుడికారంతో కూడిన భాష మొదలు తుంగభద్ర, గోదావరి, కృష్ణమ్మల మధ్య త్రిలింగ దేశంగా తెలుగుకు ప్రాచీన హోదాను అందించిన శాసనాలు దొరికిన నేల ఇది. పురాతన రాతియుగపు ఆనవాళ్లతో కూడిన పనిముట్లు దొరికి మన ప్రాంతంలో లక్షల ఏళ్లకు పూర్వమే నాగరికత పురుడు పోసుకుందని ప్రపంచానికి చాటిన ఘనమైన నేల ఇది. మెసొపొటోమియా మొదలు హరప్పా, మొహెంజోదారో నాగరికతలకు ఏ మాత్రం తీసిపోనిదని, బౌద్ధ, జైన మతాలకు మరో పుట్టినిల్లుగా అలరారిందని ఎన్నో చారిత్రక సత్యాలు ఇక్కడ కనిపించాయి. ప్రకృతి మాత పరవళ్లు పోయిందా అన్నట్టుగా ఎన్నో అద్భుతమైన క్షేత్రాలు ఇక్కడ విరాజిల్లుతున్నాయి. ప్రపంచ ఆదివాసీ కుంభమేళా సమ్మక్క, సారక్క జాతర మహోన్నత సాంస్కృతిక వైభవమైతే... తరగని బొగ్గుతో దేశ, రాష్ట్రాలను సుసంపన్నం చేస్తున్న సింగరేణి బంగారమై వెలుగుతుంటే... ఇంకా అనేక ప్రాంతాల్లో ఎన్నో సహజ సంపదలను తన గర్భాన దాచుకున్న ఈ తెలంగాణ మాత దేశ, రాష్ట్ర వైభవాలకు వాటిని అందిస్తూనే ఉంది. ఇలా ఒక దేశానికి కావాల్సిన అర్హతలతో కూడిన ఘన వారసత్వం పుణికిపుచ్చుకొన్న తెలంగాణ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సైతం ఏడాదికి పైగా పీడనలోనే మగ్గిపోయింది. ఆ సమయంలో నిజాం రాజు ఏకంగా దేశ హోదా కోసం చేసిన ప్రయత్నాలు చరిత్రలో గోచరిస్తాయి.

నేడు సెప్టెంబర్ 17



ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1948 సెప్టెంబర్‌కు అటుఇటుగా ఇక్కడ సాగిన పోరాటం, సాయుధమై రైతాంగంతో మొదలై యావత్ జాతిని ఏకం చేసి స్వాతంత్ర్యం కోసం ఉద్యమించేలా చేసిందనేది నిజం. పండిత, పామర తేడా లేకుండా దొరలు, జాగీర్దార్లు, జమీందార్లు మొదలు నిజాం ప్రభువు వరకూ ఆ ధిక్కార నాదం గర్జించింది. ఆ మహోద్యమాన్ని అణచివేయడానికి ప్రపంచంలో ఎక్కడా వాడని సామ, దాన, భేద, దండోపాయాలను ఇక్కడ వాడారు. ప్రజలను, పోరాటకారులను అత్యంత క్రూరంగా హింసించి, అమెరికా నల్లబానిసల కన్నా హీనంగా చూసిన రోజులున్నాయనేది చరిత్ర చెప్తున్నది. ఎక్కడ పీడన తాండవం చేస్తుందో... అక్కడ ఉద్యమం ఉరకలెత్తుతుంది, ఎక్కడ అణచివేత అట్టహాసం చేస్తుందో... అక్కడ ఆక్రందనలు గర్జనలవుతాయి. గద్దెలను కూల్చి సామాన్యుడు తన కోసం తనే రాసుకునే రాజ్యాంగాలను నిర్మిస్తాయి. ఇక్కడా అదే జరిగింది, అదే జరుగుతుంది. ఎందుకంటే... ప్రాంతాలు వేరు కావచ్చు, యాస, భాషలు వేరు కావచ్చు. కానీ, జీవనంలో ఉండే తడి ఒక్కటే... మనిషిగా గుర్తించబడేది అదే. అందుకే తెలంగాణ పోరాటం యావత్తు ఎవరేం రాసినా... అంతిమ ఫలితం ప్రజలు సాధించుకున్నారు.

కానీ. దీన్ని చెప్పడానికి మాత్రం నేడు రాజకీయులు ఎవరి వాదనలకు వాళ్లు బలాన్ని అద్దుకుంటున్నారు. అందుకోసం చరిత్రలో జరిగిన ప్రతీ సంఘటనలో తమదైన కోణాన్ని ఎక్కిస్తూ... లేని వాటిని ఉన్నవని, ఉన్న వాటిని లేవని చిలువలు పలువలు చేరుస్తూ గోబెల్స్ ప్రచారాలు సాగిస్తున్నారు. పీడనను, దోపిడీని, అణచివేతను సమర్థవంతంగా... చేతనతో... ఏ ప్రపంచ పోరాటాలకు తగ్గని రీతిలో ఎదుర్కొన్న మన ఘన వారసుల నిజ చరిత్ర ఇదీ అని మనం ఘనంగా చెప్పుకోలేని దుస్థితిని తీసుకొచ్చారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రాజకీయ అవసరార్థుల వికృత క్రీడలో నేటి తెలంగాణ పోరున్ని చిక్కేలా చేసి వికటాట్టహాసం చేస్తున్నారు.

ఆపరేషన్ పోలో నిజాంను అణచివేసిందా... లేక తెలంగాణ ప్రజల చెమట చుక్కలతో పోగైన అతని ఆస్తులను దర్జాగా అనుభవించేలా మధ్యేమార్గం పేరుతో నిజాంకు మంచి చేసిందా... లేక తెలంగాణ ప్రజలను నిజాం పీడన నుంచి విమోచనం చేసిందా...? అప్పటి వరకూ ఉద్యమంలో తామే ఉన్నాం, అందుకే తమను అణచడానికే, తమ ఉనికే పోరాటంలో లేదని చెప్పడానికే సైనిక చర్య జరిగిందని నేడు చెప్తున్న వామపక్షీయుల విద్రోహ వాదనల సంగతి సరే. మరి అసలు నిజాలేంటీ...? ఇవేవీ కాకుండా ఇక్కడి ప్రజల అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా భారత నేలలో తెలంగాణం కలిసింది. కాబట్టి, విలీనం అంటే సరిపోతుందా. ఇవన్నీ ఎందుకని మధ్యేమార్గంగా... జాతితో కలిశాం కాబట్టి జాతీయ సమగ్రతను పెంపొందించామనుకోవచ్చా. ప్రభువుల పాలన నుంచి ప్రజాపాలన ఆరంభమైంది కాబట్టి ఇది ప్రజాపాలన దినమేనా...? ఇలాంటి ఎన్నో సందేహాలు సగటు తెలంగాణవాదిని వెంటాడుతున్నాయి. వీటికి నిర్దిష్టమైన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ఈ సమాజానిదే. యావత్ ప్రపంచం గర్వించే పోరాటం చేసిన మాకు, మా ప్రాంతానికి ఒక ముఖ్య ఘట్టం ఏంటో, ఎందుకో... ఎలానో... సర్వజనామోద నినాదం సృష్టించుకునే యోగ్యత, అర్హతలు లేవా...? ఇవే ఇప్పుడు మా ప్రశ్నలు. వీటికి పైన చెప్తున్న వాదనలు చేసే సమూహాలే బాధ్యత వహించాలి. కనీసం 2026 సెప్టెంబర్ 17న అయినా... సర్వజనామోదమైన 'జై తెలంగాణ' నినాదంతో గర్జించాలి.

జై హింద్! జై తెలంగాణ!!

(వ్యాసకర్త: బందూక్ చిత్ర దర్శకులు, తెలంగాణవాది)



ప్రశ్నించడమే నేరమా?



అస్కాని మారుతీసాగర్
90107 56666

'ప్రశ్నించడం ఏడో గ్యారెంటీ' అని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పింది. కానీ, ఆరు గ్యారెంటీల అమలును మర్చిపోయినట్టుగానే ప్రస్తుతం ఏడో గ్యారెంటీని కూడా గ్యారేజీలోకి నెట్టేసింది. అందుకే తమ పాలన గురించి ఎవ్వరు ప్రశ్నించినా సహించడం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నకు తావులేనప్పుడు పాలన ఎట్లా సాగుతుందో చెప్పాల్సిన పనిలేదు. రాష్ట్ర వ్యాప్తంగా రెండేండ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పనులపై ప్రజల నుంచి తీవ్ర ప్రశ్నలు వస్తున్నాయి.

ప్రజల ప్రశ్నలను ఇవిగో సవాళ్లు అని మీడియా చూపిస్తున్నది. దాన్ని ప్రభుత్వం స్వీకరించి సరిదిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. అంతేకాదు అట్లా చూపించినవారిని, రాసిన వారిని ఓ కంట షాడో రూపంలో కనిపెట్టి కక్ష సాధింపులకు పాల్పడుతున్నదనే విషయం సులభంగానే అర్థమవుతున్నది. అధికారంలోకి వచ్చీరాగానే తామేదో చేస్తున్నామని చూపించుకునే ప్రయత్నం చేశారు. తొలి మురిపెం మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి, దానికి పరిష్కార మార్గాలు ఎట్లా చూపించాలో వారికి అస్సలు తెలియడం లేదు. అందుకే ప్రజలపైనా, ప్రశ్నించే వారిపైన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్టు అర్థమవుతున్నది.

ఈ మధ్యకాలంలో మన రాష్ట్రంలో మీడియాపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నది. మీడియా ప్రతినిధుల చెంపలు చెళ్లుమనిపిస్తానని గతంలోనే సీఎం అన్నారు. అంతేకాదు, జర్నలిస్టుల అర్హతల గురించీ మాట్లాడారు. ప్రశ్నించే మీడియా పట్ల వారి వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పుకున్నారు. సీఎం మాటలపై తీవ్ర విమర్శలు వచ్చిన తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందనే విషయం అనుభవంలో ఉన్నదే. అయినా ఈ విషయాన్ని తమ టీవీ ద్వారా ప్రజలకు చూపిస్తున్న విలేకరులపై ప్రభుత్వం కక్షగట్టినట్టు వ్యవహరిస్తున్నది. ఖమ్మం జిల్లా టీ న్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. అదికూడా ఏకంగా రాజద్రోహం కేసు. ప్రశ్నిస్తే జైలుకు వెళ్లకతప్పదని ప్రత్యక్షంగానే మీడియాకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు తమ ఆచరణ ద్వారా ప్రభుత్వం చూపిస్తున్నది. ఈ ఘటనపైనా విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఈ ఘటన మాత్రమే కాదు, గతంలో తమను ప్రశ్నించిన వారిని పలు రకాలుగా వేధించింది ప్రభుత్వం. నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతు రుణమాఫీపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడంతో పాటు, తిరిగి ఇదే మహిళా జర్నలిస్టులపై కేసులు నమోదు చేసిన ఉదంతాలు సైతం ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశాడని ఒక విలేకరి అక్రిడిటేషన్ కార్డును ఆ జిల్లా కలెక్టర్ రద్దు చేశాడంటే వీరు జర్నలిస్టులపై ఏ రకమైనటువంటి పంథాను అవలంబిస్తున్నారో ఇట్టే అవగతమవుతున్నది. సంగారెడ్డి జిల్లాలో ఒక జర్నలిస్టుపై అధికార పార్టీ నాయకులు భౌతిక దాడికి దిగిన ఘటనలు కండ్ల ముందు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలా ఎన్నో, ఎన్నెన్నో దాడులతో జర్నలిస్టులకు భద్రత కరువై ఆందోళన చెందుతున్న వైనం ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్నది.

> **తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, కేసుల ఘటనలపై టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్ర డీజీపీని కలిసింది మా బృందం. విలేకరులపై తప్పుడు కేసులు పెట్టొద్దని డీజీపీని కోరింది. భారత రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటనా స్వేచ్ఛకు ప్రభుత్వం ఆటంకం కలిపిస్తే ఇంకెవరికి చెప్పుకోవాలని కూడా తన ఆవేదనను వ్యక్తం చేసింది. రాజకీయ నాయకులు తమ అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతూ ఉంటారు. వారి రాజకీయ ప్రయోజనాలు వారికుంటాయి. కానీ, అధికార యంత్రాంగం ముమ్మాటికీ ప్రజలకు జవాబుదారిగా ఉండాలి.**

మీడియా కూడా తమ సామాజిక బాధ్యతనే నిర్వహిస్తున్నది. ఈ విషయాన్ని అధికార యంత్రాంగం గమనంలో ఉంచుకోవాలని అల్లం నారాయణతో సహా మా బృందం ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తి చేసింది. గత అనుభవాలను తెలంగాణ రాష్ట్రంలో పునరావృతం చేయొద్దనే విషయాన్నీ గుర్తుచేశాం. తెలంగాణ జర్నలిస్టులు తీవ్ర నిర్బంధాల మధ్య తమ విధులు నిర్వర్తించారు. అప్పుడు ఒక రకమైన సమస్యలుంటే ఇప్పుడు మరో రకమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. చాలామంది జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అయినా తమ విధులు నిర్వరిస్తున్నారు. ఇలాంటివారిపై ప్రభుత్వమే నిర్బంధానికి పూనుకోవడం అప్రజాస్వామికమే. ఈ వాస్తవ పరిస్థితులను సంబంధిత శాఖ మంత్రి దృష్టికి కూడా యూనియన్ పక్షాన తీసుకెళ్లాం.

> **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీడియాపై నిర్బంధమే ఉన్నది. చంద్రబాబు హయాంలో చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు పరిస్థితి మరీ దిగజారింది. మీడియా గురించి, జర్నలిస్టుల అర్హతల గురించి పదేపదే మాట్లాడుతున్న సీఎం తాము మాట్లాడుతున్న మాటల గురించి, వాటి ప్రభావం సమాజంపై ఎట్లా ఉంటుందనే విషయాల గురించి బొత్తిగా ఆలోచిస్తున్నట్లు లేదనిపిస్తున్నది.**

బాధ్యతాయుతంగా ఉండాల్సినవారే, ప్రశ్నించడం తమ హక్కుగా భావించాలని ఎన్నికల ముందు హామీలిచ్చిన వారు ఇప్పుడు వాటిని తుంగలో తొక్కడాన్ని ఏమనాలో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. ప్రభుత్వానికి ముందు చూపు లేదనే విషయం చాలా సందర్భాల్లో వ్యక్తం అయింది. అది మూసీ విషయంలో అయినా, హైడ్రా విషయం అయినా, ఫార్మాసిటీ విషయం అయినా, చివరికి యూరియా విషయంలోనూ స్పష్టమైన ప్రణాళిక లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రణాళికల సాధ్యాసాధ్యాలపై పట్టు లేదనీ ఇన్ని లోపాలున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పెలా అవుతుందో పెద్దలే చెప్పాలి. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఎలా అయితే ఆపలేరో కళ్లెదురుగా కనిపించే వాస్తవాలను మీడియా కంటితో చూపించే జర్నలిస్టులపై పోలీసు కేసులు పెట్టడం ద్వారా, దాడులు చేయడం ద్వారా పాలకులు ఆపలేరు అనే విషయాన్ని గుర్తెరగాలని కోరుతున్నాం.

(వ్యాసకర్త: ప్రధాన కార్యదర్శి, టీయూడబ్ల్యూజే)

అన్నదాతల ప్రయోజనాలతో ఆటలా?

నీళ్లు - నిప్పు-2




చంద్రి రాఘవరెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి పాలకులు తెలంగాణ రైతులను ఒక విధమైన ఆత్మన్యూనతా భావానికి గురిచేశారు- ఈ ప్రాంతం ఎత్తైన భూమి కాబట్టి, నదీ జలాలు ఉపయోగించలేమని. ఈ తప్పుడు నమ్మకంతో రైతులు కొన్ని దశాబ్దాలుగా ప్రకృతి మీద ఆధారపడి వ్యవసాయం చేశారు. బోర్‌వెల్స్ వాడకం పెరిగినా, దానికి తగినట్టు భూగర్భ జలాలు పెరగకపోవడం, వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, కరువు, చీడపీడలు, అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నిర్లక్ష్యం- అన్నీ కలిసి తరాల తరబడి వ్యవసాయం వదిలి వలసలు వెళ్లడం లేదా వ్యవసాయాన్ని పూర్తిగా వదిలేయడం అనే దుస్థితికి దారితీసి తెలంగాణ ఒక కరువుపీడిత ప్రాంతంగా ఏర్పడటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఏలిన అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు పాత్రను పోషించాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని ప్రాజెక్టులు మొదలయ్యాయి. కానీ, పాలకుల ఉదాసీనత వల్ల పూర్తికాలేక నిలిచిపోయాయి. అయితే, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే అసలైన మార్పు మొదలైంది. ఈ మార్పుకు ప్రతీకగా నిలిచింది కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. తొలిసారి గోదావరి నదీ జలాలు ఉత్తర తెలంగాణ పొలాల్లోకి, వాగులలోకి, చెరువులలోకి ఎత్తిపోతల ద్వారా చేరాయి. అందుకే కాళేశ్వరం కేవలం నీటిని తెచ్చిన పథకం కాదు. ఇది తెలంగాణలో వ్యవసాయానికి కొత్త ఆశలు, తెలంగాణ రైతులకు, యువతకు కొత్త అవకాశాలు తెచ్చిన యాత్ర. ఇది తెలంగాణ వ్యవసాయ చరిత్రలో ఒక మైలురాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ప్రాంత వ్యవసాయాన్ని పునర్నిర్వచించింది. తద్వారా ఒక కొత్త విప్లవానికి నాంది పలికింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలో ప్రారంభమైన రాయలసీమ రైతుల ప్రయోజనాలు కాపాడటానికి మొదలుపెట్టి పూర్తిచేసిన ఎత్తిపోతల పథకాలు రెండు. హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్), గాలేరు-నగరి సుజల స్రవంతి. ఇవి రెండు కూడా శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకెళ్లే పోతిరెడ్డిపాడు ఆధారిత పథకాలు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వాలు మారినా, పార్టీల మధ్య అధికారం మారినా ఈ ప్రాజెక్టులు ఆగలేదు, ఆపబడలేదు.

గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు: ఉమ్మడి ఏపీలో ప్రారంభమైన రెండు సుజల స్రవంతి పథకాల్లో ఇదొకటి. రాయలసీమ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు చాలా కీలకం. పోతిరెడ్డిపాడు వద్ద శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ ద్వారా కృష్ణా నది 'మిగులు/ వరద' జలాలను మళ్లించడానికి దీన్ని నిర్మించారు. కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు సుమారు 334 కిలోమీటర్ల పొడవైన కాలువలను కలిగి ఉంది. విద్యుత్తు పంపులు సహా లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను వాడుకొని అనేక ఎత్తయిన ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు నీటిని అందిస్తుంది. మొదటి దశలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి అధిక సామర్థ్యం గల వర్టికల్ టర్బైన్ పంపుల సాయంతో శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా నీళ్లను తెలుగుగంగ ప్రధాన కాలువ, ఎస్ఆర్బీసీ, జీఎన్ఎస్ఎస్ వ్యవస్థలకు మళ్లిస్తారు. గండికోట రిజర్వాయర్ లిఫ్ట్ స్టేషన్ ఈ ప్రాజెక్టులో మొదటి లిఫ్ట్ పాయింట్. ఇది జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువలోకి నీళ్లను ఎత్తిపోస్తుంది.



హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) వ్యవస్థతో అనుసంధానమై ఉన్న కాలేటివాగు లిఫ్ట్ పాయింట్ ద్వారా.. వెలిగల్లు రిజర్వాయర్‌తోపాటు పలు చెరువులకు నీళ్లు అందుతాయి. వెలిగల్లు రిజర్వాయర్ పంపింగ్ స్టేషన్, శ్రీబాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు రిజర్వాయర్ ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పలు రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్లు. ఎస్ఆర్బీసీ లింక్‌లో గోరుకల్లు రిజర్వాయర్ లిఫ్ట్ ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లాగా పని చేస్తుంది. మోటర్ల సాయంతో నీటిని ఎత్తిపోయడం ద్వారా అవుకు, ఇతర చెరువుల కింద వ్యవసాయానికి సాగునీరు అందించేందుకు ఇది తోడ్పడుతుంది. తెలుగుగంగ లింక్‌లో వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మసాగర్ వంటి రిజర్వాయర్లకు నీటిని లిఫ్ట్ చేసే స్టేజింగ్ పాయింట్‌గా పనిచేస్తుంది. బ్రహ్మసాగర్‌కు ఎస్ఆర్-2 నుంచి నీళ్లు వస్తాయి. దీని కాలువ చివరి లిఫ్ట్ పాయింట్. కడప జిల్లాలో వ్యవసాయానికి ఇదే ప్రధాన సాగునీటి వనరు.

హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు: శ్రీశైలం జలాశయం నుంచి 'మిగులు/ వరద' జలాలను మళ్లించి రాయలసీమలోని కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో సాగునీరు అందించడమే లక్ష్యంగా రూపొందించిన రెండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇది. సుమారుగా 565 కిలోమీటర్ల పొడవైన కాలువలు, 12 లిఫ్టులు ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. 370 మీటర్ల ఎత్తున ఉన్న ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు నీళ్లు అందిస్తుంది. 43 పంప్ హౌస్‌లు, 269 పంప్-మోటర్ యూనిట్ల సాయంతో ఈ సుజల స్రవంతి పథకం నడుస్తున్నది. ఈ పథకంలో భాగంగా ఉన్న ముచ్చుమర్రి లిఫ్ట్ 12 పంపుల సాయంతో హెచ్ఎన్ఎస్ఎస్‌కు, 4 పంపుల ద్వారా కేసీ కెనాల్‌లోకి నీళ్లను ఎత్తిపోస్తుంది. జీడిపల్లి, మద్దికెర, అడవిపల్లి వంటి 8 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఇందులో భాగంగా ఉన్నాయి. అంతేకాదు, కొండ ప్రాంతాల గుండా 13.05 కిలోమీటర్ల పొడవైన 5 సొరంగాలూ ఉన్నాయి. మొదట దీన్ని 55 క్యూసెక్కుల నీళ్లను తరలించేందుకు గానూ రూపొందించారు. కానీ, ఇప్పుడు 109 క్యూసెక్కుల జలాలను తరలించడానికి వీలుగా 11 మీటర్ల నుంచి దాదాపు 20 మీటర్లకు కాలువను విస్తరిస్తున్నారు.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో లింక్ ఉన్న ప్రాజెక్టులు

సామర్థ్యం	(టీఎంసీలు)
ఎస్ఆర్బీసీ లింక్ ప్రాజెక్టులు	
గోరుకల్లు	12.44
అవుకు	4.15
జీఎన్ఎస్ఎస్ లింక్ ప్రాజెక్టులు	
గండికోట	26.85
వామికొండ	1.68
సర్వరాయసాగర్	3.06
చిత్రావతి	10
పైడిపాలెం	6
మైలవరం	6.5
తెలుగుగంగ లింక్ ప్రాజెక్టులు	
వెలుగోడు	16.95
ఎస్ఆర్-1	2.13
ఎస్ఆర్-2	2.44
బ్రహ్మసాగర్	17.73

(వ్యాసకర్త: ప్రొఫెసర్, సోషియాలజీ విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం)

(తరువాయి రేపటి సంచికలో..)



కూరలో ఉప్పు లాంటి వాణ్ని!



నేను కూరలో ఉప్పు లాంటి వాణ్ని. రాబోయే బీహార్ ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో తక్కువలో తక్కువ 20 వేల నుంచి 25 వేల మంది ఓటర్లను ప్రభావితం చేయగలను. అందుకే ఎన్డీయే కూటమిలో గౌరవప్రదమైన సీట్లను ఆశిస్తున్నా. అవి కూడా మాకు బలమున్న చోట.

- చిరాగ్ పాశ్వాన్, కేంద్ర మంత్రి, ఎల్జేపీ (రామ్ విలాస్) అధ్యక్షుడు



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని సొసైటీ వద్ద యూరియా కోసం రైతులతో కలిసి లైన్లో నిలుచున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

యూరియా కోసం క్యూ కట్టిన తాటికొండ రాజయ్య దంపతులు

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ సొసైటీ వద్ద రైతులతో కలిసి నిరీక్షణ

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 16 : యూరియా కోసం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య-ఫాతిమామేరి దంపతులు మంగళవారం రైతులతో కలిసి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సొసైటీ వద్ద క్యూలో నిల్చున్నారు. 800 మంది రైతులు రాగా, 400 బస్తాల యూరియా మాత్రమే రాగా ఒక్కరికి ఒకటి చొప్పున పంపిణీచేశారు. గంటకుపైగా నిరీక్షించిన రాజయ్య దంపతులకు యూరియా లభించకపోవడంతో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాష్ర్టానికి 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 5 లక్షల మెట్రిక్ టన్నులు కూడా అందలేదని రాజయ్య ధ్వజమెత్తారు. నెల రోజులుగా రైతులు యూరియా కోసం చంటి పిల్లలను ఎత్తుకుని, సద్దులు తెచ్చుకుని సొసైటీల వద్ద క్యూలో నిల్చుంటున్నా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా సమస్యను పరిష్కరించలేని కడియం ఉప ఎన్నికల జ్వరం వచ్చి ఇంట్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. వరంగల్ ఎంపీ కావ్య ఢిల్లీలో చక్కర్లు కొడుతున్నదని విమర్శించారు. భార్యాభర్తలం యూరియా కోసం లైన్లో నిలబడి టోకెన్ తీసుకున్నా బస్తా అయినా దొరకలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యే పరిస్థితే ఇలా ఉంటే, సాధారణ రైతుల స్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతున్నదని తెలిపారు. ఒక వైపు సాగునీరు, మరోవైపు పంట చేన్లకు యూరియా అందక వ్యవసాయం, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు విరక్తి పుడుతున్నదని చెప్పారు.



నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో యూరియా టోకెన్ల కోసం క్యూలో ఉన్న అన్నదాతలు



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో యూరియా టోకెన్ కోసం పీఏసీఎస్ గేటు ఎక్కబోయి కిందపడి కాలు విరగగా దవాఖాన పాలైన లునావత్ కవిత

నిన్న పోలీస్ స్టేషన్.. నేడు ఫైర్ స్టేషన్

యూరియా టోకెన్ల కోసం అన్నదాతల అవస్థలు
కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 16: రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల యూరియా టోకెన్ల కోసం పలు చోట్ల అన్నదాతలను పోలీస్ స్టేషన్‌లకు తరలించి ఠాణా బయట ఎండలో నిలబెట్టి టోకెన్లు పంపిణీ చేయగా పలు విమర్శలకు తావిచ్చిన విషయం మరిచిపోకముందే మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌కు కర్షకులను తరలించి పోలీసు పహారాలో యూరియా టోకెన్లు పంపిణీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తీరుపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సొసైటీల్లో పోలీసుల పహారా మధ్య అరకొర యూరియా పంపిణీ చేశారు. యూరియా లభించక పలుచోట్ల కర్షకులు రాస్తారోకోలు చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాకలో అన్నదాతలు ఆందోళన చేపట్టారు. జనగామ జిల్లాస్టేషన్‌ఘన్‌పూర్‌లో లైన్‌లో నిలబడిన మహిళా రైతు సొమ్మసిల్లి పడిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్‌లో సమయానికి యూరియా లభించకపోవడంతో ఆవేదనకు గురైన అన్నదాత తన రెండున్నర ఎకరాల మక్కపంటలో పశువులను మేపాడు.



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని సొసైటీ వద్ద యూరియా కోసం లైన్లో నిలబడి స్పృహ తప్పి పడిపోయిన తానేదార్‌పల్లికి చెందిన రేణుకకు మంచి నీళ్లు తాగిస్తున్న మహిళా రైతులు



వరంగల్ జిల్లా పర్వతగిరిలోని పీఏసీఎస్ సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మన గ్రోమోర్ సెంటర్ వద్ద తన మెడలోని బంగారు పుస్తెలతాడులో ఒక బిల్ల మాయమైందని చూపుతున్న మహిళా రైతు లలిత



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో రోడ్డుపై బైఠాయించి జొన్న రొట్టెలు తింటున్న మహిళా రైతులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సొసైటీ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులకు భోజనాలు పెట్టిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మంచిర్యాల జిల్లా భీమారం రైతు వేదిక వద్ద రైతులకు నచ్చజెప్పుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్‌లో యూరియా లేక మక్కజొన్న పంట ఎదగకపోవడంతో బర్రెలను మేపుతున్న రైతు



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో యూరియా కోసం లైన్లో ఉంచిన చెప్పులు, సీసాలు



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో యూరియా కోసం క్యూలో వేచిఉన్న రైతులు

మారని మార్క్‌ఫెడ్ అధికారులు!

యూరియా రచ్చ జరుగుతున్నా నిర్లక్ష్య వైఖరి

- సమయానికి వచ్చేది లేదు.. సమీక్షించేది లేదు
- మంత్రి ఆదేశాలు సైతం అధికారులు బేఖాతర్
- తుమ్మల తనిఖీ చేసినా సమయపాలన పాటించరు
- మధ్యాహ్నం తర్వాతే ఆఫీసుకు ఉన్నతాధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): యూరియా కొరత రాష్ట్రవ్యాప్తంగా రచ్చ రచ్చ అవుతున్నది. రాత్రి పగలు తేడా లేకుండా రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో దగ్గరుండి పర్యవేక్షించాల్సిన మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు తమకెందుకులే అనే ధోరణిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. యూరియా కోసం రైతులు రాత్రి నుంచే ఎరువుల దుకాణాల వద్ద క్యూలు కడుతుంటే, అధికారులు మాత్రం సమయపాలన పాటించకుండా నింపాదిగా ఆఫీసుకు వస్తుండటంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఉన్నతాధికారులు మధ్యాహ్నం తర్వాతే ఆఫీసుకు వస్తుండటం విమర్శలకు తావిస్తున్నది. ఇది ఒక్కరోజు పరిస్థితి కాదని, ప్రతిరోజూ ఇదే తతంగమనే చర్చ మార్క్‌ఫెడ్‌లో జరుగుతున్నది. బయట సమావేశాలు లేకపోయినప్పటికీ ఆఫీసుకు ఉదయం రావడంలేదని తెలిసింది. అధికారులు ఆఫీసు సమయం ఉదయం 10.30 గంటలకు వచ్చిన సందర్భాలు చేతివేళ్లపై లెక్కించవచ్చనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మంత్రి ఆదేశాలూ బేఖాతర్

సమయ పాలన పాటించాలని మంత్రి జారీ చేసిన ఆదేశాలను సైతం మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు బేఖాతర్ చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎండీ, జీఎం ఇద్దరూ కార్యాలయంలో లేకపోవడం గమనార్హం. వీరితోపాటు ఇతర అధికారులు సైతం కార్యాలయంలో లేరు. అయితే, ఆ రోజు ఎండీ శ్రీనివాస్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షకు హాజరైనట్టు తెలిసింది. మిగిలిన అధికారుల తీరుపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి రాని ఉద్యోగులకు మెమోలు జారీచేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే 13 మంది ఉద్యోగులకు ఎండీ శ్రీనివాస్‌రెడ్డి మెమోలు జారీచేసినట్టు తెలిసింది. ఆ తర్వాత అంతా షరామామూలే. ఉన్నతాధికారులతోపాటు ఇతర ఉద్యోగులు కూడా సమయానికి రావడంలేదని సమాచారం. దీంతో మంత్రి ఆదేశాలంటే వీరికి లెక్కలేదా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ అధికారులు మాత్రం మంత్రి ఆదేశాలను పాటించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయిల్‌ఫెడ్‌లోనూ మంత్రి తనిఖీ చేశారు. ఆ తర్వాత ఆయిల్‌ఫెడ్ ఎండీ.. అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయానికి రావాలని, కడుపునొప్పి, ట్రాఫిక్ జామ్, కారు లేదు, డ్రైవర్ లేడు వంటి కుంటిసాకులు చెప్పొద్దని ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. కానీ, మార్క్‌ఫెడ్‌లో మాత్రం ఇలాంటి పరిస్థితి లేకపోవడం గమనార్హం.

క్లిష్ట పరిస్థితుల్లోనూ పట్టింపు లేదా?

యూరియా సరఫరాలో మార్క్‌ఫెడ్‌ది కీలక పాత్ర. యూరియా గోదాములు, ట్రాన్స్‌పోర్ట్ మొత్తం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నది. దీంతో రాష్ట్రంలో ఎక్కడ యూరియా అవసరమైనా సరే మార్క్‌ఫెడ్ ద్వారానే సరఫరా కావాలి. యూరియా సరఫరాలో ఇంతటి కీలకమైన బాధ్యతలు ఉండగా.. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయమే కార్యాలయానికి వచ్చి.. ఎక్కడ ఎంత స్టాక్ ఉన్నది? ఎక్కడికి ఎంత స్టాక్ వెళ్లాలి? ఎక్కడినుంచి ఎక్కడికి తరలించాలి? వంటి అంశాలపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తే కొంత మేరకైనా ఇబ్బందులు తొలగించే అవకాశం ఉంటుంది. అలాకాకుండా అధికారులు ఆఫీసుకే మధ్యాహ్నం తర్వాత వస్తే.. ఇక సమీక్ష ఎప్పుడు చేసేది, ఇబ్బందులు ఎప్పుడు పరిష్కరించేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో యూరియా కొరతకు మార్క్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కూడా కొంత కారణమనే విమర్శలున్నాయి.

ఆగుతున్న ఆర్టీసీ కండక్టర్ల గుండె



అంబేద్కర్ మృతదేహం



పండరి మృతదేహం

మియాపూర్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పండరి.. మంగళవారం ఉదయం డ్యూటీకి వచ్చిన సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్లి అక్కడే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే దవాఖానకు తరలించగా.. హార్ట్‌అటాక్‌తో చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. అప్పటివరకూ తమతో బాధలు పంచుకున్న పండరి.. నిమిషాల్లో విగతజీవిగా మారడంతో తోటి ఉద్యోగులు షాక్‌కు గురయ్యారు. డ్యూటీ సమస్యలకు తోడు ఇంకేమి ఇబ్బందులు ఉన్నాయోనని తోటి కండక్టర్లు చర్చించుకున్నారు.

ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన కండక్టర్ అంబేద్కర్ సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు డ్యూటీ ఉందంటూ ఆందోళనగా, హడావిడిగా స్నానం చేయడానికి వెళ్లాడు. బాత్‌రూమ్‌లోనే అంబేద్కర్ కుప్పకూలిపోయాడు. 108 వాహనం వచ్చేలోపే ఆయన చనిపోయాడు. అతనికి గతంలోనే హృద్రోగ సమస్యలు ఉండగా.. ఉద్యోగ సంబంధమైన టెన్షన్, కుటుంబ సమస్యల కారణంగానే చనిపోయాడని తోటి కార్మికులు అంటున్నారు.

రెండేండ్లలో 25 మంది కండక్టర్లకు హార్ట్ అటాక్

- పనిభారం, అధిక డ్యూటీలతో జీవితాలు ఆగమాగం
- 15 గంటల డ్యూటీలతో రెస్ట్, తిండికి దూరం
- 'అన్నీ జీరో టికెట్లేనా? డబ్బు లేవి?' అంటూ వేధింపులు
- ప్రయాణికుల తప్పిదాలకు కండక్టర్లపై వేటు
- సెలవు కోసం శవాలతో సెల్ఫీ ఇవ్వాల్సిన దుస్థితి
- విపరీతమైన పనిభారంతో బీపీలు, షుగర్లు, పైల్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో కండక్టర్లు ఆకస్మిక గుండెపోటుకు గురవుతున్నారు. రెండ్రోజుల వ్యవధిలోనే ఇద్దరు కండక్టర్లు గుండెపోటుతో చనిపోయిన ఘటనలు ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. అధిక పనిభారం, అధికారుల వేధింపుల కారణంగానే ఆరోగ్య సమస్యలు వస్తున్నట్టు తోటి కండక్టర్లు వాపోతున్నారు. సంస్థలో కొత్తగా కండక్టర్లను రిక్రూట్ చేయకపోవడంతో.. ఉన్నవారిపైనే అధిక పనిభారం పడుతున్నది. ఈ క్రమంలో గత రెండేండ్లలో టీజీఎస్ ఆర్టీసీకి చెందిన కండక్టర్లు సుమారు 25 మంది హార్ట్ అటాక్‌లు, మానసిక ఇబ్బందులతో మృత్యువాత పడ్డారని తోటి కార్మికులు చెప్తున్నారు.

విపరీతమైన పనిభారం..

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో డ్రైవర్లతో పాటు అధిక పనిభారాన్ని ఎదుర్కొనేవారు కండక్టర్లే. 50 సీట్లు ఉన్న బస్సుల్లో 100 నుంచి 150 మంది వరకూ ప్రయాణిస్తుంటే.. విపరీతమైన వర్క్‌లోడు.. పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లకు పరిమితం చేయడంతో ఆ బస్సులో ఆక్యుపెన్సీ రేటు భారీగా పెరిగింది. మహిళల్లో 90శాతం మంది ఉచిత ప్రయాణాలకే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల తప్పులకు కండక్టర్లనే బలి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కండక్టర్లు చేయని తప్పులకు సస్పెండ్ చేస్తున్నారని, టీటీఐల తనిఖీల్లో తమను దొంగలను చూసినట్టు చూస్తున్నారని కండక్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'మహిళా ప్రయాణికులు ఎంతమంది ఎక్కారని కాదు? ఎంత డబ్బు తీసుకొస్తున్నావన్నదే ముఖ్యం..' అంటూ వేధిస్తున్నారని, డబ్బులు రాకపోతే.. 'ఎందుకు రావడం లేదు' అని ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. తెల్లవారుజామున 5.30కు డిపోలో రిపోర్టింగ్ చేస్తే.. రాత్రి 8.30కు డ్యూటీ దిగుతున్నామని, 15 గంటలు పనిచేయించుకుని ఒక గంటకు ఓటీ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిండితినే తీరిక లేదు

తెల్లవారుజామున డ్యూటీ ఎక్కితే.. ప్రయాణికుల హడావిడితో తినే సమయం దొరకడం లేదని పలువురు కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి ఉదయం తెచ్చుకున్న సద్ది.. సాయంత్రానికి పాచిపోతున్నదని వాపోతున్నారు. దీంతో బస్ డిపోల్లో దొరికే నాణ్యతలేని అల్పాహారాలు, భోజనాలు, సమోసాలు తిని ఆరోగ్యాలు పాడవుతున్నాయని అంటున్నారు. డిపో మేనేజర్లు ఇచ్చే టార్గెట్లకు, పెరిగిన వాహనాల ట్రాఫిక్‌తో టైమ్‌కి లంచ్ తినలేకపోతున్నామని చెప్తున్నారు. ఏ వ్యక్తికైనా 8 గంటలు డ్యూటీ చేస్తేనే ఆరోగ్యం బాగుంటుందని.. 15 నుంచి 18 గంటలు నిరంతరాయంగా డ్యూటీ చేస్తే ఇట్లాంటి హార్ట్‌స్ట్రోక్‌లే వస్తాయని అంటున్నారు. సమయానికి తినకపోవడం వల్ల బీపీలు, షుగర్లు, అల్సర్లతో హార్ట్‌అటాక్‌లు, గంటల తరబడి సీట్‌లో కూర్చోవడం వల్ల పైల్స్ వస్తున్నాయని చెప్తున్నారు. ఇక టీటీఐలు కూడా రోజూ తమ టార్గెట్లు రీచ్ అయ్యేందుకు.. చిన్నచిన్న కారణాలకే కండక్టర్లను సస్పెండ్ చేయడం, అక్రమంగా కేసులు పెట్టడం వంటివి చేస్తున్నారని వాపోతున్నారు.

శవాల ముందు సెల్ఫీలా!

కుటుంబసభ్యుల కోసం ఎప్పుడైనా సెలవులు కావాలని అడిగితే డిపో మేనేజర్ల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని అంటున్నారు. బంధువులు చనిపోతే సెలవు ఇచ్చేందుకు శవం దగ్గరకు వెళ్లి సెల్ఫీ పెట్టాలని ఆదేశాలివ్వడం మరీ దారుణమని అంటున్నారు. ఒక్కోసారి విధులకు ఉదయం 5 గంటలకు డిపోకు చేరుకున్నా.. డ్రైవర్ రాకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన సూపర్‌వైజర్లు బలవంతంగా సెలవులు పెట్టించి పంపుతున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయని అంటున్నారు. ఓవైపు అవసరానికి సెలవులు ఇవ్వక.. మరోవైపు బలవంతంగా సెలవులు పెట్టిస్తున్నారని మండిపడుతున్నారు.

జీతాలు పెరగక ఇబ్బందులు..

15 ఏండ్లుగా డ్యూటీలు చేస్తున్నా కండక్టర్ల జీతాలు నెలకు రూ.45 వేల లోపునే ఉన్నాయని వాపోతున్నారు. ఫిట్‌మెంట్ 21 శాతం పెంచినట్టే పెంచి.. హెచ్‌ఆర్‌ఏ ఐదు శాతం తగ్గించారని చెబుతున్నారు. తమతో పాటు ట్రాన్స్‌కో వంటి విభాగాల్లో రిక్రూట్ అయిన లైన్‌మెన్లు ఇప్పుడు సుమారు లక్ష వరకూ జీతాలు తీసుకుంటున్నారని, తమ బతుకులు ఆగం అయ్యాయని వాపోతున్నారు. ఆబ్సెంట్ అయితే.. చార్జీషీటు ఇచ్చి.. ఇంక్రిమెంట్లలో కోతలు విధిస్తున్నారని చెబుతున్నారు. తమను మానసికంగా క్షోభ పెడుతున్నారని, కండక్టర్ జీవితం కత్తిమీద సాములా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు

పండుగపై సమీక్షించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈనెల 21నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బతుకమ్మ ఉత్సవాలపై మంగళవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21న వరంగల్‌లోని వేయి స్తంభాల గుడివద్ద బతుకమ్మ వేడుక ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులకు భద్రత, నమ్మకం కల్పించాం: తుమ్మల

- ఢిల్లీ సదస్సులో తెలంగాణ ఘనతను చాటిన మంత్రి
- కేసీఆర్ హయాంలోని పథకాలన్నీ తమ ఖాతాలోకి..

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్తు, పంట రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలతో రైతులకు భద్రత, నమ్మకం కల్పించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటుచేసిన 2,601 రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ... దాదాపు 13 లక్షల మంది రైతులు, అందులో 3 లక్షల మహిళా రైతులు నేరుగా శాస్త్రవేత్తలు, అధికారులతో సంప్రదింపులు జరిపేలా అవకాశాలు కల్పించామని చెప్పారు. ఢిల్లీలో జరిగిన వ్యవసాయ సదస్సులో తెలంగాణ వ్యవసాయ ఘనతను ఆయన వివరించారు. తుమ్మల చెప్పిన ఘనతలన్నీ కేసీఆర్ హయాంలో సాధించినవే కావడం గమనార్హం.

దేశంలోనే ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రత్యేకం

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : దేశంలో ఏ మెడికల్ కళాశాలకు లేని ప్రత్యేకత ఉస్మానియా మెడికల్ కాలేజీకి ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటళ్ల పనితీరు, ఆయా దవాఖానల్లో అత్యాధునిక వసతుల కల్పన తదితర అంశాలపై మంత్రి మంగళవారం సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఒకటి లేదా రెండు దవాఖానలు మాత్రమే ఉంటాయని.. కానీ, ఉస్మానియా కాలేజీకి మాత్రం 10 అనుబంధ దవాఖానలు ఉన్నట్టు మంత్రి గుర్తుచేశారు. 5 వేలకు పైగా బెడ్లతో, ఒక్కో హాస్పిటల్ ఒక్కో స్పెషాలిటీలో లక్షల మందికి సేవలు అందిస్తున్నట్టు చెప్పారు.

అటవీ అధికారులపై దాడి చేస్తే పీడీ యాక్ట్

మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : అటవీశాఖ అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ నమోదుచేస్తామని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో అటవీశాఖ అధికారుల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ సువర్ణ, సునీతభగవత్‌తో కలిసి ఆమె మాట్లాడారు.

ఆరోగ్యశ్రీ సేవలు బంద్

మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేత

ప్రతి నెలా 100 కోట్లు ఉత్తమాటే

- నెలనెలా డబ్బులు ఇస్తే రూ.1400 కోట్ల బకాయిలు ఎందుకు ఉంటాయి?
- ఇంత పెద్ద ఇష్యూపై ఆర్థిక మంత్రి భట్టి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించరా?
- 2.5 లక్షల బడ్జెట్ రాష్ట్రంలో 2వేల కోట్లు లేవా?
- నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ నేత రాకేశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిచిపోయాయి. రూ.1,400 కోట్ల బకాయిల చెల్లింపులో సర్కారు జాప్యం చేయడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డిరాజు రాకేశ్ వెల్లడించారు. రూ.1,400 కోట్ల బకాయి ఉంటే ప్రభుత్వం సోమవారం రూ.100 కోట్లు విడుదల చేసినట్టు చెప్తున్నదని తెలిపారు. ప్రభుత్వ వైఖరి కారణంగా నెట్‌వర్క్ దవాఖానల నిర్వహణ కుప్పకూలే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. పెండింగ్ బకాయిల అంశం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, వైద్య, ఆరోగ్యశాఖ పరిధిని ఎప్పుడో దాటిపోయిందని, ఈ విషయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గత తొమ్మిది నెలల్లో ముగ్గురు ఆరోగ్యశ్రీ సీఈవోలు మారారని, వారందరికీ వినతిపత్రాలు ఇచ్చి అలసిపోయామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి నెలా రూ.100 కోట్ల బకాయిలు చెల్లిస్తే రూ.1,400 కోట్ల బకాయిలు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ దవాఖానలకు రూ.100 కోట్లు ఏ మూలకూ సరిపోవని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు మొత్తం క్లియర్ చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని చెప్పారు. గ్రీన్ చానల్ ద్వారా ప్రతి నెలా రూ.200 కోట్లు విడుదల చేస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.5 లక్షల కోట్లు ఉంటే అందులో ఆరోగ్యశ్రీకి ఇవ్వడానికి రూ.రెండు వేల కోట్లు ప్రభుత్వం వద్ద లేవా? అని ప్రశ్నించారు. తమ సమస్యలను ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. పెద్ద కార్పొరేట్ దవాఖానలకు బిల్లులు రాకున్నా.. పెద్దగా నష్టమేమీ ఉండదని, కానీ జిల్లాల్లో చాలా మంది సింగిల్‌గా, కపుల్‌గా, నలుగురు స్నేహితులు కలిసి దవాఖానలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరంతా పెట్టుబడి కోసం బయటి నుంచి భారీగా అప్పులు తీసుకొచ్చి ఆరోగ్యశ్రీ సేవలు అందించారని తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి: సీఈవో

ఆరోగ్యశ్రీ వైద్యసేవల నిలిపివేత నిర్ణయాన్ని నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలు వెనక్కి తీసుకోవాలని ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతోపాటు గడిచిన 21 నెలల్లో రూ.1,779 కోట్లను దవాఖానలకు ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 1,375 రకాల వైద్య చికిత్సల చార్జీలను సగటున 22 శాతానికిపైగా పెంచినట్టు గుర్తుచేశారు. కొత్తగా 163 రకాల ఖరీదైన వైద్యసేవలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేషెంట్లను ప్రభుత్వం ఆదుకున్నదని వివరించారు. చార్జీల పెంపు, కొత్త ప్యాకేజీల చేర్పుతో అదనంగా రూ.487.29 కోట్లు పేషెంట్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని వివరించారు. ప్రస్తుతం నెలకు రూ.95 కోట్లు చెల్లిస్తున్నామని, దవాఖానల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు నెలకు రూ.వంద కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు. దవాఖానాల యాజమాన్యాల ఇతర విజ్ఞప్తుల విషయంలోనూ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని తెలిపారు.

ఆరోగ్యశ్రీపై రాజకీయ కుట్ర: దామోదర

కొందరు రాజకీయ దురుద్దేశంతో ఆరోగ్యశ్రీపై కుట్ర చేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత అంశంపై ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. ప్రైవేటు నెట్‌వర్క్ దవాఖానల ఫెడరేషన్‌తో నెల రోజులుగా సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. ప్రతి నెలా రూ.100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు వంద కోట్లు విడుదల చేశామని చెప్పారు. 'అన్ని దవాఖానలు సమ్మెకు వెళ్లేలా లేవని తెలుస్తున్నది. నెట్‌వర్క్ దవాఖానల్లో రెండు వర్గాలు ఉన్నట్టు తెలిసింది. సోమవారం రూ.100 కోట్లు విడుదల చేసిన వెంటనే అంతకుముందు తేదీతో ప్రెస్‌నోట్ విడుదల చేసి సమ్మె చేస్తామని చెప్పడంలో ఆంతర్యమేంటి?' అని పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపులో నాదే ప్రముఖ పాత్ర

వ్యాపారుల సమావేశం పెట్టి మరీ చెప్పకున్న భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్16(నమస్తే తెలంగాణ): జీఎస్టీ ధరల తగ్గింపులో తనదే ప్రముఖ పాత్ర అని ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. జీఎస్టీలో సులభమైన విధానం తెచ్చేందుకు ఢిల్లీలో సుదీర్ఘ చర్చలు జరిగాయని, జీఎస్టీ కౌన్సిల్ సభ్యుడిగా ప్రజల తరపున నిర్ణయాలు తీసుకోవడంలో తాను ప్రముఖ పాత్ర వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. జీఎస్టీ రేట్ల సవరణ నేపథ్యంలో మంగళవారం ఎంసీహెచ్చార్డీ కార్యాలయంలో వ్యాపార వర్గాలతో కలిసి ఆయన మాట్లాడారు. జీఎస్టీ రేట్ల సవరణతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 5 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని చెప్పారు. సవరించిన రేట్లతో వస్తువులు తక్కువ ధరకు వస్తున్నాయని, వాటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం

మొదటిపేజీ తరువాయి...

తంటాలు పడి ఎమ్మెల్సీ ఆఫర్‌తో అడ్డు తొలగించుకున్నారు. ఇక తాము చెప్పిందే అధిష్ఠానానికి వేదం అనుకుని స్థానికుడికే టికెట్ అంటూ మంత్రి పొన్నంతో ప్రకటన కూడా చేయించారు. కానీ అనూహ్యంగా మాజీ ఎంపీ అంజన్‌కుమార్ రూపంలో మళ్లీ ముసలం మొదలైంది. కాకపోతే అజారుద్దీన్‌లా చిరుజల్లుల లెక్క కాకుండా ఈసారి తుపానులా కొనసాగుతున్నది. పొన్నం ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే ధీటైన కౌంటర్‌తో సమాధానమిచ్చిన అంజన్‌కుమార్ యాదవ్ తన దూకుడు మరింత పెంచారు. నియోజకవర్గంలో మంగళవారం ఏకంగా పోస్టర్లతో మరింత హల్‌చల్ సృష్టించారు. ఇదే అదునుగా సామాజిక కోణంలోనూ టికెట్ డిమాండ్ పెరుగుతుండటం కాంగ్రెస్‌ను మరింత కలవరపాటుకు గురిచేస్తున్నది.

రేవంత్ పావులు.. ఆ వెనకే సవాళ్లు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ తరఫున తామే పట్టు కొనసాగించాలని సీఎం వర్గం ముందు నుంచీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. కానీ ఆశావహుల రూపంలో ఎప్పటికప్పుడు ఆ వర్గానికి సవాళ్లు ఎదురవుతూనే ఉండటంతో ఉప ఎన్నిక సమీపిస్తున్న కొద్దీ పార్టీలో టికెట్ల కొట్లాట తారస్థాయికి చేరుతున్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఖాతా కూడా తెరవలేదు. కాకపోతే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్య నందిత దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లు కావడంతో అప్పుడు జరిగిన ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. కానీ రెండేండ్లుగా కాంగ్రెస్ సర్కారుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత ఒకవంతైతే.. హైదరాబాద్ మహా నగరంలో హైడ్రా, మూసీ రూపాల్లో పేదల ఇండ్లు కూల్చడం, నయాపైసా అభివృద్ధి కూడా చేయకపోవడంతో నగరవాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ అనేక సర్వేలు చేయించుకున్నా అనుకూలత కనిపించకపోవడంతో అధిష్ఠానం అభ్యర్థి ఎంపికలోనే మల్లగుల్లాలు పడుతున్నది.



యూసుఫ్‌గూడలో వెలసిన అంజన్‌కుమార్‌యాదవ్ పోస్టర్లు

దీంతో సీఎం ముగ్గురు మంత్రులను రంగంలోకి దింపి అభివృద్ధి పనుల పేరిట హడావుడి మొదలుపెట్టించారు. కనీసం గతంలో నియోజకవర్గం నుంచి పోటీ చేసి, ఓడిపోయిన మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు సమాచారం లేకుండానే మంత్రులు పర్యటనలు చేస్తుండటంతో అజార్ వర్గం సొంతంగా ప్రచారం మొదలుపెట్టింది. ఇక లాభం లేదనుకొని సీఎం వర్గం చివరికి ఎమ్మెల్సీ ఆఫర్ ఇచ్చి అజార్‌ను బుజ్జగించాలని అధిష్ఠానాన్ని కోరడంతో ఆ మేరకు ఆయన అంగీకరించారు.

అడ్డులేదనుకున్న తరుణంలో

జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్‌లో టికెట్ ఆశించే వారు పలువురు ఉన్నా అజార్ రేసులో ఉన్నంత వరకు ఇతరులెవరూ పెద్దగా తెరమీదకు రాలేదు. కానీ ఎప్పుడైతే సీఎం వర్గం అజార్ అడ్డును తొలగించుకోవడమే కాకుండా ఏకపక్షంగా మంత్రి పొన్నంతో 'స్థానికులకే టికెట్' అని ప్రకటన చేయించింది. అప్పటికే సీఎం వర్గం తనను పరిగణలోనికి తీసుకోవడంలేదనే అసంతృప్తితో ఉన్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఒక్కసారిగా భగ్గుమన్నారు. గతంలో తాను జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉన్న సికింద్రాబాద్ పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించానన్న అంశాన్ని కూడా సీఎం వర్గం దృష్టిలో ఉంచుకోకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని అంజన్ వర్గీయులు అంటున్నారు. ఈ క్రమంలో పొన్నంకు కొన్ని గంటల వ్యవధిలోనే ధీటైన కౌంటర్ ఇచ్చిన అంజన్‌కుమార్ 'జూబ్లీహిల్స్ నుంచి పోటీలోకి దిగుతున్నా' అంటూ కుండబద్దలు కొట్టారు. ముఖ్యంగా పొన్నం ప్రకటన వెనక ఉన్న ఆంతర్యాన్ని గుర్తించిన ఆయన 'నేను పారాషూట్ నేతను కాను' అంటూనే మంత్రి పొన్నం ప్రభాకర్ కంటే సీనియర్ అని అందరికీ ఒకే ప్యాకేజీలో కౌంటర్ ఇచ్చారు. వాస్తవానికి అంజన్‌కుమార్ యాదవ్ పార్టీలో సీనియర్ కావడంతో పాటు ఆది నుంచీ పార్టీని నమ్ముకొని ఉన్న ముఖ్యనేతల్లో ఒకరు. పైగా ఢిల్లీ అధిష్ఠానంతోనూ ఆయనకు సత్సంబంధాలున్నాయి. ఇదే అదునుగా దూకుడు పెంచిన అంజన్‌కుమార్ వర్గం మంగళవారం నియోజకవర్గంలో పోస్టర్లతో హల్‌చల్ మొదలుపెట్టింది. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అంజన్‌కుమార్‌నే కోరుకుంటుందంటూ దాడి మొదలుపెట్టింది. పనిలో పనిగా టికెట్ ఆశిస్తున్న మరో నేత బొంతు రామ్మోహన్ సామాజిక కోణంలో నరుక్కుంటూ వస్తున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన నేతలను రంగంలోకి దింపి నియోజకవర్గంలో తమ బలం ఉన్నందున తనకే టికెట్ ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నారు.

ఎవరికి 'వారే'

జూబ్లీహిల్స్ టికెట్ దక్కించుకొనేందుకు కాంగ్రెస్ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎవరికి వారు తగ్గేదెలే అంటూ అధిష్ఠానం ముందట తమ దర్పం ప్రదర్శిస్తున్నారు. తమకే టికెట్ ఇవ్వాలంటూ ఎవరికి వారు తమ అనుయాయులతో అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేసుకుంటున్నారు. మరోవైపు నియోజకవర్గంలోనూ తమకే టికెట్ వస్తుందనే సంకేతాలు క్యాడర్‌లో నింపేందుకు విభిన్న కార్యక్రమాలు చేస్తున్నారు. తాజాగా అంజన్ కుమార్ యాదవ్ పోస్టర్లు నియోజకవర్గంలో వెలిశాయి.

ఎందుకింత రాద్ధాంతం!

జూబ్లీహిల్స్‌ను గెలుచుకోవాలన్న ఆరాటంతో ఇప్పటికే ముగ్గురు మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా విభజించారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, గడ్డం వివేక్‌లకు బాధ్యతలు అప్పగించారు. వీళ్లంతా నియోజకవర్గంలో తిరుగుతుంటే ప్రజలు కాంగ్రెస్ పాలనలో తమకు కష్టాలు తప్పడం లేదని చెప్తుండటంతో వాళ్లంతా కంగుతినాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతమంది మంత్రులను పెట్టి సమస్యలను పరిష్కరిస్తారా? కేవలం ఎన్నికల కోసమేనా? అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

టికెట్ దొరికేనా!

మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందిన తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో ఆ నియోజకవర్గ బరిలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలోని అందరి కండ్లూ పడ్డాయి. అజారుద్దీన్, నవీన్ యాదవ్, ఫహీం ఖురేషి, అంజన్ కుమార్ యాదవ్, మధుయాష్కీ, బొంతు రామ్మోహన్ తదితర పేర్లన్నీ వినిపించాయి. ఓ దశలో నటుడు చిరంజీవి పేరును కూడా రేవంత్ వర్గం పరిశీలించినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నదని సమాచారం. ఒక్క నియోజకవర్గంపై అంతమంది ఆశావహులు ఉండటంతో అధిష్ఠానం సైతం ఎవ్వరికి టికెట్ ఇవ్వాలో తేల్చుకోలేని అయోమయంలో పడింది. ఎట్టకేలకు అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ కేటాయించి అతడిని రూట్ నుంచి తప్పించినా మిగిలిన నాయకులంతా టికెట్ కోసం పట్టు పడుతున్నారు. ఈ దశలో వారిలో ఒకరిని ఎంపిక చేయడం కష్టంగా మారినట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

జూబ్లీహిల్స్ తెర మీదికి దానం!

- టికెట్ కోసం నాగేందర్ ప్రయత్నాలు
- గుల్బర్గాలో మల్లికార్జున ఖర్గేను రహస్యంగా కలిసినట్టు ప్రచారం
- టికెట్ ఇస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా ప్రపోజల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు మరో కాంగ్రెస్ నేత తెర మీదికి వచ్చారు. బీఆర్‌ఎస్ గుర్తు మీద ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్ జూబ్లీహిల్స్ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాంగ్రెస్ గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేసిన తనపై అనర్హత కత్తి వేలాడుతున్నదని, బైపోల్ వస్తే ఖైరాతాబాద్ నుంచి తనకు ఇబ్బందులు తప్పక పోవచ్చనే ఆందోళనతో ఉన్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. వేటు పడేంత వరకు వేచి చూడటం కంటే తానే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల టికెట్ తనకే ఇవ్వాలని దానం కాంగ్రెస్ అగ్రనేతలను కోరినట్టు సమాచారం. ఈ మేరకు ఆయన మంగళవారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు వెళ్లి మల్లికార్జున ఖర్గేను, ఆయన కుమారుడిని రహస్యంగా కలిసినట్టు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి ఆయనకు ఈ ఏర్పాటుచేసినట్టు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ బలంగా ఉన్నదని, ఉప ఎన్నికలకు పోతే మళ్లీ గెలవడం ఆషామాషీ కాదని దానం వివరించినట్టు తెలిసింది. పైగా జూబ్లీ బరిలో నిలిచేందుకు కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థి ఇంకా దొరకలేదని, అక్కడ తనను నిలబెడితే గెలుస్తానని, పార్టీ టికెట్ హామీ ఇస్తే తాను రాజీనామా చేస్తానని వారి ముందు ప్రపోజల్ పెట్టినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మీద తనకు పట్టు ఉన్నదని వివరించినట్టు సమాచారం. ఖైరతాబాద్ ఉప ఎన్నికలకు పార్టీ ఎవరిని నిలబెట్టినా వారి గెలుపు బాధ్యత తాను తీసుకుంటానని చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

తాత్కాలిక బదిలీలు.. డిప్యూటేషన్లే దిక్కు

- జీవో-317 బాధితులకు బదిలీలు, డిప్యూటేషన్లు
- ఉత్తర్వులు జారీచేసిన రేవంత్ సర్కారు
- మండిపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు
- నిరసనగా 24, 25న బస్సుయాత్ర: టిగారియా

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : 'జీవో-317ను సమీక్షిస్తాం. బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం' ఇది కాంగ్రెస్ మ్యానిఫెస్టో గ్యారెంటీ. ఈ గ్యారెంటీ అమలులో భాగంగా మంత్రులతో సబ్ కమిటీ వేసింది. నెలల తరబడి చర్చలు జరిపింది. ఆఖరుకు తాత్కాలిక బదిలీలు, డిప్యూటేషన్లతో సరిపుచ్చింది. మంగళవారం సర్కారు మార్గదర్శకాలు విడుదల చేసింది. న్యాయం చేస్తామంటే డిప్యూటేషన్లు ఇవ్వడమేనా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదని తెలంగాణ ఆల్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టిగారియా) అభిప్రాయపడింది. న్యాయం జరగకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 24, 25న బస్సుయాత్ర నిర్వహిస్తామని రాష్ట్ర బాధ్యులు మధుసూదన్, జనార్దన్, గణేశ్, భిక్షంయాదవ్ ప్రకటించారు.

రెండేండ్లు.. ఆ తర్వాత మరో ఏడాదే

జీవో-317 ద్వారా వేరే జోన్, జిల్లాకు బదిలీ అయ్యి, స్పౌజ్, పరస్పర బదిలీల్లో అవకాశం రానివారు మాత్రమే అందుకు అర్హులు. మొదట రెండేండ్లు అవకాశం కల్పిస్తారు. గరిష్ఠంగా మూడేండ్లు ముగిసిన తర్వాత రొటేషన్ పద్ధతిలో ఇతరులకు అవకాశం కల్పిస్తారు. ఇవి శాశ్వత బదిలీలు కావు. క్రమశిక్షణా చర్యలు తీసుకున్న వారు అనర్హులు. ఖాళీగా ఉన్న స్థానాల్లో మాత్రమే అవకాశం కల్పిస్తారు. తాత్కాలిక బదిలీలు.. డిప్యూటేషన్ల అవకాశం కల్పించినందుకు తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పదోన్నతి పొందిన వారికి అవకాశం లేదనడం దారుణం: ఆర్‌యూపీపీ

జీవో -317 బాధితుల సమస్య పరిష్కారం కోసం జారీచేసిన జీవోను సవరించాలని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ స్టేట్ (ఆర్‌యూపీపీటీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. పదోన్నతి పొందిన వారు అర్హులు కాదనడం దారుణమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శానమోని నర్సింహులు అన్నారు. ఉన్న ఖాళీల్లో రెండేండ్ల డిప్యూటేషన్లు ఇచ్చేందుకు ఇన్ని రూల్సా..? అంటూ ప్రశ్నించారు. ఈ జీవోను సవరించకుంటే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

మెట్రో రైల్ ఎండీగా సర్ఫరాజ్

నలుగురు ఐఏఎస్‌లకు స్థానచలనం

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో పాటు పలువురు ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఎన్వీఎస్ రెడ్డిని అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగ ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీల వివరాలు

పేరు	బదిలీ స్థానం
సర్ఫరాజ్ అహ్మద్	మెట్రో రైల్ ఎండీ
శృతి ఓజా	స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్
కృష్ణ ఆదిత్య	సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ)
కోట శ్రీవాత్సవ	హెచ్ఎండీఏ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ)

నాన్-క్యాడర్ బదిలీలు

పేరు	బదిలీ స్థానం
జీ జితేందర్‌రెడ్డి	ఆయిల్‌ఫెడ్ ఎండీ
ఎం రాజిరెడ్డి	హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్
ఆర్ ఉపేందర్‌రెడ్డి	హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (సబ్ అర్బన్ రీజియన్)
టీ వెంకన్న	హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (కోర్ అర్బన్ రీజియన్)



అర్ధరాత్రి విద్యార్థినుల 65 కిలోమీటర్ల పాదయాత్ర!

టీచర్ల కొరతపై ఆందోళన ▪ బీజేపీ పాలిత అరుణాచల్‌లో ఘటన

డబుల్ ట్రబుల్ ఇంజిన్

ఇటానగర్, సెప్టెంబర్ 16: తాము చదువుకుంటున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో టీచర్ల కొరతను నిరసిస్తూ విద్యార్థినులు అర్ధరాత్రి పాదయాత్ర చేపట్టారు. తమ పాఠశాలలో నెలకొన్న టీచర్ల కొరతను ఎత్తిచూపుతూ 65 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తిచేశారు. నీలిరంగు పాఠశాల యూనిఫాంలో ఉన్న విద్యార్థినులు ఆదివారం న్యాంగ్నో గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించి, రాత్రంతా నడిచి.. సోమవారం ఉదయం జిల్లా ప్రధాన కార్యాలయం లెమ్మికి చేరుకున్నారు. రాత్రి, ఉదయం వారు చేపట్టిన పాదయాత్ర వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉపాధ్యాయులు లేని పాఠశాల భవనం.. అనే బ్యానర్లను విద్యార్థినులు ప్రదర్శించటం సంచలనంగా మారింది. దీంతో భౌగోళిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం టీచర్లను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేయటం గమనార్హం.

ఒకే ఇంట్లో 4,271 మంది ఓటర్లు!

యూపీలోని మహోబా జిల్లాలో వెలుగులోకి

లక్నో: బీజేపీ పాలిత యూపీ రాష్ట్రంలోని ఓటరు లిస్టుల్లో పలు అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని, మహోబా జిల్లాలోని ఒకే ఇంటిలో 4,271 మంది ఓటర్లు నమోదై ఉన్నారని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహోబా జిల్లాలోని రెండు ఇళ్లలో 243, 185 ఓట్లు ఉన్నట్టు తాను సోమవారం చెప్పానని, కానీ అంతకన్నా షాకింగ్ విషయాన్ని తాను తాజాగా కనుగొన్నానన్నారు. అదే జిల్లాలోని మరో ఇంటిలో 4,271 మంది ఓటర్లు నమోదై ఉన్నారని, ఓట్లే అన్ని ఉన్నాయంటే మొత్తం కుటుంబ సభ్యుల సంఖ్య 12 వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. వాస్తవానికి అధికార బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కుతో ఓట్ల చోరీ తొలుత యూపీలోనే ప్రారంభమైందని ఆయన ఆరోపించారు. అసాధారణమైన ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. మహోబాలోనే కాదు రాష్ట్రంలోని పలు చోట్ల కూడా ఇలాంటి అక్రమాలు జరిగాయని, తమ పార్టీ దానిని కూడా వెలికి తీస్తుందని చెప్పారు.

ఒడిశాలో విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

స్నేహితుడిని కట్టేసి దారుణానికి పాల్పడిన దుండగులు

పూరీ: బీజేపీ పాలిత ఒడిశాలోని పూరీ సముద్ర తీరం సమీపంలో ఓ కళాశాల విద్యార్థిని (19) సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ నెల 13న ఈ ఘటన జరగ్గా, 15న బాధితురాలు ఆ షాక్ నుంచి తేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. తన స్నేహితుడితో కలిసి ఆమె మొదట బలిహర్ చంద్ గుడికి అక్కడి నుంచి దగ్గరలోని అడవికి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నిందితులు బాధితురాలు, ఆమె స్నేహితుడిని వీడియో తీసి డబ్బులివ్వాలని బెదిరించారు. బాధితురాలి స్నేహితుడు డబ్బులివ్వడానికి నిరాకరించడంతో అతడి చేతులు కట్టేశారు. ఆ తర్వాత ఇద్దరు నిందితులు యువతిపై అత్యాచారం చేశారు.

జనవరిలోగా స్థానిక ఎన్నికలు నిర్వహించండి

- మహారాష్ట్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు గడువు విధింపు
- మునుపటి షెడ్యూల్‌ను పాటించకపోవడంపై అసంతృప్తి
- మరోసారి గడువు పొడిగించేది లేదని ధర్మాసనం స్పష్టీకరణ



ముంబై, సెప్టెంబర్ 16: సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించటంలో విఫలమైనందుకు మహారాష్ట్ర ఎన్నికల సంఘం తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. రాష్ట్రంలోని స్థానిక సంస్థలన్నింటికీ 2026 జనవరి 31లోగా ఎన్నికలు నిర్వహించాలని మహారాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు తీర్పు వెలువరించింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కోర్టు నిర్దేశించిన మునుపటి షెడ్యూల్‌ను పాటించటంలో విఫలమైనందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం తీరును తప్పుబట్టింది. ఎన్నికల షెడ్యూల్‌ను మరోసారి పొడిగించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి, ఈసీకి ఇచ్చేది లేదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అలాంటి అభ్యర్థనలను తాము వినదలచుకోలేదని పేర్కొన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న డీలిమిటేషన్ కసరత్తును అక్టోబర్ 31లోగా ముగించాలని, దీనిని సాకుగా చూపుతూ ఎన్నికలను వాయిదా వేస్తామంటే కుదరదని ధర్మాసనం తెలిపింది. నాలుగు వారాల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలపై నోటిఫికేషన్ జారీచేయాలని, నాలుగు నెలల్లో ఎన్నికలను పూర్తిచేయాలని మే నెలలో సుప్రీంకోర్టు మహారాష్ట్ర ఈసీని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను ఈసీ పాటించకపోవటంపై సుప్రీంకోర్టు నేడు అసంతృప్తి వ్యక్తం చేసింది.

సిబ్బందిని సిద్ధం చేసుకోండి..

ఎన్నికల నిర్వహణకు ఎంత సిబ్బంది అవసరమో.. ఆ వివరాల్ని ఈసీ, రెండు వారాల్లో రాష్ట్ర సీఎస్‌కు అందజేయాలని, ఆ మేరకు నాలుగు వారాల్లో సీఎస్ సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. సరిపడా ఈవీఎంలు సేకరించాలని, వీటిపై నవంబర్ 30లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లపై కోర్టు వ్యాజ్యం కారణంగా 2022 నుంచి మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి.

అరబ్-ఇస్లామిక్ నాటో!

- సైనిక కూటమి ఏర్పాటుకు ఇస్లామిక్ దేశాల యోచన
- ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో కీలక నిర్ణయం
- దోహాలో అరబ్, ఇస్లామిక్ దేశాల అత్యవసర సమావేశం
- పాకిస్థాన్, తుర్కియే సహా 34 దేశాల నేతల హాజరు



దోహాలో జరిగిన అరబ్-ఇస్లామిక్ దేశాల సదస్సుకు హాజరైన వివిధ దేశాల అధినేతలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఖతార్‌లో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ఐక్యంగా స్పందించిన అరబ్, ఇస్లామిక్ దేశాలకు చెందిన పలువురు నాయకులు సోమవారం దోహాలో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టడంపై తీసుకోవలసిన చర్యల విషయంలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ అరబ్ సైనిక కూటమి ఏర్పాటుపై మాత్రం వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. అరబ్ ప్రపంచంలో అతి పెద్ద సైనిక పంపత్తి గల ఈజిప్టు ఈ అరబ్ సైనిక కూటమికి అరబ్ నాటో అని నామకరణం చేయగా, దోహాలో జరిగిన అత్యవసర సమావేశానికి పాకిస్థాన్, తుర్కియే కూడా హాజరయ్యాయి. అణ్వస్త్రాలు గల ఏకైక ముస్లిం దేశమైన పాకిస్థాన్ ఈ అత్యవసర సమావేశంలో పాల్గొనడంతోపాటు ఇజ్రాయెలీ కుట్రలను కనిపెట్టేందుకు ఓ ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. ఇజ్రాయెల్‌ని ఆర్థికంగా దెబ్బతీయాలని తుర్కియే అధ్యక్షుడు తయ్యీప్ ఎర్దోగన్ ఈ సమావేశంలో సూచించారు. నాటో తరహాలో అరబ్, ఇస్లామిక్ దేశాలు ఉమ్మడి భద్రతా వ్యవస్థను నిర్మించుకోవాలని ఇరాక్ ప్రధాని మొహమ్మద్ సుడానీ కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 34 దేశాల ఇస్లామిక్ కూటమి ఏర్పాటుకు సౌదీ అరేబియా గతంలోనే ప్రతిపాదించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా తన మిత్రదేశాలతో భద్రతా ఒప్పందాలను పునఃపరిశీలిస్తున్న తరుణంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

కైరోలో హెడ్‌క్వార్టర్స్!

ఈజిప్టు రాజధాని కైరోలో అరబ్ నాటో ప్రధాన కార్యాలయం ఉండాలని ఈజిప్టు ప్రతిపాదిస్తోంది. ఉమ్మడి సైన్యం కోసం తమ వంతుగా 20,000 మంది బలగాలను సమకూర్చడానికి ఈజిప్టు సంసిద్ధత తెలిపింది. ఉమ్మడి బలగాలకు తొలి కమాండర్‌గా ఈజిప్టుకు చెందిన ఫోర్ స్టార్ జనరల్ ఉండాలని కూడా ఈజిప్టు ప్రతిపాదించింది. 22 అరబ్ లీగ్ సభ్యుల మధ్య సైనిక నాయకత్వం పరిభ్రమిస్తుంటుందని, భూమి, వాయు, నౌకాదళానికి చెందిన సేనలతోపాటు కమాండో యూనిట్లు ఇందులో భాగమై ఉంటాయని, వాటికి సమగ్ర శిక్షణతోపాటు లాజిస్టిక్స్ కూడా ఉమ్మడిగా సమకూర్చుకోవడం ఉంటుందని ఈజిప్టు ప్రతిపాదించింది. డిప్యూటీ కమాండ్ బాధ్యతను నిర్వహించడానికి సౌదీ అరేబియా ఆసక్తిని కనబరుస్తోంది. యూఏఈ, బహ్రెయిన్ వంటి గల్ఫ్ దేశాలు నిధుల సమీకరణ, అధునాతన ఆయుధ సంపత్తి సేకరణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. తమ అరబ్ నాటో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆత్మరక్షణ ఛత్రంగా పనిచేస్తుందే తప్ప ప్రతిఘటన కూటమిగా కాదని ఈ సమావేశంలో పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

తగలబడుతున్న గాజా నగరం

హమాస్ నిర్మూలనకు ఐడీఎఫ్ గ్రౌండ్ ఆపరేషన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: గాజా నగరంలో గ్రౌండ్ ఆపరేషన్ కోసం ఎంతోకాలం నుంచి వేచి చూస్తున్న ఇజ్రాయెల్ మంగళవారం ఆపరేషన్ ప్రారంభించినట్లు వెల్లడించింది. గాజా తగలబడుతోంది అని ప్రకటించిన ఇజ్రాయెల్.. గాజా నగరంలోని హమాస్ ఉగ్రవాద స్థావరాలను ఇజ్రాయెల్ రక్షణ దళాలు(ఐడీఎఫ్) ధ్వంసం చేయడం మొదలుపెట్టినట్లు తెలిపింది.గాజా నగరంలో నివసిస్తున్న వేలాదిమంది పౌరులు తమ ఇళ్లను వదిలి పారిపోవాలని ఐడీఎఫ్ ఆదేశించింది. హమాస్‌ను అంతం చేసి బందీలను విడిపించుకోవడానికి ఐడీఎఫ్ సైనికులు పోరాటం సాగిస్తున్నట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. గాజా తగలబడుతోందని ఆయన ప్రకటించారు. గాజాలో కీలకమైన ఆపరేషన్ ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు.



అస్సాం అధికారిణి అక్రమాస్తులు

రూ.2 కోట్లపైనే!

6 నెలలు నిఘా ఉంచి అరెస్ట్ చేసిన విజిలెన్స్

గువాహటి: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై అస్సాం సివిల్ సర్వీసెస్ అధికారిణి నుపుర్ బోరాను సోమవారం అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. సీఎం ప్రత్యేక నిఘా విభాగ అధికారులు గువాహటిలోని ఆమె ఇంట్లో సోదాలు చేసి రూ.92 లక్షల నగదు, రూ.1 కోటి విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. మరో రూ.10 లక్షలను సోదాలు కొనసాగుతున్న బర్పెటాలోని ఆమె అద్దె ఇంట్లో రికవరీ చేశారు. బోరా కామరూప్ జిల్లాలో సర్కిల్ అధికారిణిగా పని చేస్తున్నారు. వివాదాస్పద భూముల వ్యవహారాల్లో ఆమె ప్రమేయం ఉందన్న ఆరోపణలపై ఆరు నెలలుగా ఆమెపై నిఘా ఉంచినట్టు అస్సాం సీఎం తెలిపారు.

సానుకూలంగా వాణిజ్య చర్చలు

భారత్, అమెరికా వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు అమలులోకి వచ్చిన తర్వాత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మొదటిసారి భారత్-అమెరికా మధ్య మంగళవారం చర్చలు జరిగాయి. వీటిని ఉభయపక్షాలు 'సానుకూలం'గా అభివర్ణించాయి. ద్వైపాక్షిక వాణిజ్య చర్చల కోసం తీసుకోవలసిన తదుపరి చర్యల గురించి అమెరికా వాణిజ్య సహాయ ప్రతినిధి బ్రెండన్ భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌తో సానుకూల చర్చలు జరిపారని అమెరికా ఎంబసీ అధికార ప్రతినిధి తెలిపారు. కొద్దిసేపటి తర్వాత భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మరో ప్రకటన కూడా ఇదే విధంగా స్పందిస్తూ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు తీసుకోవలసి చర్యలను వేగవంతం చేయాలని ఉభయ దేశాలు నిర్ణయించాయని తెలిపింది.

న్యూయార్క్‌టైమ్స్‌పై ట్రంప్ 1.3 లక్షల కోట్ల పరువు నష్టం దావా

వాషింగ్టన్: అమెరికాలోని ప్రముఖ వార్తా పత్రిక న్యూయార్క్ టైమ్స్‌పై 15 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1.3 లక్షల కోట్ల) పరువునష్టం దావా వేయనున్నట్టు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వివాదాస్పద లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్‌తో ట్రంప్ సంబంధాలపై ఆ పత్రిక వరుస కథనాలు ప్రచురిస్తున్న నేపథ్యంలో ఆగ్రహించిన ట్రంప్ ఈ ప్రకటన చేశారు. 'ఈ రోజు న్యూయార్క్ టైమ్స్‌పై 15 బిలియన్ డాలర్ల దావా వేసిన గౌరవం నాకు దక్కింది. ఇది మన దేశ చరిత్రలోనే అత్యంత చెత్త, దిగజారిన పత్రిక' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అఫైర్ కారణంతో మరో సీఈవోపై వేటు

సిడ్నీ: ఉద్యోగినితో అఫైర్ మరో సీఈవో ఉద్యోగానికి ఎసరు తెచ్చింది. ఆస్ట్రేలియాకు చెందిన సూపర్ రిటైల్ గ్రూప్ సీఈవో ఆంథోని హెరాఘ్టీని విధుల నుంచి తప్పించినట్టు సంస్థ మంగళవారం ప్రకటించింది. కంపెనీ మాజీ హెచ్ ఆర్ అధికారితో ఉన్న ప్రేమ సంబంధాన్ని వెల్లడించకుండా రహస్యంగా ఉంచిన క్రమంలో ఆంథోనిపై ఈ చర్య తీసుకున్నారని స్కైన్యూస్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

భారత దాడిలో మసూద్ అజర్ కుటుంబం

చిన్నాభిన్నం

జైషే మహ్మద్ కమాండర్ వెల్లడి

ఇస్లామాబాద్: కశ్మీర్‌లోని పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే మహ్మద్ టాప్ కమాండర్ మసూద్ అజర్ కుటుంబం బహవల్పూర్‌లో చిన్నాభిన్నం అయిపోయిందని జేఈఎం కమాండర్ మసూద్ ఇలియాస్ కాశ్మీరీ ఒప్పుకున్నారు. భారత వాయుసేన వారి రహస్య స్థావరంలోకి చొరబడి ఎలా నాశనం చేసిందనే విషయాన్ని ఆయన ఒక బహిరంగ సభలో వెల్లడించారు. ఆవేశంతో ఉర్దూలో చేసిన ప్రసంగం వీడియో వైరల్ అయింది. 'మే 7న బహవల్పూర్‌లో భారత దళాలు మౌలానా మసూద్ అజర్ కుటుంబాన్ని ముక్కలు చేశాయి' అని కాశ్మీరీ ఆవేశంతో పేర్కొన్నాడు.

ప్రధాని మోదీ@75

- రిటైర్మెంట్‌పై సోషల్ మీడియాలో చర్చ
- 75 ఏండ్లు పైబడ్డారనే కారణంతో గతంలో సీనియర్లను తప్పించిన వైనం
- మోదీకి మాత్రం నిబంధన వర్తించదా? అని విపక్షాలు, నెటిజన్ల ప్రశ్నలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 75వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో అనధికారికంగా అమలవుతున్న '75 ఏండ్లకు రిటైర్మెంట్' నిబంధనపై మరోసారి చర్చ జరుగుతున్నది. తన చిరకాల మిత్రుడు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ గత జూలైలో చేసిన వ్యాఖ్యలతోనే మోదీ వయసుపై చర్చ మొదలైంది. నాగపూర్‌లో జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభలో భాగవత్ మాట్లాడుతూ హిందూత్వ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే మాటలను ఉటంకిస్తూ "75 ఏళ్లు వచ్చిన తర్వాత ఎవరైనా సరే అక్కడితో నడక ఆపేసి ఇతరులకు దారి ఇవ్వాలి. ఆ వయసులో ఎవరైనా శాలువా కప్పి సన్మానిస్తే ఇక పక్కకు తప్పుకోండి అని సూచించినట్లుగా భావించాలి" అన్నారు. ఈ వ్యాఖ్యలు భాగవత్, మోదీ ఇద్దరూ మరో రెండు నెలల్లో 75వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా రావడం విశేషం. సెప్టెంబర్ 11న భాగవత్ జన్మదినం కాగా సెప్టెంబర్ 17న మోదీ జన్మదినం. భాగవత్ చేసిన ఈ వ్యాఖ్యలు మోదీని ఉద్దేశించే చేసినట్లు పలువురు భావించారు. గతంలో 75వ సంవత్సరంలోకి ప్రవేశించిన పార్టీ సీనియర్ నేతలను వయో పరిమితి పేరుతో క్రియాశీల రాజకీయాల నుంచి పక్కకు తప్పించి ప్రయోజనం పొందిన నరేంద్ర మోదీ ఇప్పుడు అదే ప్రమాణాలను పాటిస్తారా అన్న ప్రశ్న ప్రతిపక్షాలనే కాక సామాన్య ప్రజలను సైతం వేధిస్తోంది. బీజేపీ లిఖితపూర్వకంగా అమలులోకి తెచ్చిన ఈ అనధికార నిబంధన కారణంగా 2013లో పార్టీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ అస్త్ర సన్యాసం చేయవలసి వచ్చింది. అప్పుడు ఇదే మోహన్ భాగవత్ 2009 ఎన్నికలు మీ చివరి అవకాశమని అద్వానీకి చెప్పడంతో ఆ తర్వాత నుంచి అద్వానీకి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించలేదని ప్రముఖ జర్నలిస్టు, నరేంద్ర మోదీ: ది మ్యాన్, ది టైమ్స్ అనే పుస్తక రచయిత నీలాంజన్ ముఖోపాధ్యాయ ఫ్రంట్‌లైన్ పత్రికలో రాశారు. ఈ అనధికార నిబంధనే మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా చాటేందుకు మార్గాన్ని సుగమం చేసి 2014 విజయంతో అధికారంలో కూర్చోపెట్టింది.

ఏమిటీ ద్వంద్వ నీతి: విపక్షాలు

ఆనాడు భాగవత్ చేసిన వ్యాఖ్యలను మోదీ మరచిపోయినా ప్రతిపక్షాలు మాత్రం మరచిపోలేదు. "మోదీకి 75 ఏళ్లు పూర్తి అవుతున్నాయి. ఇక ఆయన ఎప్పుడు తప్పుకుంటారు? అసలు తప్పుకుంటారా, లేదా? ఇతరులందరినీ పక్కకు తప్పించిన మోదీకి తన పదవి ఎక్కడ పోతుందో అన్న ఆందోళన తప్ప దేశం ఏమై పోయినా పట్టలేదు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 75 ఏళ్ల వయసు దాటిన సీనియర్ నాయకులు క్రియాశీల రాజకీయాల నుంచి తప్పించడానికి బీజేపీ ఏర్పాటు చేసిన మార్గదర్శక్ మండల్‌ని కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నాయకుడు అభిషేక్ మనూ సింఘ్వీ గుర్తు చేస్తూ మనం పాటించని నీతిని ఇతరులకు బోధించడం మహా పాపం అని వ్యాఖ్యానించారు.

ఆ నిబంధనే లేదు: బీజేపీ

పదవీ విరమణ వయసును తాము విధించామన్న ప్రతిపక్షాల వాదనను బీజేపీ తోసిపుచ్చింది. మోదీ రాజీనామా చేస్తారన్న చర్చను నిరాధార వదంతులుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొట్టివేశారు. పింగ్లే మాటలను గుర్తు చేస్తూ తాను చేసిన వ్యాఖ్యలు నేరుగా ప్రధాని మోదీకే తాకడంతో భాగవత్ ఇటీవల వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. "నా రిటైర్మెంట్ గురించి కాని మరెవరో రిటైర్మెంట్ గురించి కాని నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు" అంటూ వివరణ ఇచ్చారు.

కోరినన్ని సీట్లు ఇవ్వకపోతే

ఎన్‌డీఏకి గుడ్‌బై

బీహార్ ఎన్నికలపై చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా అధికార బీజేపీ-జేడీయూ కూటమికి కేంద్రంలో ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షమైన ఎల్‌జేపీ(రాం విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ మళ్లీ షాక్ ఇచ్చారు. ఓటర్లను ప్రభావితం చేసే శక్తి తనకు ఉందని మంగళవారం ఓ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో ఆయన కూటమికి గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గంలో 20,000 నుంచి 25,000 ఓట్లను తాను ప్రభావితం చేయగలనని చిరాగ్ చెప్పారు. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలలో తన పార్టీకి గణనీయమైన వాటా కావాలని చిరాగ్ పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలలో పోటీచేసి ఐదింటినీ ఆయన పార్టీ కైవసం చేసుకుంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 40 స్థానాలు కేటాయించాలని చిరాగ్ డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తనకు ఇబ్బందిగా ఉన్నా తన డిమాండ్లను నెరవేర్చకున్నా కూటమి నుంచి తప్పుకోవడానికి తాను వెనుకాడబోనని ఆయన హెచ్చరించారు.



మేఘ విస్ఫోటం కారణంగా డెహ్రాడూన్‌లో దెబ్బ తిన్న అతిథి గృహాలు

ఉత్తరాఖండ్‌లో మేఘ విస్ఫోటం

15 మంది మృతి .. 16 మంది గల్లంతు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ శీతాకాల రాజధాని డెహ్రాడూన్, పరిసర జిల్లాల్లో సోమవారం మేఘ విస్ఫోటం కారణంగా ఆకస్మిక వరదలు ముంచెత్తి 15 మంది మరణించగా మరో 16 మంది గల్లంతయ్యారు. భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున విధ్వంసం సంభవించింది. సహస్త్రధారలో మంగళవారం వచ్చిన ఆకస్మిక వరదలకు హోటళ్లు, దుకాణాలు, ఇళ్లు కొట్టుకుపోయాయి. జిల్లావ్యాప్తంగా వాణిజ్య సంస్థలు, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం జరిగింది. వరద ప్రవాహంలో పలువురు కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. డెహ్రాడూన్‌లోని మాల్‌దేవత, ముస్సోరీ నుంచి కూడా ఆస్తి నష్టానికి సంబంధించిన సమాచారం అందుతున్నట్లు విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని వివిధ ప్రాంతాలలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి రోడ్లు, ఇళ్లు, దుకాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఓ వంతెన కొట్టుకుపోయిందని ఆయన చెప్పారు. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు ఆయన తెలిపారు. బాధిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 300 నుంచి 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. టంకేశ్వర్‌లోని భగత్ సింగ్ కాలనీలో వరదల్లో నలుగురు వ్యక్తులు కొట్టుకుపోగా ముస్సోరీలో ఝురీపానీ టోల్ ప్లాజాపై కొండ చరియ విరిగిపడి కార్మికుడు మరణించాడు

రెండుసార్లు కరిస్తే.. కుక్కకు జీవితఖైదు

యూపీ ప్రభుత్వం నిర్ణయం



లక్నో, సెప్టెంబర్ 16: శునకాలు కరిస్తే శిక్ష విధిస్తూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విచిత్ర నిర్ణయం తీసుకుంది. ఎలాంటి రెచ్చగొట్టుడు లేకుండా వీధి కుక్కలు మనుషుల్ని ఒకసారి కరిస్తే దానికి 10 రోజుల పాటు జంతు కేంద్రానికి తరలించే శిక్ష విధిస్తారు. అదే రెండు సార్లు కనుక కరిస్తే ఇక దాని జీవిత కాలమంతా జంతు కేంద్రంలోనే గడపాలి. ఇది ఒక విధంగా మనుషులకు విధించే జీవిత ఖైదు లాంటిది. అయితే దానిని దత్తత తీసుకోవడానికి అంగీకరించి, ఇక ముందు దానిని వీధిలోకి విడిచిపెట్టమంటూ ఎవరైనా అఫిడవిట్ ఇస్తే శిక్ష విధించకుండా వారికి అప్పగిస్తారు. వీధి కుక్కల ఆగడాల నివారణకు యూపీ ప్రిన్సిపల్ సెక్రటరీ అమృత్ అభిజత్ అన్ని పట్టణ, గ్రామీణ పౌర సంస్థలకు ఈ మేరకు ఈ నెల 10న ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా వ్యక్తి కుక్క కాటుకు గురై యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తే ఆ ఘటనను నమోదు చేసుకున్న అధికారులు ఆ వ్యక్తిని కరిచిన కుక్కను గుర్తించి మొదటి తప్పుగా 10 రోజుల శిక్ష విధిస్తారు. ఆ 10 రోజులు దాని ప్రవర్తనను గమనిస్తారు. తర్వాత దానికి మైక్రోచిప్ అమర్చి దాని కదలికలను నమోదు చేస్తారని ప్రయాగ్ రాజ్ వెటర్నరీ అధికారి బిజయ్ అమృత్ రాజ్ తెలిపారు. అదే కుక్క మరోసారి మనిషిని కరిస్తే ఇక దానికి జీవిత శిక్ష తప్పదని చెప్పారు. ఒక వేళ ఆ కుక్కను దత్తత తీసుకున్న వ్యక్తి దానిని వీధిలోకి విడిచిపెడితే ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు.



ధూమపానంతో టైప్-2 డయాబెటిస్!

న్యూఢిల్లీ: ధూమపానం టైప్-2 డయాబెటిస్‌కు కారణం కావొచ్చని కొత్త అధ్యయనం తెలిపింది. ఈ అధ్యయనం ప్రకారం పొగ తాగడం టైప్-2 డయాబెటిస్‌లోని నాలుగు ఉప రకాల అభివృద్ధిని పెంపొందిస్తుంది. ఇన్సులిన్ నిరోధకత, ఇన్సులిన్ లోటు, ఊబకాయం, వయసు తదితరాలు మధుమేహానికి కారణాలైనప్పటికీ పొగ తాగడం ఆ వ్యాధి వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధకులు గుర్తించారు. 3,325 మంది డయాబెటిస్ రోగులు, 3,897 మంది డయాబెటిస్ లేని ప్రజల డాటాను పరిశీలించి ఈ అధ్యయనాన్ని ప్రచురించారు. దీని ప్రకారం టైప్-2 డయాబెటిస్ ఉప రకాలు పొగ తాగని వారితో పోలిస్తే పొగ తాగే వారిలో 2.15 రెట్లు ఎక్కువ వచ్చే ముప్పు ఉన్నది.



భక్తుల డబ్బు .. కల్యాణ మండపాల

నిర్మాణానికి కాదు


తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఆలయాలకు భక్తులు ఇచ్చే విరాళాలు కల్యాణ మండపాలు నిర్మించడానికి కాదని పేర్కొన్న సుప్రీం కోర్టు.. దేవాలయ నిధులు ప్రజల నిధులుగానో, ప్రభుత్వ నిధులగానో పరిగణించకూడదంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులను రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలలో కల్యాణ మండపాల నిర్మాణానికి మళ్లిస్తూ ప్రభుత్వం నిర్ణయించడాన్ని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ కొట్టివేసింది. వివాహాల కోసం కల్యాణ మండపాలను అద్దె ప్రాతిపదికన ఇవ్వడం ధార్మిక ప్రయోజనాన్ని నెరవేర్చదంటూ ఆగస్టు 19న పేర్కొన్న హైకోర్టు ప్రభుత్వ ఆదేశాలను నిలిపివేసింది. దీనిని ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది.

20 ఏండ్లు పూర్తయితే వీఆర్ఎస్

వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో 60% పొందే అవకాశం

కేంద్ర ఉద్యోగులకు నిబంధనల సవరణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 20 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన అనంతరం స్వచ్ఛంద పదవీ విరమణను ఎంచుకుంటే 'ప్రో రేటా ప్రాతిపదికన' చెల్లింపులు పొందేందుకు అర్హులని కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. ఈ మేరకు పెన్షన్, పెన్షనర్ల విభాగం యూనిఫైడ్ పెన్షన్ పథకం (యూపీఎస్) కింద కొత్త నిబంధనలను చేరుస్తూ ఈ నెల 2న అధికారిక గెజిట్‌లో నోటిఫై చేసినట్టు తెలిపింది. మారిన నిబంధనల ప్రకారం ఉద్యోగులు 20 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన అనంతరం వీఆర్ఎస్ పొందవచ్చు. అయితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ పూర్తిగా 25 ఏండ్ల సర్వీసు పూర్తయిన తరువాతనే పొందే అవకాశం ఉంటుంది. వీఆర్ఎస్ తీసుకున్న వెంటనే 'ప్రో రేటా ప్రాతిపదికన' మాత్రమే నగదు సదుపాయాలను పొందవచ్చని సిబ్బంది మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. అంటే ఉద్యోగి సాధారణ రిటైర్మెంట్ అనంతరం పొందే పూర్తి సదుపాయాలలో కొంత మేరకే పొందే అవకాశం ఉంటుందని వివరించింది. అంతే కాకుండా కొత్త నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలలో వ్యక్తిగత కార్పస్‌లో 60 శాతం వరకు పొందవచ్చని తెలిపింది. వీఆర్ఎస్ తీసుకున్న వారు రిటైర్మెంట్ గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సీజీఈజీఐఎస్ సదుపాయాలకు అర్హులవుతారని పేర్కొంది. ఈ అదనపు సదుపాయాలన్నీ వీఆర్ఎస్ తీసుకున్నా లేక సర్వీసు పూర్తి రిటైర్ అయినా లభిస్తాయని తెలిపింది. ఒకవేళ వీఆర్ఎస్ పొందాలని నిర్ణయించి సదుపాయాలను పొందకముందే మరణిస్తే వారి జీవితభాగస్వామికి ఈ సదుపాయాలు అందుతాయని పేర్కొంది.



నోటిఫికేషన్ వచ్చేవరకూ ఆమరణ దీక్ష

నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 16 : అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, నోటిఫికేషన్ వచ్చేవరకూ తన ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు పాలకూరి అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా.. ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరిస్తూ కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు.

22 నుంచి ఎంపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎప్‌సెట్‌లో భాగంగా ఎంపీసీ విద్యార్థులకు బీఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 22 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన వెల్లడించారు. ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈనెల 22, 23 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 23న ఆప్షన్లు ఫ్రీజ్ చేసుకోవచ్చు. 25న సీట్లు కేటాయిస్తారు.

వెయ్యి ఫైన్‌తో ఇంటర్ అడ్మిషన్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఫస్టియర్‌లో చేరేందుకు ఇంటర్‌బోర్డు మరో అవకాశం కల్పించింది. రూ.వెయ్యి ఫైన్‌తో బుధవారం(ఈనెల 17న) వరకు అడ్మిషన్లు పొందే అవకాశమిచ్చింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేవారు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

'గ్రేడ్-2 హెచ్‌ఎంలకు పదోన్నతులు కల్పించాలి'

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని గ్రేడ్-2 హెచ్‌ఎంలకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్(టీఎస్‌జీహెచ్‌ఎంఏ)కోరింది. హైకోర్టు తీర్పును అనుసరించి పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్ మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఇంటర్ కాలేజీల్లో క్రీడలు, యోగా, మెడిటేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ కాలేజీల్లో క్రీడలు, యోగా, మెడిటేషన్ తప్పనిసరి అని ఇంటర్ విద్యా డైరెక్టర్ కృష్ణఆదిత్య వెల్లడించారు. మంగళవారం ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఒత్తిడికి లేని విద్యనందించడంలో భాగంగా క్రీడలు, యోగా, మెడిటేషన్‌ను టైమ్ టేబుల్‌లో చేర్చాలని ఆదేశించారు.

మైనార్టీ గురుకులాల టైం టేబుల్ మార్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల టైంటేబుల్‌ను మార్చారు. ఇది వరకు మైనార్టీ గురుకులాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యేవి. కామన్ టైంటేబుల్‌లో భాగంగా ఉదయం 8గంటలకు మార్చారు. దీన్ని టీచర్ సంఘాలు వ్యతిరేకించాయి.

జెండా ఎగురవేయడంపై వింత ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసే విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు తలోరకమైన ఉత్తర్వులివ్వడం గందరగోళానికి దారితీసింది. బుధవారం అన్ని విద్యాసంస్థల్లో జాతీయ జెండా ఎగురవేయాలని కరీంనగర్ జిల్లా డీఈవో ఆదేశాలిచ్చారు. ఇక నిజామాబాద్ విద్యాశాఖ అధికారులు మాత్రం అన్ని విద్యాసంస్థల్లో ఎగురవేయాల్సిన అవసరం లేదని, మండల వనరుల కేంద్రాల్లో మాత్రమే జాతీయ జెండా ఎగురవేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో పలువురు విస్మయం వ్యక్తంచేశారు.



బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

విద్యార్థి నేతలపై పోలీస్ జులుం

గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా రౌండ్‌టేబుల్ మీటింగ్ ● ఎవరూ రావొద్దని పోలీసుల హెచ్చరిక

- వచ్చిన వారిని ఎక్కడికక్కడే అరెస్టు
- బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు, రాకేశ్‌రెడ్డిలు అదుపులోకి..
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై విద్యార్థుల తీవ్ర మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ)/హైదరాబాద్ సిటీబ్యూరో: గ్రూప్-1 అభ్యర్థులకు బాసటగా నిలిచిన విద్యార్థి నేతలు, నిరుద్యోగ విద్యార్థులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధం విధించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎవరినీ రానీయకుండా ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం కొనసాగించారు. మొత్తంగా ఎమర్జెన్సీ పాలనను తలపించారు. గ్రూప్-1 విద్యార్థుల భవిష్యత్తు, హైకోర్టు తీర్పు, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని అన్ని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సమావేశానికి గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థులంతా హాజరు కావాలని కోరారు. ఈ నేపథ్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్దకు విద్యార్థులు తరలివచ్చారు. అక్కడ భారీగా మోహరించిన పోలీసు బలగాలు బయట నుంచే సమావేశం లేదని, వెనక్కి వెళ్లాలని హుకుం జారీచేశారు. సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకున్నామని చెప్పినా పోలీసులు ససేమిరా అన్నారు. ఇక్కడి నుంచి వెళ్తారా? అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు పంపించాలా? అంటూ పోలీసులు బెదిరింపులకు దిగారు. కొంతమంది విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో పడేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్వీ నేతలపై పోలీసులు భౌతికదాడులకు దిగారు. బీఆర్‌ఎస్వీ నాయకుడు స్వామియాదవ్‌పై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. చిక్కడపల్లి సీఐ రాజునాయక్ తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉన్నదని నాయకులు మండిపడ్డారు.



బీఆర్‌ఎస్వీ నాయకులను బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

పోలీస్ చర్య అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1పై చర్చించేందుకు అనుమతితో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ మీటింగ్‌ను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. రౌడీ రాజ్యంలా విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ఈ ప్రభుత్వ ఆగడాలను ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు కురువ విజయ్‌కుమార్, బొమ్మెర రామమూర్తి, కట్ల స్వామియాదవ్, రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1పై హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌తో రివ్యూలు చేస్తూ డిఫాక్టో చైర్మన్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తీరుమార్చుకోవాలన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్: గెల్లు శ్రీనివాస్

విద్యార్థుల హక్కులను కాంగ్రెస్ సర్కార్ కాలరాస్తున్నదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 విద్యార్థులకు మద్దతుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి వచ్చిన గెల్లు శ్రీనివాస్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తననెందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో సమస్యలపై సమావేశాలు నిర్వహించుకునే హక్కు లేదా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రూప్-1 అభ్యర్థులతో సమావేశం నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. శ్రీనివాస్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్వీ నేతలను పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇది ప్రజాపాలన కాదు.. పోలీస్ పాలన : ఏనుగుల రాకేశ్‌రెడ్డి


రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలన కాదని, పోలీస్ పాలని అని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. విద్యార్థి సంఘాల ఆహ్వానం మేరకు రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు రాకేశ్‌రెడ్డి రావడంతో ఆయననూ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమావేశంలో పాల్గొనడానికి వస్తే అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకని తిరుగుతూ రాజ్యమేలుతాననంటుంటే, తెలంగాణలో రేవంత్‌రెడ్డి మాత్రం అదే రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను విడుదల చేయాలి : వాసుదేవరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లగా పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థులను, విద్యార్థి నేతలను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులకు రౌండ్‌టేబుల్ పెట్టుకుని గ్రూప్-1 అక్రమాలపై మాట్లాడుకునే స్వేచ్ఛ కూడా లేదా? అని ఆయన ప్రశ్నించారు. ధర్నా చేశారా? రాస్తారోకో చేశారా? అని నిలదీశారు. ఇచ్చిన హామీలను మరిచి, వారి జీవితాలతో ఆడుకునే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన: తుంగ బాలు..

రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు ఆరోపించారు. గ్రూప్-1పై హైకోర్టు తీర్పుపై చర్చించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తుంటే, కావాలనే నాయకులను, విద్యార్థులను అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఒకవేళ గ్రూప్-1లో అక్రమాలు జరగకుంటే ప్రశాంతంగా కొనసాగుతున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఎందుకు భగ్నం చేసినట్టు, ఎందుకు విద్యార్థులను అరెస్టు చేసినట్టు అని ప్రశ్నించారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటుదాం

- కాంగ్రెస్ పాలనలో కళ తప్పిన పల్లెలు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబర్ 16 : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ మండలం మరిగడి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తన క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పల్లా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాలన్నీ అంధకారంలో మగ్గుతున్నాయని ఆరోపించారు. ఎక్కడా రూపాయి అభివృద్ధి జరగక గ్రామాలన్నీ కళతప్పినట్టు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేసి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు రానున్న రోజుల్లో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బూరగోని యాదగిరిగౌడ్, మాజీ సర్పంచ్ ఇట్టబోయిన రజిత శ్రీనివాస్, నాయకులు కూరాకుల రమేశ్, అబ్బ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నారాయణగురు శతజయంతి ఉత్సవాల్లో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

రిజర్వేషన్లతో అసమానతలు మాయం

- నారాయణగురు స్ఫూర్తితోనే రిజర్వేషన్లు
- పేద వర్గాల బాగుకోసం తపించారు
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'మహాత్మా పూలే, నారాయణగురు, పెరియార్ వంటి మహనీయుల కృషి వల్లే నేడు సామాన్యులకు గుర్తింపు వచ్చింది. వారి స్ఫూర్తితోనే నేడు రిజర్వేషన్ల ప్రక్రియ అమలవుతుంది. అసమానతలు తొలగి పోవాలన్నా, ఆర్థికంగా బలపడాలన్నా, సమానత్వం రావాలన్నా.. అది ఒక్క రిజర్వేషన్ల వల్లే సాధ్యం అవుతుంది' అని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాసగౌడ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో నిర్వహించిన నారాయణగురు శతజయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలు, పేదల బాగు కోసం నారాయణ గురు పరితపించారని కొనియాడారు. సమాజంలో తలెత్తిన అనేక అసమానతలను తొలిగించి, మనుషులంతా ఒక్కటేనని ఆయన చాటారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేండ్ల తర్వాత దేశంలో కులగణనకు మోక్షం లభించిందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో ఎన్యుమరేషన్ ప్రక్రియ జరుగుతుందని, శాస్త్రీయ పద్ధతిన కులగణన చేసి, రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

42శాతం రిజర్వేషన్లకు కట్టుబడాలి

తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో కూడా కులగణన చేశారని, రిజర్వేషన్ అసంబద్ధంగా, చట్టసవరణ జరగకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటక కులగణనలో, తెలంగాణలో చేసిన తప్పులు చేయకుండా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీకే హరిప్రసాద్, ఎమ్మెల్సీ జగదేవ్ గుత్తేదార్, అశోక్ గుత్తేదార్, ప్రణవానంద స్వామిజీ, నితిన్ గుత్తేదార్, బాలరాజు గుత్తేదార్, వినయ్ గుత్తేదార్, సదానంద పార్ల పాల్గొన్నారు.



సీఎస్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు

మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయండి

తెలంగాణ బిడ్డలను స్థానికులుగా గుర్తించండి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్
- సీఎస్ రామకృష్ణారావుకు వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'స్థానికత' జీవో కారణంగా మెడికల్ అడ్మిషన్లకు దూరం అవుతున్న తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి సీఎస్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా సెంటర్ వద్ద బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, నాయకులు కురువ విజయ్‌కుమార్, కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణేతర ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని ఏ విధంగా స్థానికులుగా పరిగణించి వారి పిల్లలకు ఇక్కడ చదువుకునే అవకాశం కల్పిస్తున్నారో, అదే మాదిరిగా మెడికల్ అడ్మిషన్లకు అర్హత సాధించిన విద్యార్థులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు రాష్ట్రంలోనే ఈ విద్యార్థులు చదువుకున్నారని, ఇంటర్మీడియట్‌లో వేర్వేరు కారణాలతో పక్క రాష్ట్రంలో చదువుకున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లా ఏపీకి సమీపంలో ఉండటంతో కొందరు తమ పిల్లలను విజయవాడలో చదవించారని వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొంతమంది కర్నూలులో తమ పిల్లలను చదవించారని చెప్పారు. ఈ చిన్న తప్పిదం కారణంగా విద్యార్థులను తెలంగాణ వారు కాదనడం సబబు కాదని హితవు పలికారు. ఇదే విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. సీఎస్ సానుకూలంగా స్పందించినట్టు దాసోజు శ్రవణ్ తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 40 మంది విద్యార్థులకు చేయని తప్పుకు శిక్ష పడకుండా వారందరిని స్థానికులుగా గుర్తించాలని దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు.

జీవో రాకముందే ఇంటర్ పూర్తి

ప్రస్తుతం ర్యాంకులు సాధించిన విద్యార్థులంతా స్థానికత జీవో రాకముందే ఇంటర్ విద్యను పూర్తిచేశారు. హైదరాబాద్ మాకు 300 కి.మీ. దూరం ఉంటుంది. అందుకే ఆడపిల్ల దగ్గరే ఉండి చదువుకుంటుంది కదా అని విజయవాడలో చదివించాం. తెలంగాణలో 15 శాతం ఆలిండియా కోటా కింద వేర్వేరు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. 8 వేల మెడికల్ సీట్లున్న తెలంగాణలో స్థానికత వల్ల నష్టపోయే విద్యార్థులు 0.5 శాతమే. కనుక ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలి.

–షేక్ మహమ్మద్ జకీర్, (ర్యాంకు సాధించిన విద్యార్థిని తండ్రి) సత్తుపల్లి, ఖమ్మం జిల్లా

తెలంగాణ కోటా కింద ఏపీలో చదివితే స్థానికత వర్తించదా?

ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పుట్టి, తెలంగాణలోనే చదువు ప్రారంభించి తెలంగాణ కోటా కింద ఏపీలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదువు పూర్తిచేసిన విద్యార్థికి స్థానికత వర్తిస్తుందో లేదో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణ విద్యార్థి శశికిరణ్‌కు మెడికల్ సీటు కేటాయింపులో స్థానికత వర్తిస్తుందో లేదో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాళోజీ నారాయణరావు వైద్య వర్సిటీకి మంగళవారం నోటీసులు జారీ చేసింది. బుధవారం జరిగే విచారణలో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన తనకు స్థానిక కోటా కింద మెడికల్ సీటును నిరాకరించడాన్ని సవాలు చేస్తూ శశికిరణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ ఎం మొహియుద్దీన్ ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది.

బీజేపీకి ఓట్లు వేయించిన రేవంత్

- సుదర్శన్‌రెడ్డికి సీఎం వెన్నుపోటు
- ఎంపీల ఓట్లను అమ్ముకున్నారు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఓట్‌చోరీకి పాల్పడ్డారని, బీజేపీకి ఓట్లు వేయించారని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో సంబంధాలు పెట్టుకున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీల ఓట్లను బీజేపీకి అమ్ముకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 8మంది కాంగ్రెస్ ఎంపీల ఓట్లు బీజేపీ అభ్యర్థికి పడేలా చక్రం తిప్పిన తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీలైన కొందరు మిత్రులే తనతో చెప్పారని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 315 ఓట్లు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రకటిస్తే, ఎన్నికల కమిషన్ మాత్రం 300 ఓట్లు మాత్రమే వచ్చాయని ప్రకటించిందని గుర్తుచేశారు. మరి ఆ 15మంది ఓట్లు ఎవరికి పడ్డాయని అనుమానం వ్యక్తంచేశారు. కూటమి తరపున ఎన్నికల బరిలోకి దిగిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ అనంతరం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, స్పీకర్‌ను కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు కలిశారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ చెప్పడంతోనే ఓట్లు వేయించారని పేర్కొన్నారు.

గ్రూప్-1 అక్రమాలపై సీబీఐ విచారణ కోరడం లేదెందుకు?

రేవంత్‌రెడ్డి గ్రూప్-1 అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ వారిని చూస్తుంటే జాలేస్తుందని, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రా? లేదంటే బీజేపీ ముఖ్యమంత్రా? అన్న విషయం వాళ్లకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. బీసీల జపం చేసే సీఎం, ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావును ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు.

మాజీ ఎంపీ మధుయాష్కీకి తీవ్ర అస్వస్థత

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి శ్రీధర్‌బాబు పేషీలో ఉన్న ఆయనకు ఛాతినొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో సచివాలయంలో ఉన్న డిస్పెన్సరీ సిబ్బంది తక్షణ వైద్య సహాయం అందించి, గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానకు తరలించారు.

మైక్రో బ్రూవరీల నోటిఫికేషన్ రద్దు చేయాలి

కమిషనర్‌కు ఏఐవైఎఫ్ వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మైక్రో బ్రూవరీల (సూక్ష్మ బీర్ల తయారీయూనిట్) ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఆబ్కారీ కార్యాలయంలో రాష్ట్ర ప్రొహిబిషన్-ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషికి వినతిపత్రం అందజేశారు.

ఆయుధాలు వదిలేస్తం

మొదటిపేజీ తరువాయి...

పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని అందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు, పోరాడుతున్న సంస్థలతో వీలైనంత వరకు కలిసి పోరాడుతామని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మారిన తమ పార్టీ అభిప్రాయం గురించి పార్టీకి తెలియజేయడం తమ బాధ్యత అని, పార్టీలో ఈ అంశాన్ని అంగీకరించేవారు లేదా వ్యతిరేకించేవారు చర్చల్లో అంగీకరించి పాల్గొనే సహచరుల నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రస్తుతం తమతో అందుబాటులో ఉన్న పరిమిత క్యాడర్, కొంతమంది నాయకత్వ సహచరులు ఈ కొత్త విధానాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సహచరులతో, జైల్లో ఉన్న సభ్యులతో సంప్రదించేందుకు నెలరోజుల గడువు ఇస్తూ 'సీజ్ ఫైర్' చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునేందుకు కూడా తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అయితే, మావోయిస్టు పార్టీలో మారిన ఈ విధానం సంచలం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్ బసవరాజు మృతి తరువాత ఇటీవల కొత్త నాయకత్వంలో భాగంగా ఆయన స్థానంలో తిప్పిరి తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకున్న నేపథ్యంలో ఈ లేఖ విడుదల అవ్వడం మరింత సంచలనం కలిగిస్తున్నది. అంతేకాకుండా, ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు నేత (అజ్ఞాత నేత) ఫొటోతో ఆ పార్టీ లేఖను విడుదల చేయడం దేశంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చానీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో వచ్చిన ఈ లేఖ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి, మావోయిస్టు ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంశాఖ మంత్రులు శాంతిచర్చల పట్ల అనుకూలమైన వైఖరిని అవలంబించిన పాలక, అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజల ముందు మావోయిస్టు పార్టీ తన మారిన వైఖరిని స్పష్టంచేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి విజ్ఞప్తి చేస్తున్నట్టు మావోయిస్టు పార్టీ తెలిపింది. ఇదే ప్రతిపాదనపై మే 10న మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు తాజా లేఖలోనూ మావోయిస్టులు తెలిపారు. అందులో తమ పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్టు ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వానికి కాల్పుల విరమణ సైతం ప్రతిపాదించినట్టు వివరించారు. ఈ ముఖ్యమైన అంశంపై తమ పార్టీ నాయకత్వ, సహచరులతో సంప్రదించడానికి ఒక నెల రోజుల సమయం కావాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోగా.. గత ఏడాది జనవరి నుంచి వేలాది సంఖ్యలో జరుపుతున్న సైనిక దాడిని తీవ్రతరం చేసింది. వేలాదిమంది సాయుధ పోలీస్ బలగాలను మోహరించి చుట్టుముట్టి నిర్మూలన దాడి జరిపింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మే 21న మాడ్ ఏరియాలోని గుండెకోట్ సమీపంలో జరిగిన భీకరదాడిలో ధైర్యంగా ప్రతిఘటించిన తమ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు 28 మంది కేంద్ర కమిటీ సభ్యులు, సహచరులు, వారి భద్రతా సిబ్బంది అమరులైనట్టు పేర్కొన్నారు. గతంలో జరిగిన శాంతిచర్చల ప్రక్రియను సగంలో వదిలివేయకుండా అభయ్ ఆలోచనలకు అనుగుణంగా శాంతి చర్చలను ముందుకు తీసుకువెళ్లాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు, ఇందుకోసమే ఈ పత్రికా ప్రకటన విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. తమ పార్టీ ప్రధాన కార్యదర్శి చొరవతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్టు పేర్కొన్నారు.

పేలుళ్లలకు ఎన్వోసీ ఎలా జారీ చేస్తారు?

పోలీసు కమిషనర్ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అధికారం ఉన్నంత మాత్రాన కొండలను, రాళ్లను పేల్చడానికి పేలుళ్లకు సిటీ పోలీస్ కమిషనర్ ఎలా అనుమతి ఇస్తారని హైకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ఏ విధంగా ఎన్వోసీ జారీ చేస్తారో చెప్పాలని గత విచారణలో కోరితే ఎందుకు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తంచేసింది. 24 గంటల్లో వివరాలు అందజేయాలని ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం కల్పించుకుంటూ.. ప్రతివాదులుగా గనుల శాఖ ఉన్నదని, పోలీస్ కమిషనర్ లేరని చెప్పింది. దీంతో సిటీ పోలీస్ కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చాలని ధర్మాసనం ఆదేశించింది. ఎన్వోసీ ఇచ్చే అధికారం సిటీ పోలీస్ కమిషనర్‌కు ఉన్నదని చెప్పడంకాదని, ఏ ప్రాతిపదికన అనుమతి ఇస్తున్నారో చెప్పాలని ఆదేశించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ న్యాయవిహార్ ప్రాంతంలో రాత్రివేళల్లో పేలుళ్లు నిర్వహించడంపై 2024లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా పరిగణించింది. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే మిల్లర్లకు ధాన్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వానకాలం ధాన్యం కొనుగోళ్లపై సివిల్‌సప్లయ్ సమీక్షా సమావేశం నిర్వహించింది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. అక్టోబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించింది.

ధరలను తగ్గించిన మదర్ డెయిరీ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): పాలు, ఇతర ఆహార ఉత్పత్తుల కొత్త ధరలను మదర్ డెయిరీ ప్రకటించింది. జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నది. ఈ కొత్త ధరలు ఈనెల 22నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేసే పనీర్, వెన్న, చీజ్, నెయ్యి, మిల్క్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్స్ ధరలు తగ్గాయని వివరించింది. సాధారణ పాల ప్యాకెట్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నది.

ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు

ఎస్కే జోషి కేసులో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి శైలేంద్రకుమార్ జోషిపై ఎటువంటి చర్యలూ తీసుకోరాదని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, పర్యవేక్షణలో లోపాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ సమర్పించిన తుది నివేదికలోని సిఫారసుల ఆధారంగా తనపై చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎస్ కే జోషి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై చీఫ్‌జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారరణ జరిపింది. గత విచారణ సమయంలో కమిషన్ నివేదిక ఎలా వచ్చిందో చెప్పాలని కోరడంపై పిటిషనర్ తరపు



సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి స్పందిస్తూ అది ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నదని చెప్పారు. ఇప్పటికీ ట్విట్టర్‌లో ఉన్నదని తెలిపారు. ఒక పత్రికలో నివేదికలోని అంశాలన్నింటినీ అవే పదాలతో ప్రచురించారని చెప్పారు. ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి, మాజీ ఇంజినీర్‌కు కూడా కమిషన్ నివేదిక ప్రతిని పంపారని తెలిపారు. పిటిషనర్‌ను కమిషన్ సాక్షిగానే పిలిచిందని, ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, ఇతరులు ఏమైనా అభియోగాలు చేస్తే వాటిపై వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా అభియోగాలు చేసిందని చెప్పారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, జస్టిస్ ఘోష్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సీబీఐని కోరిందని తెలిపారు. సీబీఐ కూడా కమిషన్ నివేదికతో సంబంధం లేకుండా సొంతంగా దర్యాప్తు చేస్తుందని చెప్పారు. వాదనలపై స్పందించిన హైకోర్టు, జస్టిస్ ఘోష్ రిపోర్టు ఆధారంగా పిటిషనర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. సీబీఐ దర్యాప్తు చేయవచ్చునని స్పష్టంచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్లతోపాటు వచ్చే నెల 7న జరుపుతామని ప్రకటించింది.

ఏపీ మండలి చైర్మన్‌కు జరిమానా!

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఏపీ శాసనమండలి చైర్మన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామాను ఆమోదించేలా ఉత్తర్వులు జారీచేయాలనే కేసులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడంతో కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.10వేలు చెల్లించాలని మండలి చైర్మన్‌కు సూచించింది. కౌంటర్ పిటిషన్ దాఖలుచేయని శాసనమండలి చైర్మన్ తీరును తప్పుపట్టింది. గతంలో ఆదేశించినప్పటికీ కౌంటర్ వేయకపోగా మళ్లీ గడువు కావాలని కోరడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

మత్తయ్య పిటిషన్ విచారణ వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో జెరూసలేం మత్తయ్య (ఏ4)దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ కేసులో మత్తయ్యను విచారించాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. మత్తయ్యపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం ప్రకటించింది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

విద్యుత్తు ఏడీఈ అక్రమార్జన 200 కోట్లు!

- అంబేద్కర్ ఇండ్లలో ఏసీబీ సోదాలు
- ఓ బినామీ ఇంట్లో రూ.2.18 కోట్ల నగదు లభ్యం.. భారీ మొత్తంలో ఆభరణాలు, ఆస్తి పత్రాలు స్వాధీనం


ఏసీబీ దాడుల్లో పట్టుబడిన అంబేద్కర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో విధులు నిర్వర్తిస్తూ అక్రమ సంపాదనలో వందల కోట్లకు పడగలెత్తిన ఇబ్రహీంబాగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీఈ) ఇరుగు అంబేద్కర్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. అతని ఇండ్లు, కుటుంబసభ్యులు, స్నేహితులు, బినామీలకు చెందిన 11 ప్రాంతాల్లో ఏకకాలంలో మంగళవారం ఉదయం సోదాలు చేపట్టి.. భారీగా నగదు, నగలు, స్థిర, చరాస్తుల పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకున్నది. ఈ సోదాల్లో శేరిలింగంపల్లిలో ఒక ప్లాట్, గచ్చిబౌలిలోని జీ+5 బిల్డింగ్, సూర్యాపేట జిల్లాలోని అమ్మార్ కెమికల్స్‌కు చెందిన 10 ఎకరాల భూమి, హైదరాబాద్‌లోని 6 రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూమి, రెండు కార్లు, భారీగా బంగారు, వెండి ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను అధికారులు చేసుకున్నారు. అంబేద్కర్‌కు చెందిన ఓ బినామీ ఇంట్లో ఏసీబీ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రూ.2.18 కోట్ల లిక్విడ్ క్యాష్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రూ.200 కోట్లపైమాటే..

మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, నిజామాబాద్ సహా.. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలో స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకుపైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. దీంతోపాటు బ్యాంకు బ్యాలెన్స్ రూ.78 లక్షలు, షేర్లలో మరో రూ.36 లక్షల పెట్టుబడులు ఉన్నట్టు గుర్తించింది. కారులో మరో రూ.5.5 లక్షల నగదు దొరికిందని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. సోదాలు చేపట్టిన చోట్ల భారీగా అక్రమాస్తుల ఆస్తుల పత్రాలను సైతం స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈ కేసులో విద్యుత్తు శాఖ ఏడీఈ అంబేద్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

కాంగ్రెస్ నేత పైరవీతో మళ్లీ పోస్టింగ్

విద్యుత్తు సంబంధిత సమస్యలతో వచ్చే ఎంతోమందిని ఏడీఈ అంబేద్కర్ లంచాల కోసం తీవ్రంగా వేధించినట్టు చాలామంది బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ రహస్య విచారణలో ఇప్పటికే రూ. వందల కోట్ల ఆస్తులు కూడబెట్టినట్టు తెలుసుకొని.. మంగళవారం అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. గతం నుంచి అంబేద్కర్‌పై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రాగా, విద్యుత్తు శాఖ గత సంవత్సరం సస్పెండ్ చేసింది. దీంతో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఓ కీలక నేతను అప్రోచ్ అయ్యాడు. ఆయన సహకారంతో సస్పెన్షన్‌ను ఎత్తివేయించుకొని.. తనకు బాగా కలిసొచ్చిన ఇబ్రహీంబాగ్‌లో మళ్లీ అదేచోట పోస్టింగ్‌లో కొనసాగాడు. అయితే, అతని అక్రమాలకు ఆ కాంగ్రెస్ నేత అండదండలు దండిగా ఉండటంతో.. తన దగ్గరకు వచ్చే వారిని డబ్బుల కోసం జలగలా పట్టి పీడించేవాడని తెలిసింది.

దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విజయనగరంలో వెలుగుచూసిన ఐఎస్ఐఎస్ ఉగ్రవాద కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో మంగళవారం సోదాలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, జార్ఖండ్, యూపీ, ఢిల్లీ, బీహార్, మహారాష్ట్రలో 16 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలు, డిజిటల్ సామగ్రి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో మరిన్ని అరెస్టులు తప్పవని ఎన్ఐఏ అధికారులు చెప్పారు.

కొత్తగూడెంలో ఎన్ఐఏ సోదాలు

కొత్తగూడెం: ఎన్ఐఏ అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ సమీపంలో గల ఓ ఇంట్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఓ యువకుడికి సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

ఈ పాపం ఎవరిది?

- గతంలో బిగ్‌బ్రదర్‌కు ఏడీఈ షాక్
- బదిలీ చేయించిన బిగ్ బ్రదర్
- గట్టిమంత్రి సిఫారసుతో మళ్లీ రంగంలోకి ఏడీఈ అంబేద్కర్
- 'ముఖ్యనేత' పనికీ డబ్బు డిమాండ్
- చిర్రెత్తుకురావడంతోనే ఏసీబీ దాడి!



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/సిటీబ్యూరో, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లిలో ఏడాదిన్నర క్రితం వివాదాస్పద లేఅవుట్‌లో కరెంటు మీటర్లు ఇచ్చే దందా కొనసాగింది. 'బిగ్ బ్రదర్' ఒకరు బినామీ పేర్లపై అందులోని ప్లాట్లను కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఆ ప్లాట్లకు కరెంటు మీటర్ కనెక్షన్ తీసుకునేందుకు బినామీ వ్యక్తులు అధికారులను కలిశారు. వివాదాస్పద ప్లాట్లు అయినందున భారీ మొత్తం ఇస్తే తప్ప మీటర్ కనెక్షన్ ఇచ్చేది లేదని ఏడీఈ అంబేద్కర్ తెగేసి చెప్పినట్టు సమాచారం. దీంతో సదరు వ్యక్తులు 'బిగ్ బ్రదర్' పేరు చెప్పారు. అయినా ఆయన ఖాతరు చేయకపోవడంతో రేటు మాట్లాడుకొని పని కానిచ్చినట్టు సమాచారం. విషయం బిగ్ బ్రదర్ దాకా వెళ్లడంతో 'నా పేరు చెప్పినా డబ్బులు డిమాండు చేశారా?' అంటూ కన్నెర్రజేశారు. వెంటనే ఏడీఈ అంబేద్కర్‌పై బదిలీ వేటు వేశారు. దీంతో ఏడీఈ వెంటనే గట్టిమంత్రిని కలిసి బదిలీని రద్దు చేయించుకున్నట్టు తెలిసింది. బిగ్ బ్రదర్ వేటును గంటల్లోనే మాఫీ చేయించుకున్న వచ్చానన్న ధీమాతో ఏడీఈ మరింతగా చెలరేగిపోయారని తెలిసింది.

ఆయనది ఫిక్స్‌డ్ రేటు

అంబేద్కర్ వద్దకు ఏ ఫైల్ వెళ్లినా అందుకు తగ్గ రేటు లభిస్తేనే అది ముందుకు కదులుతుందన్న ప్రచారం జరుగుతున్నది. గట్టి మంత్రి అండదండలు ఉండటంతో ఆయనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా ఎవరూ ముట్టుకునే సాహసం చేయలేదు. ఈ పోస్టులోకి రావడానికి కోట్లు కుమ్మరించానని, తన ఫిక్స్‌డ్ రేట్లకు అదే కారణమని ఆయన చెప్తారట. బినామీగా ఉన్న ఓ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తారని డిస్కంలో చెప్పుకుంటున్నారు. ప్రతి నెలా ఎన్ని ఫైల్స్ చేశామో చెప్పి అందులో 'పై' స్థాయికి కూడా వాటా పంపుతారని, ఆ ధీమాతోనే అంబేద్కర్ ఉన్నతాధికారులను ఖాతరు చేయకపోయేవారని ఉద్యోగులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

'ముఖ్య' నేతకే ఝలక్!

గతంలో బిగ్ బ్రదర్‌కు ఝలక్ ఇచ్చిన అంబేద్కర్ ఇటీవల ఏకంగా 'ముఖ్య' నేతకు సైతం మరో ఝలక్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. 'ముఖ్యనేత' క్లోజ్ సర్కిల్‌లోని ఓ వ్యక్తికి కోకాపేట ప్రాంతంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనానికి హెచ్‌టీ కనెక్షన్ ఇవ్వాల్సి వచ్చింది. ఈ క్రమంలో పేషీ నుంచి ఏడీఈకి ఫోన్ వెళ్లింది. ఆ పని చేయాలని సూచన వెళ్లగా అప్పటికి అంబేద్కర్ సరేనన్నట్టు తెలిసింది. కానీ, సదరు వ్యక్తికి సంబంధించిన వాళ్లు వెళ్లి కలవగా రూ.50 లక్షలు డిమాండు చేసినట్టు ప్రచారం జరుగుతుంది. కొన్నిరోజులకు ఈ విషయం 'ముఖ్య' కేంద్రానికి చేరడంతో పర్యవసానంగా ఏసీబీ దాడి జరిగిందని అధికారుల మధ్య చర్చ జరుగుతున్నది.

రీయింబర్స్‌మెంట్ 50% ఎగ్గొట్టుడే!

మొదటిపేజీ తరువాయి...

భారం సర్కారుపై పడుతుండగా, ఈ విధానంతో భారం రూ.1,200 కోట్లకు తగ్గనుందని తెలిసింది. మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం నుంచి బయట పడేందుకే ఈ విధానాన్ని సర్కారు ముందుకు తెచ్చిందని కాలేజీల యజమాన్యాలు చెప్తున్నాయి.

నూతన విధానం అమలు ఇలా?

- హైదరాబాద్ నడిబొడ్డున ఓ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్ఈ కోర్సులో 1,350 సీట్లున్నాయి. ప్రస్తుతం మొత్తం సీట్లుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సర్కారే చెల్లిస్తున్నది. నూతన విధానం అమల్లోకి వస్తే సీఎస్ఈలో 240 సీట్లకే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. మిగతా 1,110 సీట్లకు వర్తించదు. ఈ కోర్సుల్లో చేరిన వారే మొత్తం ఫీజులను ఆ కళాశాలకు చెల్లించాలి.
- ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలోని మరో కాలేజీలో కన్వీనర్ కోటాలో 1,100 సీట్లున్నాయి. ఈ కాలేజీలోనూ 240 సీట్లకే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తారు. మిగతా 860 సీట్లల్లో చేరిన విద్యార్థులే ఫీజులు సొంతంగా చెల్లించాలి.

సీఎస్ చైర్మన్‌గా కమిటీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం సర్కారు ఈ వారంలోనే ఓ కమిటీని వేయనున్నది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ సెక్రటరీ, సాంకేతిక విద్య కమిషనర్, ఆరుగురు కళాశాలల ప్రతినిధులతో ఈ కమిటీ వేయనున్నట్టు సమాచారం. ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి విద్యాసంస్కరణల క్యాబినెట్ సబ్ కమిటీకి, ప్రభుత్వానికి నివేదికను అందజేస్తుంది. దీనిని సర్కారు ఆమోదిస్తే కొత్త ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులోకి వస్తుంది. అంతా అనుకున్నట్టు జరిగితే వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఈ నూతన పద్ధతిని అమలు చేయాలన్న యోచనలో సర్కారు వర్గాలున్నాయి.

రూ.600 కోట్లు పంచేదెట్ల?

రాష్ట్రంలోని ప్రొఫెషనల్ కాలేజీలకు సర్కారు ఇస్తామన్న రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎలా పంపిణీ చేయాలన్న ప్రశ్న తలెత్తింది. ఇది అంతిమంగా పంపకాల పంచాయితీకి దారితీసింది. రూ.200 కోట్లు తమకే ఇవ్వాలని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు అంటున్నాయి. ప్రధాన వాటా తమకే కేటాయించాలని ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల యాజమాన్యాలు కోరుతున్నాయి. తమ సంగతేమిటని బీఈడీ, నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని కాలేజీలకు సమానంగా పంచితే ఒక్కో కాలేజీకి రూ.5-7 లక్షలు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నది. ఇదిలా ఉంటే కొన్ని కాలేజీలు ఎక్కువ మొత్తం కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఈ విషయం తెలిసిన మరికొన్ని కాలేజీల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఇంత మాత్రం దానికేనా? ఇందుకోసమేనా? బంద్‌కు పిలుపునిచ్చింది అంటూ ఓ ప్రైవేట్ కాలేజీ కరస్పాండెంట్ తన అసంతృప్తిని వ్యక్తంచేశారు. నిరవధిక బంద్ విరమించకుండా ఉండాల్సిందని ఆయనఅభిప్రాయపడ్డారు.

దున్నపోతుకు వినతిపత్రం

- పెండింగ్ బిల్లులపై మాజీ సర్పంచ్‌ల వినూత్న నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దున్నపోతుకు వినపత్రం ఇచ్చి మాజీ సర్పంచ్‌లు నిరసన తెలిపారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, నాయకులు మెడబోయిన గణేశ్, అరవింద్‌రెడ్డి, మాదాసు రవి, పూర్ణ చందర్‌గౌడ్, సముద్రాల రమేశ్, పీ పాండు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి

మంత్రి సీతక్కకు టీపీఎస్ఎఫ్ వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లులను వారం రోజుల్లో (బతుకమ్మ పండుగలోపే) క్లియర్ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పంచాయతీ కార్యదర్శుల ఎఫెక్టివ్ డేట్‌ను అన్ని జిల్లాల్లో వెంటనే ఇస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. సచివాలయంలో మంగళవారం మంత్రి సీతక్కకు ఆ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వీటిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ఫైల్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గౌరవాధ్యక్షుడు సందీప్, కోశాధికారి ముత్యాల శశిధర్‌గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గౌతం పాల్గొన్నారు.


సికింద్రాబాద్‌లో మెడికవర్ దవాఖానను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి

300 బెడ్స్‌తో మెడికవర్ దవాఖాన

- ప్రారంభించిన కేంద్రమంత్రులు
- సికింద్రాబాద్‌లో ఏర్పాటు
- అత్యుత్తమ స్థాయిలో వైద్య సేవలు
- చైర్మన్ ఎండీ అనిల్‌కృష్ణ వెల్లడి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 16: హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందని, ఆఫ్రికన్ దేశాల నుంచి నగరానికి వైద్యంకోసం వస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ సంగీత్ థియేటర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మెడికవర్ దవాఖానను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... రోగులు వైద్యులపై ఎంతో నమ్మకాన్ని పెట్టుకొని దవాఖానలకు వస్తారని వారి నమ్మకాన్ని నిలుపుకునేలా వైద్యాన్ని అందించాలని సూచించారు. నగరం ఫార్మా, ఐటీ, వ్యాక్సిన్, డిఫెన్స్ ఉత్పత్తుల కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. కరోనా సమయంలో హైదరాబాద్‌లో ఉత్పత్తైన వ్యాక్సిన్ 150 దేశాలకు సరఫరా చేసిన ఘనత మనదేనని అన్నారు. అనంతరం కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... వైద్యో నారాయణ హరి అన్నారని.. దాన్ని వైద్యులు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ దవాఖానలు, వైద్యులు చికిత్సలో మానవీయ కోణాన్ని విస్మరంచవద్దని సూచించారు. మెడికవర్ దవాఖాన చైర్మన్ ఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్ 12 దేశాల్లో కార్యాకలాపాలు నిర్వహిస్తున్నదని, ఇప్పుడు 24వ దవాఖానను 300 పడకలతో సికింద్రాబాద్‌లో ఏర్పాటుచేశామని తెలిపారు. అత్యుత్తమ స్థాయిలో వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ప్రారంభోత్సవంలో కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, దవాఖాన ఈడీ డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్లు కృష్ణప్రసాద్, హరికృష్ణ, అంజయ్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్లమ్ సెట్‌లో ది ప్యారడైజ్



'దసరా' వంటి మాస్ బ్లాక్‌బస్టర్‌ను అందించిన నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబోలో రూపొందుతున్న 'ది పారడైజ్' చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ హైదరాబాద్ పీరియాడిక్ మూవీ తాలూకు గ్లింప్స్ ఒక్కసారిగా సినిమాపై అంచనాల్ని పెంచింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఇందుకోసం భారీ స్లమ్ సెట్‌ను తీర్చిదిద్దారట. దీనికి మధ్యలో ఎత్తైన ఆర్చ్‌తో కూడిన ఓ భవంతి సెట్‌కు కూడా డిజైన్ చేశారని చెబుతున్నారు. ఆధిపత్య వ్యవస్థపై దిక్కార స్వరం వినిపించే ఓ సామాన్యుడి పోరాట కథగా, కమర్షియల్ హంగుల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'జడల్' పాత్రలో ఇప్పటికే విడుదలైన నాని లుక్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.

'డ్రాగన్'లో అతిథి పాత్రకోసం..?



ఎన్టీఆర్ కథానాయకుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తన సినిమాల్లో కథానాయకుల్ని అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తూ రోమాంచితమైన ఎలివేషన్స్‌తో ప్రజెంట్ చేస్తుంటారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. ఈ సినిమాలో కూడా ఎన్టీఆర్‌ను నెవర్‌సీన్ బిఫోర్ అనుకునేలా చూపించబోతున్నారట. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్న ఈ సినిమాలో వివిధ భాషల అగ్ర తారలు కీలక పాత్రల్లో నటించనున్నారని వార్తలొస్తున్నాయి.

తాజా సమాచారం ప్రకారం 'కాంతార' ఫేమ్ రిషబ్‌శెట్టి కీలకమైన అతిథి పాత్రలో కనిపిస్తారని తెలిసింది. ఇప్పటికే ఆయనతో చర్చలు పూర్తయ్యాయని, 'డ్రాగన్'లో భాగమయ్యేందుకు రిషబ్‌శెట్టి సంతోషంగా అంగీకరించారని సమాచారం. వ్యక్తిగతంగా కూడా ఎన్టీఆర్-రిషబ్‌శెట్టిల మధ్య చక్కటి స్నేహసంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో 'డ్రాగన్'లో రిషబ్‌శెట్టి నటించడం ఖాయమనే వార్తలకు మరింతగా బలం చేకూరుతున్నది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదలకానుంది.

ప్రభుత్వ సారాయి దుకాణం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. సదన్‌హాసన్, విక్రమ్‌జిత్, నరేష్‌రాజు, వినయ్ బాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ..ఈ సినిమాలోని ప్రతీ పాత్ర పురాణాల తాలూకు పాత్రలను, వ్యక్తిత్వాలను గుర్తుకు తెస్తుందని, చక్కటి సామాజిక సందేశంతో ఈ సినిమా తీశామని తెలిపారు. రాజకీయ నాయకుల వెన్నులో వణుకు పుట్టించే సినిమాగా మిగిలిపోతుందని నిర్మాతలు దైవ నరేష్‌గౌడ్, పరిగి స్రవంతి మల్లిక్ అన్నారు. ఈ సినిమా ద్వారా స్త్రీశక్తి గొప్పదనాన్ని తెలుసుకోవచ్చని నాయకానాయికలు పేర్కొన్నారు. శ్రీలు, అదితి మైకేల్, మోహనసిద్ధి, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ్, దర్శకుడు: నరసింహ నంది.

చిత్రం



కణ్మని మనసు నిర్మలం

నాని 'జెంటిల్‌మేన్'తో తెలుగు నాట అభినయానికి 'శ్రీకారం' చుట్టిన కన్నడ కస్తూరి ప్రియాంక అరుళ్ మోహన్.. 'సరిపోదా శనివారం'తో టాలీవుడ్‌లో తొలి విజయాన్ని అందుకున్నారు. తమిళనాట అగ్రతారగా కొనసాగుతూ.. తెలుగులో సెలక్టివ్‌గా సినిమాలు చేస్తూ భాషలకు అతీతంగా దూసుకుపోతున్న ఈ అందాల తార పవన్‌కల్యాణ్ 'ఓజీ'లో 'కణ్మని'గా కనిపించనున్నారు. ఈ నెల 25న 'ఓజీ' విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు ప్రియాంక అరుళ్ మోహన్. 'ఓజీ'తో నాది రెండున్నరేండ్ల ప్రయాణం. పవన్‌సార్‌తో కలిసి నటించడమే గొప్ప అదృష్టమైతే.. 'కణ్మని' లాంటి మంచి పాత్ర దొరకడం మరింత అదృష్టంగా భావిస్తున్నా. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రలన్నింటిలో కణ్మని స్పెషల్. ఇది 80ల్లో జరిగే కథ. అందుకే అప్పటి వేషధారణ, ఆనాటి అమ్మాయిల ప్రవర్తన.. తదితర విషయాల్లో జాగ్రత్తలు తీసుకున్నాను. కణ్మని ఇన్నోసెంట్ గర్ల్. ఆహార్యం సాంప్రదాయబద్ధంగా ఉంటుంది. ప్రేమ గాఢంగా ఉంటుంది. ఓజస్ గంభీర జీవితాన్ని మలుపు తిప్పేది ఆ పాత్రే. పవన్‌స్టార్‌తో పని చేయడం ఓ గొప్ప అనుభవం. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. హీఈజ్ జెంటిల్‌మెన్. అందర్నీ సమానంగా చూస్తారు. 'ఓజీ' కేవలం యాక్షన్ సినిమానే కాదు. ఇందులో మనసుల్ని మెలిపెట్టే ఫ్యామిలీ డ్రామా ఉంటుంది. దర్శకుడు సుజీత్ క్లారిటీ ఉన్న దర్శకుడు. నా పాత్ర, లుక్ బాగున్నాయంటే కారణం తనే' అని చెప్పింది ప్రియాంకఅరుళ్ మోహన్.

ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు



సూపర్‌రాజా స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన చిత్రం 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'. ప్రపంచ సినీచరిత్రలో ఒకే షాట్లో సినిమా మొత్తాన్నీ తెరకెక్కించి రికార్డు సృష్టించినట్టు దర్శక, నిర్మాత సూపర్‌రాజా తెలిపారు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. మైత్రీవారు ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని, విభిన్నమైన కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుంది సూపర్‌రాజా చెప్పారు. ఈ సినిమాలో భాగం అయినందుకు కథానాయిక చందన పాలంకి ఆనందం వెలిబుచ్చారు. వంశీ గోనె, రమ్యప్రియ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ్ శివదాసని, సబు వర్గీస్, నిర్మాణం: రాజా కృష్ణ ప్రొడక్షన్స్.

తల్లిదండ్రుల బాధ్యత గుర్తుచేసే చిత్రం



'ఈ కథకు 'బ్యూటీ' అనేది సరైన టైటిల్. ఎందుకంటే ఈ కథలోనే బ్యూటీ ఉంది. జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యం రాసిన కథని దర్శకుడు వర్ధన్ అందంగా మలిచాడు. ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్ కలగలుపు ఈ సినిమా. సినిమాటిక్ లిబర్టీ అనేది ఏ మాత్రం లేకుండా పూర్తి ఆర్గానిక్‌గా తీసిన సినిమా ఇది.' అని వీకే నరేష్ అన్నారు. అంకిత్ కొయ్య, నీలఖి లీడ్ రోల్స్ చేసిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'బ్యూటీ'. జె.ఎస్.ఎస్.వర్ధన్ దర్శకుడు. విజయ్‌పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్న వీకే నరేష్, నటి వాసుకి మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. నటి వాసుకి మాట్లాడుతూ 'ఆడపిల్ల తల్లిని కావడంవల్ల ఈ కథకు నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఒక తల్లికీ, ఒక కూతురుకీ ఉండాల్సిన అవగాహన, బాధ్యత ఈ కథలో ఉన్నాయి. పిల్లల విషయంలో మనం కఠినంగా ఉంటే సరిపోదు, వారి పాయింట్‌లో ఏముందో చూడాలి అని చెప్పే సినిమా ఇది. ఈ తరం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది' అని పేర్కొన్నారు.

'బ్రహ్మారాక్షస'కు రంగం సిద్ధం?



ప్రీప్రొడక్షన్ అంతా పూర్తి చేసి, బౌండ్ స్క్రిప్టని సిద్ధం చేసి, హీరో లేని సన్నివేశాలన్నింటి కోసం ఓ షెడ్యూల్ రాసేసి.. ముందు దాన్ని కంప్లీట్ చేసి, అప్పుడు తీరిగ్గా హీరోని పిలిస్తే.. తేలిగ్గా షూటింగ్ కంప్లీట్ అయిపోతుంది. ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ టెక్నిక్‌నే ఫాలో అవుతున్నారట. ఇప్పటికిప్పుడు ప్రభాస్ దొరకడం అసాధ్యం. అందుకే.. ఆయనతో చేయబోతున్న 'బ్రహ్మారాక్షస'(వర్కింగ్ టైటిల్) సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ మొత్తాన్నీ పూర్తి చేసే పనిలో ఉన్నారట ప్రశాంత్‌వర్మ. ప్రతి షాట్, ప్రతీ సీన్ ప్రీ విజువలైజేషన్, ఏ షాట్ ఎలా తీయాలి? తదితర అంశాలపై కూడా ఆయన పూర్తి క్లారిటీతో ముందుకెళ్తున్నారట. డైలాగ్ వెర్షన్ మినహా స్క్రిప్ట్ వర్క్ అంతా కంప్లీట్ అయ్యిందని సమాచారం. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు మాటలు రాస్తున్నారని తెలిసింది. ముందు ప్రభాస్ లేని సీన్స్ తీస్తారట. ప్రభాస్ తన సినిమాలను పూర్తి చేసుకొని రాగానే, తక్కువ సమయంలోనే 'బ్రహ్మారాక్షస'ను పూర్తి చేసేయాలనే ప్రణాళికతో ప్రశాంత్‌వర్మ ఉన్నారట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా లాంఛనంగా మొదలయ్యే అవకాశం ఉంది.

వినూత్న ప్రయత్నం.. విభిన్న ఆవిష్కరణ



'ఇందులో నా పాత్ర గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. అందుకే ఆ పాత్ర గురించి ఎక్కడా రివీల్ చేయకుండా సర్‌ప్రైజ్‌లా ఉంచాం. దాదాపు ఏడు గంటలు టెస్ట్ షూట్ చేసి, నా పాత్రని ఫైనలైజ్ చేశారు. ఇలాంటి యూనిక్ క్యారెక్టర్ చేయడం చాలా ఆనందంగా ఉంది.' అని నటుడు, కొరియోగ్రాఫర్ శాండీ మాస్టర్ అన్నారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటించిన హారర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. ఇటీవల విడుదలైన ఈ సినిమాలో శాండీ మాస్టర్ కీలక పాత్ర పోషించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆ పాత్ర తాలూకు అనుభవాలను శాండీ మాస్టర్ విలేకరులతో పంచుకున్నారు. 'కిష్కింధపురి' విజయం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. చిన్నప్పుడు నా కళ్లను చూసి 'డెత్ గోట్ ఐస్' అంటూ అందరూ ఆటపట్టించేవారు. ఇప్పుడు ఆ కళ్లే నాకు ఆనందాన్నిచ్చాయి. ఆ కళ్లను చూసే లోకేష్ కనకరాజ్ 'లియో'లో క్యారెక్టర్ ఇచ్చారు. 'లియో' తర్వాత అన్నీ సైకో క్యారెక్టర్లే వచ్చాయి. అలాంటి సమయంలో 'లోక', 'కిష్కింధపురి' చిత్రాలు నన్ను కొత్తగా ప్రజెంట్ చేశాయి. విభిన్నమైన పాత్రలతో విజయాలను అందుకోవడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా 'కిష్కింధపురి'లోని పాత్రకు గొప్ప స్పందన లభించింది. లోకేష్ కనకరాజ్, పా.రంజిత్ ఈ సినిమా చూసి నన్ను అభినందించారు.' అని తెలిపారు శాండీ. కొరియోగ్రఫీ, యాక్టింగ్ తనకు రెండు కళ్లు అని, దర్శకత్వంపై కూడా ఆసక్తి ఉందని, పా రంజిత్ నిర్మాణంలో హీరోగా ఓ సినిమా చేస్తున్నానని, మలయాళ సినిమా 'కథామినార్'లో కీలక పాత్ర పోషిస్తున్నానని, అలాగే 'ఓజీ'లో ప్రమోషనల్ సాంగ్‌కి కొరియోగ్రఫీ అందించానని శాండీ మాస్టర్ తెలియజేశారు.

కోహ్లి బయోపిక్‌కు దూరం!



భారత స్టార్ బ్యాటర్ విరాట్‌కోహ్లి బయోపిక్ తెరకెక్కించడానికి బాలీవుడ్‌లో పలువురు దర్శకనిర్మాతలు ఆసక్తిగా ఉన్నారు. కోహ్లి సమ్మతిస్తే ఆయన జీవితకథను వెండితెర మీదకు తీసుకొచ్చేందుకు సిద్ధమని అగ్ర దర్శకులు కూడా పలు సందర్భాల్లో చెప్పారు. ఈ నేపథ్యంలో విరాట్‌కోహ్లి బయోపిక్ గురించి అగ్ర దర్శకుడు అనురాగ్ కశ్యప్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కోహ్లి బయోపిక్‌ను డైరెక్ట్ చేసే అవకాశం వచ్చినా తాను ఆ ఆఫర్‌ను స్వీకరించనని తెలిపారు. 'కోహ్లితో నాకు ఎంతో అనుబంధం ఉంది. అతను అందంలోనూ వ్యక్తిత్వంలోనూ చాలా గొప్పవాడు. మైదానంలో ఎంత అగ్రెసివ్‌గా ఉంటాడో బయట అంత సౌమ్యంగా కనిపిస్తాడు. క్రికెట్ అభిమానులతో పాటు సాధారణ ప్రజల దృష్టిలో కూడా అతను ఓ హీరో. ముఖ్యంగా పిల్లలు ఆయన్ని ఎంతగానో ఇష్టపడతారు. కోహ్లి ఓ అద్భుతం. ఒకవేళ నేను బయోపిక్ తీయాల్సివస్తే సాధారణ వ్యక్తి జీవితాన్నే చూపిస్తాను. కోహ్లి వంటి గ్రేట్ హీరో బయోపిక్‌కు నేను న్యాయం చేయలేను' అన్నారు. కోహ్లి బయోపిక్‌లో అగ్ర హీరో రామ్‌చరణ్ నటించనున్నారని గతంలో వార్తలొచ్చిన విషయం తెలిసిందే.

ఆర్థిక బాధ్యత ఇద్దరిదీ



కుటుంబం ఆర్థికంగా బాగుండాలంటే దంపతులిద్దరూ ఒక్క మాటపై ఉండాలి. డబ్బు విషయంలో ఇద్దరి మనసులో పొదుపు చేయాలని ఉంటే, కచ్చితంగా ఆ కుటుంబానికి ఆర్థిక సమస్యలు రావు. అయితే ప్రణాళికలు ఎలా వేసుకోవాలో చాలా మందికి తెలియదు. ముఖ్యంగా కొత్తగా పెండ్లయిన దంపతులకు ఈ విషయంలో అవగాహన అంతంత మాత్రమే! అలాంటి వాళ్లు కొన్ని ఆర్థికపరమైన విషయాలు తెలుసుకుంటే మంచిది.

- కొత్త దంపతులు పెండ్లికి ముందు తమ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో చర్చించుకోవాలి. అలాగే తమ అప్పులు, ఆస్తులు, పొదుపు చేసిన డబ్బు, అలవాట్లు, ఖర్చుల గురించి ఒకరికొకరు మాట్లాడుకోవాలి.
- ఇద్దరూ కలిసి డబ్బుపై ఒక అభిప్రాయానికి రావాలి. దాని విలువ గురించి చర్చించుకోవాలి. తర్వాత భవిష్యత్తు కోసం కొన్ని లక్ష్యాలను పెట్టుకోవాలి. అందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ ఉండేలా చూసుకోవాలి. చిన్నచిన్న ఔటింగ్స్, కొత్త ఫోన్లు, కంప్యూటర్ల కొనుగోలు, ఎమర్జెన్సీ ఫండ్స్ వాటిని షార్ట్ టర్మ్ గోల్స్‌గా ఫిక్స్ చేసుకోవాలి. సొంతిల్లు, రిటైర్మెంట్ ప్లాన్స్ లాంటివి లాంగ్ టర్మ్ గోల్స్‌గా నిర్దేశించుకోవాలి. అనుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా ప్రణాళికలు అమలుచేయాలి.
- భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకపోవడం మంచిది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాల్లో దాచివేతలు, దాటవేతలు భవిష్యత్తులో సమస్యాత్మకంగా పరిణమించే ప్రమాదం ఉంది. అందువల్ల ఆదాయం, పెట్టుబడి, అప్పుల విషయంలో ఇద్దరి మధ్య పారదర్శకత ఉండాలి. అప్పుడే వాళ్లలో నమ్మకం అనే బలమైన పునాది ఏర్పడుతుంది.
- ఆటుపోట్లు అందరికీ సహజం. ఆర్థికంగా పరిస్థితి ప్రతికూలంగా మారినప్పుడు.. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవద్దు. ఒకరి తప్పును మరొకరు దిద్దే ప్రయత్నం చేయాలి. ఆర్థిక సుడిగుండంలో నుంచి మీ పార్ట్‌నర్‌ను బయటపడేసేందుకు మీ వంతు సహకారం అందించే ప్రయత్నం చేయాలి.

నమస్తే తెలంగాణ

జిందగీ

బుధవారం | 17 సెప్టెంబర్ 2025

హైదరాబాద్ | www.ntnews.com

11



వానల్లో ఏం తినాలి?

ఫుడ్ సైన్స్

తరచూ వర్షాలు పడుతూ ఉండటం వల్ల చుట్టూ తేమ వాతావరణం ఏర్పడుతున్నది. ఈ పరిస్థితుల్లో మనం మాటిమాటికీ జలుబు, జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ఆహారంలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో తెలుపగలరు?

వర్షంతో పాటు రకరకాల జబ్బులు సులభంగా వచ్చేస్తుంటాయి. వైరల్ ఫీవర్లు, మలేరియా, డెంగ్యూలాంటివి ఈ సమయంలో మనల్ని చుట్టు ముడతాయి. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. కలరా, టైఫాయిడ్, గ్యాస్ట్రో ఎంటరైటిస్, వాంతులు, విరేచనాల్లాంటివి తొందరగా వచ్చే అవకాశాలుంటాయి. అందుకే వానాకాలంలో పరిశుభ్రత చాలా ముఖ్యం. కూరగాయల్ని ట్యాప్‌కింద శుభ్రపరచడం, వెనిగర్, పసుపు, ఉప్పు లాంటివి వేసి కడగడంలాంటివి చేయాలి. శుభ్రమైన నీళ్లు తీసుకోవాలి. మున్సిపల్ ట్యాప్ నీళ్లయితే కాచి చల్లార్చి తాగాలి. తరచూ చేతులు కడుక్కోవడం, ఇంటి చుట్టూ పరిశుభ్రంగా, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం చేయాలి. నూనెలో వేయించిన పదార్థాలు, స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కొందరు వండినవి రెండు మూడు రోజుల పాటు తింటారు. ఎంత ఫ్రిజ్‌లో పెట్టినా సరే వానాకాలంలో అలాంటి ఆహారం వద్దు. పండ్లు కూడా తరిగిన వెంటనే తినాలి. విటమిన్-సి, యాంటి ఆక్సిడెంట్లు ఉన్న ఫుడ్స్, పండ్లు, కూరలు ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రొ బయాటిక్ ఫుడ్ తీసుకుంటే మంచిది. పెరుగు, ఇడ్లీ, దోశ, ఫెర్మెంటెడ్ వెజిటబుల్స్, కంబూచాలాంటి పులియబెట్టిన టీలు ఈ కోవలోకి వస్తాయి. ఇవి పొట్టకు బలం. ఏకాలమైనా సరే మన శరీరాన్ని ఎంత చురుగ్గా ఉంచుకుంటే అంత బాగుంటాం. వానల్లో వాకింగ్‌కి బయటికెళ్లలేం అనుకుంటే ఇంట్లోనే అటూ ఇటూ కాసేపు నడవచ్చు. సూర్యనమస్కారాలు, శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయాలి. సరళమైన యోగా, ప్రాణాయామం లాంటివి చాలా మేలు చేస్తాయి. వర్షాకాలంలో బయట చల్లగా ఉంటుంది కాబట్టి వేడివేడిగా ఏదో ఒకటి తినాలనుకుంటాం. ముఖ్యంగా సెగలుకక్కే బజ్జీలు, పకోడీల్లాంటివి తరచూ తింటుంటాం. టీలు కూడా ఎక్కువగానే తాగుతాం. దానికి బదులు వేడి సూప్‌లు, రసం, వేడి మక్కజొన్న కంకి, ఉడకబెట్టిన పెసలు, పల్లీలు, శనగల్లాంటి గుగ్గిళ్లు తీసుకోవచ్చు. తెలంగాణ వంటకం సర్వపిండి కూడా కరకరలాడుతూ బాగుంటుంది. గుంత పొంగణాలు, షాలో ఫ్రై చేసిన కూరగాయలు, సోయా టిక్కీ, చపాతీలతో చేసిన చికెన్ ర్యాప్, పనీర్ ర్యాప్‌లలాంటివి కూడా ఈ సీజన్‌లో తినొచ్చు. మామూలు టీ కాకుండా అల్లం, ఇలాచీల్లాంటివి నీళ్లలో మరిగించి తీసుకోవచ్చు. ఇలా మన జిహ్వ చాపల్యాన్ని ఆరోగ్యంగా తీర్చుకుంటూ వానాకాలాన్ని దాటేస్తే అంతా ఆనందమే!



మయూరి ఆవుల

న్యూట్రిషనిస్ట్

Mayuri.trudiet@gmail.com



మహిళా సాధికారత అసాధ్యం అనుకున్న రోజులు పోయి.. సుసాధ్యం చేసే దిశగా మార్పు మొదలైంది. అమ్మాయిలూ బాగా చదువుకుని ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తున్నారు. అయినా ఎక్కడో కొంత వెలితి కనిపిస్తున్నది. సరైన అవకాశాలు లభించక కొందరు, అనుకూలమైన మార్గం కనిపించక మరి కొందరు మహిళలు తమ కలలను మొగ్గలోనే తుంచేసుకుంటున్నారు. ఇలాంటి అడ్డంకులను తొలగించేందుకు ఒక్క మహిళ ముందుకొచ్చారు. తోటి మహిళల కలలను నిజం చేసేందుకు, వారికి ఉద్యోగ, వ్యాపార అవకాశాలను కల్పిస్తున్నారు. ఇందుకోసం 'ఇన్‌స్పైరింగ్ ఇండియన్ ఉమెన్ (ఐఐడబ్ల్యూ)' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు బ్రిటన్‌లో స్థిరపడిన భారతీయురాలు రష్మి మిశ్రా.

ఇన్‌స్పైర్ ఇండియా

ఓ ప్రవాస ఆలోచన

సమాజంలో పేరుకుపోయిన వివక్ష.. ఆడపిల్లలకు అవకాశాలను పరిమితం చేస్తున్నదని రష్మి భావన. డిగ్రీలు చదివినా, పీజీలు చేసినా.. చాలామంది యువతులు తమ అర్హతకు తగ్గ ఉద్యోగం సంపాదించడానికి మగవారితో పోలిస్తే చాలా కష్టపడాల్సి వస్తున్నదని ఆమె అభిప్రాయపడేవారు. మల్టీటాస్కింగ్‌లో ముందుండే ఆమె ఎప్పుడూ ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించేవారు. అలా అనుకొని ఊరుకోలేదు! సాటి మహిళలు మేటిగా నిలవాలనే సంకల్పంతో 2018లో ఐఐడబ్ల్యూ సంస్థను ప్రారంభించారు. అనతి కాలంలోనే ఆ సంస్థ అతివల పాలిట నిచ్చెనగా మారింది. ఐఐడబ్ల్యూ తోడ్పాటుతో ఎందరెందరో మహిళలు దేశ, విదేశాల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని రష్మి గర్వంగా చెబుతారు.

టీచింగ్‌తో మొదలై..

బ్రిటన్‌లో స్థిరపడిన రష్మి అక్కడే ఓ పాఠశాలలో 25 ఏండ్లపాటు ఉపాధ్యాయురాలిగా సేవలు



అందించారు. తన విద్యార్థులకు, తోటి టీచర్లకు ఎప్పుడూ ఆదర్శంగా ఉండేవారు. పరిశోధనాత్మక విషయాలు, భవిష్యత్తులో రాబోయే మార్పులు, ఉద్యోగ అవశాలు, ఆదర్శ వనితల గురించి విద్యార్థులకు తరచూ బోధించేవారు. ఆ సమయంలోనే తన విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పించాలని జాతీయ, అంతర్జాతీయ ఇన్నోవేటర్లను ఒక వేదికపైకి తీసుకురావాలని పలు కార్యక్రమాలు చేపట్టారు. అలా ఒక నెట్‌వర్క్ క్రియేట్ చేసి సామాజిక మార్పు కోసం తనవంతు ప్రయత్నాలు కొనసాగించారు రష్మి.

మహిళల కోసమే..

ప్రపంచంలోని భారతీయ మహిళలందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఐఐడబ్ల్యూకి అంకురార్పణ చేశారు రష్మి. ఈ సంస్థలో మహిళలే తోటి మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా పని చేస్తుంటారు. అలాగే ఒకరికొకరు అన్ని విషయాల్లో ప్రోత్సాహం అందించేలా కార్యక్రమాలు చేపడుతుంటారు. అంతేకాదు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేసేందుకూ కృషి చేస్తున్నది ఐఐడబ్ల్యూ. క్షేత్రస్థాయిలో పని చేస్తూనే, సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ దేశాలకు చెందిన మహిళలతో కనెక్ట్ అవుతూ మార్పు కోసం ప్రయత్నిస్తున్నది. కొవిడ్ సమయంలో ఈ సంస్థ వలంటీర్లు రకరకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా విదేశాల్లోని భారతీయ విద్యార్థులకు అండగా నిలిచారు. అలాగే ఎంతోమంది వృద్ధులు, ఒంటరి మహిళలకు వంట సామగ్రి, ఔషధాలు అందించారు. మానసికంగా కుంగిపోయిన వాళ్లకు వెబినార్ ద్వారా తగు సూచనలు అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు.

> **మా సేవలివే..**
>
> **నేను** యూకేలో ఉంటున్నా సరే, నా మనసెప్పుడూ భారతదేశంలోనే ఉంటుంది. అందువల్లే ఈ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాను. ఇది దేశ, విదేశాల్లోని భారత మహిళలను ఒక్కచోటికి చేరుస్తుంది. దానివల్ల ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కలుగుతున్నాయి. అంతేకాకుండా మేము ఎప్పటికప్పుడు సామాజిక అంశాలపై క్యాంపెయిన్స్ నిర్వహిస్తుంటాం. భారతదేశంలో ఉండే మా సంస్థ సభ్యులు నిత్యం క్షేత్రస్థాయిలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటారు. మేము ఎక్కువగా గ్రామీణ మహిళలకు విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఉమెన్ హైజీన్ లాంటి అంశాలపై దృష్టి పెట్టాం. అలాగే గృహ హింస బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉంటున్నాం. లండన్‌లో మా ఉమెన్ కమ్యూనిటీ ఎన్నో అంశాలపై చర్చిస్తూ, భారతీయ మహిళలకు ఉపయోగపడేలా కార్యాచరణను రూపొందిస్తున్నాం. మా సేవలు మరింత విస్తరించే ప్రయత్నంలో ఉన్నాం. ఆ దిశగా విజయం సాధిస్తామన్న నమ్మకం మాకుంది.
>
> • రష్మి మిశ్రా

ఆదుకున్న విరాళాలు..

ప్రత్యక్షంగా సేవలు అందించడమే కాకుండా, స్వచ్ఛంద సంస్థలకూ అండగా నిలుస్తున్నది ఐఐడబ్ల్యూ. 2018లో నక్షి బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ ఫ్యాషన్ షో ఏర్పాటు చేసి విరాళాలు సేకరించింది. ఈ మొత్తాన్ని మ్యాక్ మిల్లన్ క్యాన్సర్ రీసెర్చ్ సంస్థకు అందించింది. ఈ కార్యక్రమం ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు నిర్వాహకులు. ఈ షోలో క్యాన్సర్‌ను జయించిన 15 మంది మహిళలు ర్యాంప్‌వాక్ చేసి ఆశ్చర్యపరిచారు. మరో కార్యక్రమం ద్వారా సేకరించిన విరాళాలను కొవిడ్ బాధితులకు అందించారు. ఇలా ఏటా ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ.. విరాళాలు సేకరించి స్వచ్ఛంద సంస్థలకు అందిస్తున్నారు రష్మి మిశ్రా! ప్రస్తుతం మన దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ ఐఐడబ్ల్యూ సేవలు అందిస్తున్నది. ప్రతిచోటా ఈ సంస్థ



వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఐఐడబ్ల్యూ సభ్యులు రాజస్థాన్‌లోని విక్రమ్‌గఢ్‌కు వెళ్లి.. అక్కడి గిరిజన మహిళలు తయారుచేసిన హస్త కళాకృతులను కొనుగోలు చేసి.. వాటిని బ్రిటన్‌కు తరలించి, అక్కడ విక్రయాలు జరిపారు. తద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించారు. ఈ ప్రయాణంలో రష్మి మిశ్రాను పలు అవార్డులు పలకరించాయి. 'ఎక్సెప్షనల్ ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్' పురస్కారాన్ని అందుకున్నారు. 2019లో బ్రిటిష్ ఏషియన్ బ్యూటీ పీజెంట్స్ గ్లోబల్ నుంచి మరో అవార్డు పొందారు. మహిళా సాధికారత లక్ష్యంగా కృషి చేస్తున్న ఐఐడబ్ల్యూ.. అనుకున్నది సాధించే వరకు విశ్రమించదని చెబుతున్న రష్మి మిశ్రాను మనమూ అభినందిద్దాం.

కొందరు పిల్లలు.. చాలా సులభంగా అబద్ధం చెప్పేస్తుంటారు. తప్పు చేసినప్పుడో, తల్లిదండ్రులను సంతోషపెట్టడానికో.. కట్టుకథలు అల్లుతుంటారు. పెరుగుతున్న కొద్దీ 'అది తప్పు!' అని తెలుసుకొని మానేస్తారు. కొందరు మాత్రం.. పెద్దయ్యాక కూడా కొనసాగిస్తుంటారు. 'అబద్ధాల కోరు!'గా ముద్రవేసుకుంటారు. అలా కావొద్దంటే.. బాల్యంలోనే అసత్యాల కొమ్మను వంచేయాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

అబద్ధాలకు అడ్డుకట్ట!

పిల్లలు అబద్ధాలు చెప్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది. అప్పుడప్పుడు చెబితే ఫర్వాలేదు. కానీ, అన్నిటికీ అబద్ధం చెబుతుంటే మాత్రం.. తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. ఆదిలోనే వాటికి అడ్డుకట్ట వేయాలి. ఇందుకోసం.. పిల్లలు నిజాయతీగా ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలి. వారు ఎప్పుడూ నిజం చెప్పేలా ప్రోత్సహించాలి. అసలు వారు ఎందుకు అబద్ధం చెబుతున్నారో తెలుసుకోవాలి. దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవాలి. నిజం చెప్పినా.. ఎలాంటి సమస్యా ఉండదన్న భరోసా వారికి ఇవ్వాలి. అప్పుడే.. పిల్లలు అబద్ధాలు చెప్పకుండా ఉండగలుగుతారు.

ఎందుకు అబద్ధం చెబుతారు?

ఏదైనా పొరపాటు చేసినప్పుడు.. శిక్ష నుంచి తప్పించుకోవడానికి ఎక్కువగా అబద్ధం చెబుతుంటారు. డెవలప్‌మెంట్ సైకాలజీలో 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనం కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. తప్పు చేసినప్పుడు నిజాయతీగా ఉంటే.. ఫలితం ప్రతికూలంగా ఉంటుందని వారి నమ్మకం. అందుకే, అబద్ధాన్ని ఒక వ్యూహంగా మలుచుకుంటారు.

ఇక చాలా సందర్భాల్లో తల్లిదండ్రుల ప్రశంసలు పొందడానికి కూడా పిల్లలు అబద్ధాలు ఆడుతుంటారట. 2016లో జర్నల్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ చైల్డ్ సైకాలజీ జరిపిన ఓ పరిశోధన ఈ విషయాన్ని తేల్చింది. తాము అన్నిట్లో బెస్ట్ అనిపించుకోవడానికి, సామాజిక అంచనాలను అందుకోవడానికి పిల్లలు అబద్ధాలు చెబుతారని వెల్లడైంది.

పిల్లలు పెరిగేకొద్దీ.. స్వయంప్రతిపత్తిని కోరుకుంటారు. ఈ క్రమంలోనూ అబద్ధం చెబుతారు. ముఖ్యంగా, టీనేజర్లు ఎక్కడికి వెళ్తున్నదనీ, ఏం చేస్తున్నదీ తల్లిదండ్రుల దగ్గర దాచి పెడుతుంటారు. జర్నల్ ఆఫ్ అడోలెసెన్స్‌లో 2010లో ప్రచురితమైన సర్వే.. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని బయటపెట్టింది. అయితే, టీనేజర్లు ఇలా సమాచారాన్ని దాచిపెట్టడం వెనక దురుద్దేశం ఉండదు. కేవలం వారి గోప్యత, స్వాతంత్ర్య భావాన్ని కాపాడుకోవడానికే అని సదరు సర్వే తేల్చింది.

తల్లిదండ్రులు ఏం చేయాలి?

అబద్ధం చెప్పడం చెడు ప్రవర్తన కాదు. వారి తెలివితేటలు, సృజనాత్మకత, సామాజిక అభ్యాసాన్ని ప్రతిబింబించే ఓ మైలురాయి కూడా! అయితే, ఈ విషయంలో తల్లిదండ్రులు ఎలా స్పందిస్తారనేదే ముఖ్యం.

- తప్పు చేసినప్పుడు కఠినంగా శిక్షించే బదులు.. వారిలో నిజాయతీని ప్రోత్సహించాలి. అబద్ధం కన్నా.. 'నిజం చెప్పడమే మంచిది' అనే వాతావరణాన్ని సృష్టించాలి. నిజం ఎంత విలువైనదో వివరిస్తే.. పిల్లలు అబద్ధాలకు దూరంగా ఉంటారు.
- పిల్లలు తాము చూసే వాటినే ఎక్కువగా అనుకరిస్తారు. తల్లిదండ్రులు తరచుగా 'చిన్న చిన్న అబద్ధాలు' ఉపయోగిస్తే.. పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. తల్లిదండ్రులు నిజాయతీగా ఉంటే.. పిల్లలూ అదే బాటలో నడుస్తారు.
- తప్పు ఒప్పుకొని నిజం చెప్పినప్పుడు.. వారితో సానుకూలంగా వ్యవహరించండి. చిన్నచిన్న తప్పులకు కూడా ఎక్కువగా రియాక్ట్ అవ్వకండి. మీ సానుకూలత.. పిల్లల్లో నిజాయతీని, నమ్మకాన్ని పెంచుతుంది.
- టీనేజర్లు నిజాలను దాచడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని గమనించండి. వారి స్నేహితులు, ఇతరుల ద్వారా వారి కదలికలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఎలాంటి ఇబ్బంది లేదని గుర్తిస్తే.. వారి స్వతంత్ర కాంక్షను అర్థం చేసుకోండి. అయితే, వారిపై ఓ కన్నేసి ఉంచడం మాత్రం మరచిపోకండి.



నేను సైతం.. తల్లిగా!

అమ్మపాలు అమృతం కన్నా గొప్పవి. పసిపాపలకు అమ్మ ప్రేమగా పట్టే పాలు.. వారి ఆకలి తీర్చడమే కాదు, ఆయువునూ పోస్తాయి. అయితే, రకరకాల కారణాల వల్ల చాలామంది శిశువులు తల్లిపాలకు దూరమవుతుంటారు. వారిని కాపాడేందుకు ఎందరో తల్లులు పాలు దానం చేసి... మాతృత్వాన్ని చాటుకుంటూ ఉంటారు. అమ్మపాలు పంచే అరుదైన సేవలో నేను సైతం అంటూ ముందుకొచ్చారు ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల. తల్లిపాలు దానం చేసి ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'శిశువులను అనారోగ్యాల బారిన పడకుండా తల్లిపాలు కాపాడుతాయి. పాలను దానం చేసి ఓ బిడ్డకు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఇచ్చినవాళ్లమవుతాం. అందుకే పాలను దానం చేసేందుకు ప్రతీ తల్లి ముందుకు రావాలి. ఈ పాలు అవసరమున్న చోట మనం వాళ్లకు దేవతలాగా కనిపిస్తాం. మిల్క్ బ్యాంక్‌లకు మద్దతివ్వండి' అంటూ రాసుకొచ్చింది జ్వాల. 2021లో నటుడు విష్ణు విశాల్‌ను పెండ్లి చేసుకున్న జ్వాల నాలుగేండ్లకు ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పటివరకు దాదాపు 30 లీటర్ల తల్లిపాలను ఆమె దానం చేశారు. గుత్త జ్వాల చూపుతున్న చొరవకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.



బ్లూ బెర్రీతో నో వర్రీ

నేటితరంలో చాలామంది ముఖంపై ముడతలతో బాధపడుతున్నారు. ముప్పైలలోనే వయసుడిగిన వాళ్లలా కనిపిస్తున్నారు. బ్యూటీని కాపాడుకోవడానికి తెగ వర్రీ అయిపోతున్నారు. అయితే, జీవనశైలి లోపాలు, ఆహారపు అలవాట్లే ముఖంపై ముడతలకు కారణమని బ్యుటీషియన్లు చెబుతున్నారు. బ్లూ బెర్రీలను తీసుకుంటే.. అందాన్ని కాపాడుకోవచ్చని సలహా ఇస్తున్నారు.



చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో బ్లూ బెర్రీలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో ముఖ సౌందర్యానికి ఉపయోగపడే విటమిన్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటి ఆక్సిడెంట్లు, పాలీఫినోల్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షించడంతోపాటు కొత్త చర్మ కణాలను ఉత్పత్తి చేయడంలో సాయపడతాయి. చిన్న వయసులోనే వృద్ధాప్య లక్షణాలు రాకుండా కాపాడుతాయి. బ్లూ బెర్రీలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు.. పర్యావరణ కాలుష్యం వల్ల చర్మానికి ఎదురయ్యే హానికరమైన ప్రభావాలను తగ్గించడంలో సమర్థంగా పనిచేస్తాయి. ఇందులో పుష్కలంగా లభించే యాంటి ఆక్సిడెంట్లు.. అకాల వృద్ధాప్యానికి కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి. ముడతలను తగ్గించడంలోనూ ముందుంటాయి. ఇక విటమిన్ సి, ఆంథోసైనిన్లు.. చర్మ కణాల నష్టాన్ని నివారిస్తాయి. విటమిన్ సి.. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. చర్మాన్ని బిగుతుగా, యవ్వనంగా ఉంచడానికి సాయపడుతుంది. బ్లూబెర్రీలలో దొరికే విటమిన్లు, ఖనిజాలు.. చర్మ కణాల మరమ్మతు, పునరుజ్జీవన ప్రక్రియను ప్రోత్సహిస్తాయి.

కొత్త స్పాన్సర్ అపోలో

రెండున్నరేండ్లకు రూ. 579 కోట్లకు డీల్

ఒక్కో మ్యాచ్‌కు రూ. 4.77 కోట్లు

ఢిల్లీ: టీమ్‌ఇండియాకు కొత్త జెర్సీ స్పాన్సర్ వచ్చింది. ఆన్‌లైన్ ఫాంటసీ స్పోర్ట్స్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో మూడేండ్ల ఒప్పందాన్ని మధ్యలోనే వదిలేసుకున్న 'డ్రీమ్ 11' స్థానాన్ని తాజాగా ప్రముఖ టైర్ల కంపెనీ 'అపోలో టైర్స్' భర్తీ చేయనుంది. రెండున్నరేండ్ల కాలానికి గాను అపోలో.. రూ. 579 కోట్లకు బిడ్ వేసి టీమ్‌ఇండియా జెర్సీ స్పాన్సర్‌షిప్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించింది. కాగా అపోలోతో తాజా డీల్.. గత డ్రీమ్ 11 ఒప్పందం (రూ. 358 కోట్లు)తో పోల్చితే రూ. 213 కోట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఈ ఒప్పందం రెండున్నరేండ్ల పాటు (2028 మార్చి) వరకు కొనసాగనుంది. ఇక నుంచి భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు ఆడే మూడు ఫార్మాట్ల మ్యాచ్‌లలో క్రికెటర్ల జెర్సీలపై 'అపోలో టైర్స్' పేరు ఉండనుంది. రెండున్నరేండ్లలో ఆ సంస్థ భారత జట్టు ఆడే 121 ద్వైపాక్షిక, 21 ఐసీసీ మ్యాచ్‌లకు జెర్సీ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. స్వదేశంలో అక్టోబర్ 2 నుంచి వెస్టిండీస్‌తో జరుగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ నుంచి అపోలో.. టీమ్‌ఇండియాతో ప్రయాణాన్ని ప్రారంభించనుంది.

మూడు కంపెనీల పోటాపోటీ..

డ్రీమ్ 11 నిష్క్రమణతో ఈనెల 2న బీసీసీఐ కొత్త స్పాన్సర్ కోసం టెండర్ల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా బిడ్డింగ్‌లో అపోలో.. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ కాన్వా (రూ. 544 కోట్లు), జేకే సిమెంట్స్ (రూ. 477 కోట్లు)తో తీవ్ర పోటీ నెదుర్కున్నా చివరికి వారికంటే ఎక్కువ చెల్లించి స్పాన్సర్‌షిప్ హక్కులను సొంతం చేసుకుంది.

మ్యాచ్‌కు నాలుగున్నర కోట్లు

ఈ ఒప్పందం ప్రకారం టీమ్‌ఇండియా ఆడే ఒక్కో మ్యాచ్‌కు అపోలో రూ. 4.77 కోట్లు (డ్రీమ్ 11 రూ. 4 కోట్లు చెల్లించేది) బీసీసీఐకి చెల్లించనుంది. టెండర్ల ప్రక్రియ సందర్భంగా బీసీసీఐ ఒక్కో మ్యాచ్‌కు రూ. 3.5 కోట్లు (ద్వైపాక్షిక), రూ. 1.5 కోట్లు (ఐసీసీ) కనీస ధరను నిర్ణయించగా అంతకంటే ఎక్కువగానే ఆదాయాన్ని ఆర్జించనుండటం గమనార్హం.

పాక్‌కు భంగపాటు

దుబాయ్: ఆసియా కప్‌లో ఆదివారం భారత్‌తో మ్యాచ్ సందర్భంగా ఆ జట్టు ఆటగాళ్లు తమకు హ్యాండ్‌షేక్ ఇవ్వలేదని, దీనికి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను బాధ్యుడిగా చేస్తూ అతడిని తొలగించాలని ఐసీసీ గడపతొక్కిన పాకిస్థాన్‌కు భంగపాటు తప్పలేదు. పైక్రాఫ్ట్‌ను తొలగించేది లేదని ఐసీసీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి సోమవారం రాత్రి లేఖ రాసినట్టు ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఐసీసీ ఎలైట్ ప్యానెల్‌లో ఉన్న పైక్రాఫ్ట్‌కు 695 మ్యాచ్‌లలో (మూడు ఫార్మాట్లలో కలిపి) రిఫరీగా పనిచేసిన అనుభవముంది. పైక్రాఫ్ట్‌ను తొలగించకుంటే ఆసియా కప్ నుంచి వైదొలుగుతామని పీసీబీ బెదిరించినట్టు వార్తలు వచ్చినా ఐసీసీ తాజా లేఖతో ఆ జట్టు వెనక్కి తగ్గింది. బుధవారం పాక్ యూఏఈతో మ్యాచ్ ఆడనుంది. ఇప్పటికే భారత్ చేతిలో ఓడిన దాయాదికి యూఏఈతో ఓడితే సూపర్-4 బెర్తు ఆశలు ఆవిరవుతాయి.

సత్తాచాటిన కుశారె

హైజంప్‌లో ఆరో స్థానం • ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీ



టోక్యో: ప్రతిష్ఠాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సర్వేశ్ కుశారె సత్తాచాటాడు. మంగళవారం జరిగిన పురుషుల హైజంప్ ఫైనల్లో కుశారె తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన(2.28మీ) కనబరుస్తూ ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో సెంటీమీటర్ తేడాతో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారత హైజంపర్‌గా నిలిచిన కుశారె ప్రత్యర్థులకు దీటైన పోటీ నివ్వడంలో సఫలమయ్యాడు. నాసిక్(మహారాష్ట్ర)లోని సాధారణ ఉల్లిరైతు కుటుంబానికి చెందిన 30 ఏండ్ల కుశారె మెగాటోర్నీలో అంచనాలకు మించి రాణించాడు. 2022లో నమోదు చేసిన తన అత్యుత్తమ ప్రదర్శన(2.27మీ)ను తాజాగా మూడో ప్రయత్నంలో అధిగమించి ఔరా అనిపించాడు. అయితే 2.31మీటర్ల ఎత్తు దూకడంలో విఫలమైన కుశారె ముందంజ వేయలేకపోయాడు. తొలి ప్రయత్నంలో 2.20మీటర్లు దూకిన కుశారె..ఆ తర్వాత 2.24మీటర్లు ఆ పై 2.28మీటర్లు ఎగిరేందుకు మూడో ప్రయత్నంలో సఫలమయ్యాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన ఈ ఫైనల్లో హమీశ్ కెర్ (2.36మీ, న్యూజిలాండ్), వు సాంగ్‌యోక్ (2.34మీ, కొరియా) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. కెరీర్ తొలినాళ్లలో గడ్డితో తయారు చేసిన మ్యాట్‌లపై ప్రాక్టీస్ చేసిన ఈ యువ అథ్లెట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడే స్థాయికి ఎదిగాడు.

యువీ, ఊతప్పకు ఈడీ సమన్లు



ఢిల్లీ: భారత మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్పతో పాటు ప్రముఖ నటుడు సోనూ సూద్‌కు ఈడీ సమన్లు పంపింది. ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ 1xBetను ప్రమోట్ చేసినందుకు గాను ఈడీ వీరికి సమన్లు అందజేసింది. ఈనెల 22న ఊతప్ప, 23న యువీ, 24న సోనూ సూద్ విచారణకు రావాలని ఆదేశించింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద వీరి స్టేట్‌మెంట్స్‌ను రికార్డు చేయనున్నారు. ఈ కేసులో ఈడీ ఇప్పటికే సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌నూ విచారించింది.

ప్రిక్వార్టర్స్‌కు సింధు

షెన్‌జెన్ (చైనా): భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆమె.. 21-4, 21-10తో డెన్మార్క్‌కు చెందిన జాకొబ్సెన్‌పై అలవోక విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆయుష్.. 19-21, 21-12, 16-21తో చౌ టీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్-రుత్విక ద్వయం 17-21, 11-21తో షిమొగమి-హొబర (జపాన్) జోడీ చేతిలో ఓడింది.

రేసులోనే బంగ్లా

అఫ్గానిస్థాన్‌పై అద్భుత విజయం • రాణించిన తంజిద్, ముస్తాఫిజుర్



తంజిద్ (52)

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 154/5(తంజిద్ 52, హసన్ 30, నూర్ 2/23, రషీద్ 2/26), **అఫ్గానిస్థాన్:** 20 ఓవర్లలో 146 ఆలౌట్(గుర్బాజ్ 35, ఒమర్జాయ్ 30, ముస్తాఫిజుర్ 3/28, నసుమ్ 2/11)

అబుదాబి: ఆసియా కప్ టోర్నీలో బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ పోరు అభిమానులను అలరించింది. మంగళవారం ఆఖరి దాకా ఆసక్తికరంగా సాగిన పోరులో బంగ్లా 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో సూపర్-4 రేసులో నిలిచింది. బంగ్లా నిర్దేశించిన 155 పరుగుల లక్ష్యఛేదనలో అఫ్గన్ 20 ఓవర్లలో 146 స్కోరుకు ఆలౌటైంది. గుర్బాజ్ (35), ఒమర్జాయ్ (30) రాణించినా మిగతావారు విఫలమయ్యారు. ఇన్నింగ్స్ తొలి బంతికి సెదికుల్లా (0) ఔట్ కాగా, ఇబ్రహీం(5), నయిబ్ (16), నబి (15), కరీమ్ (6) విఫలమయ్యారు. ముస్తాఫిజుర్ (3/28), నసుమ్ (2/11), రిశాద్(2/18), తస్కిన్(2/34) రాణించారు. గెలుపు కోసం కడదాకా ప్రయత్నించిన అఫ్గన్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఓటమి వైపు నిలిచింది. గ్రూపు-బీలో ప్రస్తుతం శ్రీలంక(4), బంగ్లాదేశ్(4), అఫ్గానిస్థాన్(2) టాప్-3లో ఉండగా, హాంకాంగ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

తంజిద్ దూకుడు:

టాస్ గెలిచిన బంగ్లాదేశ్..బ్యాటింగ్ వైపు మొగ్గుచూపింది. ఓపెనర్లు తంజిద్ హసన్(52), సైఫ్ హసన్(30) బంగ్లాకు మెరుగైన శుభారంభం అందించారు. అఫ్గన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఆది నుంచే దూకుడుగా ఆడారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే సున్నా పరుగుల వద్ద ఫజుల్లా బౌలింగ్‌లో హసన్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. దీన్ని అవకాశంగా మలుచుకుంటూ హసన్, తంజిద్ బ్యాట్లకు పనిచెప్పారు. ఫజుల్లా మూడో ఓవర్‌లో నాలుగు ఫోర్లు కొట్టిన తంజిద్..ఎల్బీడబ్ల్యూపై అంపైర్ కాల్‌తో బతికి పోయాడు. ఒక రకంగా ఇద్దరు ఔట్లను తప్పించుకుని బౌండరీలతో ఆకట్టుకున్నారు. అఫ్గన్ బౌలర్లను ఏ మాత్రం కుదురుకోనివ్వని తంజిద్..ఆరవ ఓవర్‌లో రెండు భారీ సిక్స్‌లతో విరుచుకుపడటంతో బంగ్లా వికెట్ నష్టపోకుండా 59 పరుగులు చేసింది. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన కెప్టెన్ రషీద్‌ఖాన్ తన తొలి ఓవర్‌లోనే సైఫ్ హసన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి అఫ్గన్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. హసన్ ఔట్‌తో తొలి వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ లిటన్‌దాస్(9) స్వల్ప స్కోరుకే నిష్క్రమించాడు. ఈ క్రమంలో తౌహిద్ హృదయ్(26)తో కలిసి తంజిద్ బ్యాటింగ్ కొనసాగించాడు. 28 బంతుల్లో తంజిద్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న తంజిద్‌ను నూర్ అహ్మద్ ఔట్ చేయడంతో మ్యాచ్ అఫ్గన్ వైపు తిరిగింది. మిడిల్ ఓవర్లలో అఫ్గన్ స్పిన్నర్లు..బంగ్లా బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ఆఖర్లో షమీమ్ (11), జేకర్ అలీ(12 నాటౌట్), నురుల్ హసన్(12 నాటౌట్) ఆకట్టుకున్నారు. రషీద్‌ఖాన్, నూర్ అహ్మద్ రెండేసి వికెట్లు తీశారు.

హెచ్‌సీఏ అక్రమాలపై విచారణ జరపండి

- బీసీసీఐకి టీడీసీఏ చీఫ్ అల్లీపురం లేఖ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేసేందుకు కమిటీ వేయాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి..బీసీసీఐని డిమాండ్ చేశారు. గత 90 ఏండ్లుగా తెలంగాణ క్రికెటర్లకు తీరని అన్యాయం జరుగుతుందని, మరో 300ల క్లబ్‌లకు అనుమతిచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని బీసీసీఐని కోరారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాకు అల్లీపురం మెయిల్ ద్వారా లేఖ పంపారు. '2005 నుంచి హెచ్‌సీఏలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరుపాలి. తెలంగాణ 31జిల్లాలకు 300 క్లబ్‌లు మంజూరు చేయాలి' అని అల్లీపురం కోరారు.

కొన్‌స్టాస్ సెంచరీ



లక్నో: భారత పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా 'ఏ' జట్టు అనధికారిక తొలి టెస్టులో శుభారంభం చేసింది. లక్నో వేదికగా భారత 'ఏ' జట్టుతో జరుగుతున్న మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న ఆ జట్టు.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 337/5 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. యువ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (109) శతకంతో కదం తొక్కగా కెల్లావె (88), కొనొలి (70 నాటౌట్) రాణించారు. భారత 'ఏ' బౌలర్లలో హర్ష్ దూబే (3/88) ఫర్వాలేదనిపించాడు.



అర్మాన్ పసిడి ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌కు చెందిన మాస్టర్ అర్మాన్ నజీముద్దీన్ రెండు పసిడి పతకాలతో సత్తాచాటాడు. ప్రస్తుతం కవిత తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్న అర్మాన్..గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఒకటవ ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో టోర్నీలో అండర్-14 కేటగిరీలో స్వర్ణాలతో మెరిశాడు. బ్లాక్‌బెల్ట్ డాన్-2 హోదా కల్గిన అర్మాన్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ యువ తైక్వాండో ప్లేయర్ విజయం సహచరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అతని కోచ్‌లు పేర్కొన్నారు.



టెకీలకు హైదరాబాదే అడ్డా

జాబ్ మార్కెట్‌లో బెంగళూరుకు గట్టి పోటీ

డాటా ఇంజినీరింగ్, ఏఐ, ఆర్‌అండ్‌డీల్లో పెద్ద కొలువులు ఇక్కడే

హైదరాబాద్/బెంగళూరు, సెప్టెంబర్ 16: టెక్నాలజీ జాబ్ మార్కెట్‌లో బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీనిస్తున్నది. సీనియర్ ఇంజినీర్లకు, కొత్త బృందాల నిర్మాణానికి దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌నే కేంద్రంగా ఎంచుకుంటున్నాయి మరి. దీంతో డాటా ఇంజినీరింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ), రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) విభాగాలకు కేరాఫ్ అడ్రస్‌గా విరాజిల్లుతూ వస్తున్న బెంగళూరుకు హైదరాబాద్ వేగంగా ప్రత్యామ్నాయమవుతున్నదిప్పుడు. హైదరాబాద్‌కు సీనియర్ స్థాయి ఉద్యోగులను కంపెనీలు పంపుతున్నాయని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి.

పెరుగుతున్న జీతాలు

బెంగళూరుతో పోల్చితే ఆయా ఉద్యోగుల వార్షిక జీతాలు హైదరాబాద్‌లో ఎక్కువగా పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ ఇంజినీరింగ్ ఉద్యోగుల జీతాలు ఈ ఏడాది 8.6 శాతం పెరిగి హైదరాబాద్‌లో రూ.30.4 లక్షలకు చేరాయి. బెంగళూరులో 5.6 శాతం వృద్ధితో రూ.33.8 లక్షలుగా ఉన్నాయని టీమ్‌లీజ్ సంస్థ తెలిపింది. అలాగే ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌డీ ఉద్యోగుల వేతనాలు హైదరాబాద్‌లో 11.1 శాతం ఎగిసి రూ.20 లక్షలకు చేరితే, బెంగళూరులో 6.5 శాతం పెరిగి రూ.24.5 లక్షలుగానే ఉన్నాయి. ఇక వేగంగా పెరుగుతున్న జీతాలు, భారీ సాలరీ ప్యాకేజీలే గాక.. జీవనశైలి, నివాసయోగ్యత కూడా బాగుండటం, ఖర్చులు తక్కువగా ఉండటం హైదరాబాద్‌పట్ల ఉద్యోగుల్లో డిమాండ్‌ను పెంచుతున్న అంశాలుగా నిలుస్తున్నాయని ఉద్యోగ నియామకాల కన్సల్టెన్సీ సంస్థ అడెకో భారతీయ మేనేజర్ సునీల్ చెమ్మన్‌కోటిల్ తెలిపారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులపై లాభాలు, ఇతరత్రా సదుపాయాలు చిన్న కంపెనీలనూ ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

ఇందుకే హైదరాబాద్‌కు డిమాండ్

- విస్తరణకు వీలుగా నగరం చుట్టూ పెద్ద మొత్తంలో భూములు
- జీవన వ్యయం తక్కువగా ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు
- పరిమిత ఖర్చుల్లోనే కంపెనీల ఏర్పాటుకు అవకాశాలు
- పుష్కలంగా నెలకొల్పుతున్న జీసీసీలు. ఇప్పటికే 355 ఉన్నాయి.
- ఫార్మాస్యూటికల్, ఇంజినీరింగ్‌లకు హబ్‌గా పేరు
- అందుబాటులో పెద్ద ఎత్తున సాంకేతిక ప్రతిభ ఉన్న గ్రాడ్యుయేట్లు

గూగుల్, మైక్రోసాఫ్ట్, జేపీమోర్గాన్, డీబీఎస్ బ్యాంక్, బాష్, హ్యుందాయ్ మొబిస్, ఈస్ట్‌మన్ కెమికల్, మెటా, గోల్డ్‌మన్ సాచ్స్ సంస్థలు తమ హైదరాబాద్ సెంటర్లను ఏఐ ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌లుగా రూపాంతరం చేస్తున్నాయి. క్వాల్‌కామ్, మైక్రాన్, వెరిజోన్, ఏబీబీ వంటి అమెరికా, స్విస్ కంపెనీలతో పాటు ఎల్‌అండ్‌టీ వంటి దేశీయ సంస్థలూ హైదరాబాద్‌లో కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాయి.

-శ్రీని వడ్డెపల్లి, హెచ్‌ఎఫ్‌ఎస్ రిసెర్చ్

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ @ 5

హైదరాబాద్, సెప్టెంబర్ 16: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) మరోసారి సత్తాచాటింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ ఎంబీఏ కాలేజీల జాబితాలో టాప్-5 ర్యాంక్ సాధించింది. ఈ విషయాన్ని లింక్డిన్ తాజా సర్వేలో వెల్లడైంది. వరుసగా మూడో ఏడాది టాప్-100 గ్లోబల్ బిజినెస్ స్కూల్స్ జాబితాను విడుదల చేసింది. దీంట్లో గతేడాది ఆరో స్థానంలో నిలిచిన ఐఎస్‌బీ..ఈసారి ఐదో స్థానానికి ఎగబాకింది. అలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-అహ్మదాబాద్ తన స్థానాన్ని 19వ ర్యాంక్ నుంచి 17 ర్యాంక్‌కు పెంచుకున్నది. ఈ జాబితాలో నూతనంగా ఐఐఎం కోల్‌కతా 16వ స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఐఐఎం బెంగళూరుకు 20వ స్థానం లభించింది.

గోల్డ్ @1,15,100

దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హై

ఒక్కరోజే రూ.1,800 ఎగిసిన తులం ధర

కిలో వెండి రేటు రూ.1,32,870



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్నట్టుగా పరుగులు పెడుతున్నాయి. రోజుకో సరికొత్త రికార్డుల్ని నెలకొల్పుతున్నాయి. మంగళవారం న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్ (స్థానిక బులియన్ మార్కెట్)లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.1,800 పుంజుకొని తొలిసారి రూ.1,15,000 మార్కును అధిగమిస్తూ రూ.1,15,100గా నమోదైంది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇప్పటి దాకా భారతీయ విపణిలో ఇదే రికార్డు రేటు. కాగా, బలహీనపడిన డాలర్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న అంచనాలు.. పుత్తడికి డిమాండ్‌ను తీసుకొచ్చాయి.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోనూ పసిడి ధరలు అప్‌ట్రెండ్‌లోనే ఉన్నాయి. 24 క్యారెట్ తులం రూ.870 పెరిగి రూ.1,11,930 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.800 అధికమై రూ.1,02,600గా ఉన్నది. ఇదిలావుంటే ఢిల్లీలో వెండి ధరలూ నయా రికార్డుల్ని సృష్టిస్తున్నాయి. సోమవారం ముగింపుతో పోల్చితే రూ.570 ఎగిసి కిలో మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,32,870ని తాకింది. కాగా, ప్రస్తుత పండుగ సీజన్‌లో ధరల్లో స్థిరత్వం లోపించడం.. అమ్మకాలను ప్రభావితం చేస్తున్నదని పలువురు నగల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరిగితే వ్యాపారం పడిపోవడం ఖాయమనే అభిప్రాయపడుతున్నారు.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైని తాకుతూ ఔన్స్ గోల్డ్ రేటు 3,698.94 డాలర్లుగా ఉన్నది. వడ్డీరేట్లను బుధవారం ఫెడ్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చన్న అంచనాలు మార్కెట్ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. దీంతో అటు బయ్యర్లు, ఇటు ఇన్వెస్టర్ల నుంచి గోల్డ్‌కు డిమాండ్ అమాంతం పెరిగిపోయిందన్న విశ్లేషణలు వస్తున్నాయి. నిజానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా వడ్డీరేట్లను బాగా తగ్గించాలని ఫెడ్ రిజర్వ్‌పై ఎప్పట్నుంచో ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఆ ప్రభావం ఈసారి ద్రవ్యసమీక్షలో తప్పక ఉంటుందనే అంటున్నారంతా. డిసెంబర్ నుంచి ఫెడ్ వడ్డీరేట్లు తగ్గలేదు. ఇక ఔన్స్ సిల్వర్ రేటు 42.72 డాలర్లు పలుకుతున్నది.

దీపావళికి రూ. 1,50,000కు..?

ప్రస్తుత ట్రెండ్‌ను చూస్తే.. ఈసారి దీపావళికి తులం 24 క్యారెట్ బంగారం ధర దేశీయ మార్కెట్‌లో రూ.1,50,000 పలుకవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ 15 రోజుల్లో రేటు రూ.10,000దాకా పెరగడం గమనార్హం. ఈ నెల 1న రూ.1,05,670 వద్ద ముగిసింది. ఈ క్రమంలోనే వచ్చే నెలలో రాబోయే దీపావళికల్లా మార్కెట్‌లో గోల్డ్ విలువ 10 గ్రాములు రూ.1,40,000 నుంచి 1,50,000 మధ్య కదలాడే వీలుందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా అమెరికాతో ట్రేడ్ వార్ ముదిరితే ధరలు పరుగులు పెట్టడం ఖాయమనే అంటున్నారు. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను స్టాక్స్ నుంచి సురక్షిత పెట్టుబడి సాధనమైన గోల్డ్‌కే మళ్లిస్తారని.. దీంతో దేశ, విదేశీ మార్కెట్లలో రేట్లు ఎగబాకుతాయనే విశ్లేషణలున్నాయి. ఏదిఏమైనా దేశీయంగా భవిష్యత్తులో ధరలు ఇక లక్ష రూపాయల దిగువకు రావడం అసాధ్యమనే అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు.

భారీగా లాభపడిన సూచీలు



ముంబై, సెప్టెంబర్ 16: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. భారత్-అమెరికా దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండటంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మళ్లీ 82 వేల మైలురాయిని అధిగమించింది. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 594.95 పాయింట్లు లాభపడి 82,380.69 పాయింట్ల వద్ద లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 169.90 పాయింట్లు అందుకొని 25,239.10 వద్ద స్థిరపడింది. వాణిజ్యంపై అమెరికా-భారత్ దేశాల మధ్య ప్రారంభమైన చర్చలు ఈసారి కొలిక్కి వచ్చే అవకాశాలుండటం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం తగ్గించే అవకాశాలుండటం కూడా కొనుగోళ్లకు ఉత్సాహాన్ని నింపిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వచ్చేవారం నుంచి జీఎస్టీ నూతన రేట్లు అమలులోకి రానుండటంతో వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయన్నారు.

- కొటక్ మహీంద్రా బ్యాంక్ షేరు 2.55 శాతం టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు ఎల్‌అండ్‌టీ, మహీంద్రా, మారుతి, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బీఈఎల్, టీసీఎస్‌లు ఒక్క శాతానికి పైగా బలపడ్డాయి.
- అలాగే అదానీపోర్ట్స్, ఎస్బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, టైటాన్, సన్ ఫార్మా, రిలయన్స్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ, టాటా మోటార్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.
- హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా సర్వీసెస్ సూచీ అత్యధికంగా 1.67 శాతం, టెలికాం 1.50 శాతం, వాహన రంగ సూచీ 1.43 శాతం, టెక్నాలజీ 1.05 శాతం, ఇండస్ట్రియల్స్ 1.05 శాతం, రియల్టీ 1.02 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.



ఓలా రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్ ధర రూ.1,89,999

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఓలా..మార్కెట్లోకి ప్రత్యేక ఎడిషన్‌గా రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 9.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ ధరను రూ. 1, 89,999గా నిర్ణయించింది. దీంతోపాటు 5.2 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఎస్1 ప్రొ+ మాడల్‌ను రూ.1,69,999కి విక్రయించనున్నది. ఈ రెండు వాహనాలు ఈ నవరాత్రి నుంచి డెలవరి చేయనున్నట్టు ప్రకటించింది. దీంతోపాటు స్పోర్ట్స్ స్కూటర్ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నూతన ఎస్1 ప్రొ స్పోర్ట్ మాడల్‌ను విడుదల చేయనున్నట్టు ప్రకటించింది.

వాణిజ్య

సింగరేణికి బంగారం అన్వేషణ లైసెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): వేలంపాటలో బంగారం అన్వేషణను దక్కించుకున్న సింగరేణి సంస్థ, మంగళవారం ఇందుకు సంబంధించిన లైసెన్స్‌ను అందుకున్నది. హైదరాబాద్ టీ-హబ్‌లో క్రిటికల్ మైనింగ్‌పై నిర్వహించిన సెమినార్‌లో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం లైసెన్స్‌ను అందుకున్నారు. కర్ణాటకలోని దేవదుర్గ్ ప్రాంతంలో రాగి, బంగారం అన్వేషణ టెండర్‌ను సింగరేణి దక్కించుకున్న విషయం తెలిసిందే. 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ అన్వేషణను చేపట్టనున్నది.

ఐఫోన్లకు గిరాకీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశవ్యాప్తంగా ఐఫోన్లకు గిరాకీ నెలకొన్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఐఫోన్ ప్రొ మ్యాక్స్ 17 మాడల్‌కు కొనుగోలు దారుల నుంచి విశేష స్పందన రావడంతో భారత్‌తోపాటు అమెరికాలో కంపెనీకి చెందిన రిటైల్ అవుట్‌లెట్ల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. బుకింగ్‌లు ఆరంభించిన మూడు రోజుల్లోనే ఈ మాడల్ బుకింగ్‌లు నిలిపివేసింది. భారత్‌లో ఐఫోన్ ప్రొ మ్యాక్స్ సీరిస్ మాడల్ భారత్‌లో లభించడం లేదని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐఫోన్ 17 సిరీస్ ఫోన్లు రూ.82,900 నుంచి రూ.2,29,900 లోపు భారత్‌లో లభించనున్నాయి.

ఫార్మాకోసం ప్రత్యేక స్కీం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఫార్మాస్యూటికల్, మెడ్‌టెక్ రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేక స్కీంను ప్రవేశపెట్టబోతున్నట్టు ఫార్మాస్యూటికల్స్ సెక్రటరీ అమిత్ అగర్వాల్ తెలిపారు. ఫార్మా, మెడ్‌టెక్నాలజీ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ స్కీం రూపకల్పన చేస్తున్నట్టు, ఈ స్కీం కింద రూ.5 వేల కోట్ల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్టు చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.